తెలంగాణ
తెలుగు జాతీయ దినపత్రిక
# తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం




సంపుటి : 02 సంచిక 353 హైదరాబాద్ : సంపాదకులు : గున్నాల అనిల్‌రెడ్డి ఆదివారం 8-06-2025 పేజీలు : 12 వేల : 5

Published from: Hyderabad, Rangareddy, Nizamabad, Adilabad, And Bhadradri Kothagudem, Vijayavada, Vishakapatnam, Kurnool, Anantapur




- ముగ్గురితో రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ.. ప్రమాణ స్వీకారం చేసిన నూతన మంత్రులు
- రాజ్‌భవన్‌లో నిరాడంబరంగా కార్యక్రమం
- గడ్డం వివేక్, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరితో ప్రమాణం చేయించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- హాజరైన సీఎం రేవంత్, మంత్రులు, పీసీసీ చీఫ్, శాసనమండలి చైర్మన్, శాసనసభ స్పీకర్, నేతలు
- 9 నిమిషాల్లోనే ముగిసిన ప్రమాణ స్వీకారం
- రేవంత్ క్యాబినెట్‌లో 14కు చేరిన మంత్రుల సంఖ్య
- స్థానిక ఎన్నికల తర్వాత మిగిలిన 3 ఖాళీల భర్తీ!

# తొలిసారి..తీన్మార్


**హైదరాబాద్, జూన్ 8:** సుదీర్ఘకాలంగా వాయిదా పడుతూ వచ్చిన రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ ఎట్టకేలకు జరిగింది. క్యాబినెట్‌లో ఖాళీగా ఉన్న ఆరు స్థానాల్లో.. తొలి విడతగా మూడింటిని భర్తీ చేశారు. మూడు బెర్తులనూ తొలిసారి ఎమ్మెల్యేలుగా గెలిచిన వారికే కట్టబెట్టారు. ఈ మేరకు ముగ్గురు కొత్త మంత్రులు ఆదివారం పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్ దర్బార్ హాల్‌లో నిరాడంబరంగా జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నూతన మంత్రులతో ప్రమాణం చేయించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో.. గడ్డం వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వాకిటి శ్రీహరి మంత్రులుగా ప్రమాణం చేశారు. మొదటిగా.. మంచిర్యాల జిల్లా చెన్నూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న గడ్డం వివేక్ ఇంగ్లిషులో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం జగిత్యాల జిల్లా ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తెలుగులో ప్రమాణం చేశారు. ఒక్కొక్కరుగా పత్రాలపై సంతకం చేసి తొలుత గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వద్దకు, అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు వెళ్లి కృతజ్ఞతలు తెలుపగా.. వారు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. పదవీ ప్రమాణ స్వీకారం చేసేందుకు మంత్రుల పేర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు చదివారు. ఈ కార్యక్రమానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి, జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ధనసరి అనసూయ సీతక్క, కొండా సురేఖ, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మజ్లిస్ శాసనసభాపక్ష నాయకుడు అక్బరుద్దీన్ ఒవైసీ, ఎమ్మెల్సీ కోదండరాం, డీజీపీ జితేందర్ తోపాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నూతనంగా పదవీ ప్రమాణ స్వీకారం చేసిన మంత్రుల కుటుంబసభ్యులు హాజరయ్యారు. కాగా, ముగ్గురు నూతన మంత్రుల ప్రమాణం కేవలం 9నిమిషాల్లోనే పూర్తయింది. మధ్యాహ్నం 12.13 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం.. 12.23 గంటలకే ముగిసింది. అయితే మంత్రుల ప్రమాణ స్వీకారానికి సంబంధించి రాజ్‌భవన్ ముద్రించిన ఆహ్వాన పత్రికల్లో కార్యక్రమం మధ్యాహ్నం 12.19 గంటలకు ఉంటుందని పేర్కొంది. కానీ, చెప్పిన దానికంటే 6 నిమిషాల ముందుగానే కార్యక్రమం మొదలైంది. కాగా, కొత్త మంత్రులకు సీనియర్ మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు నూతన మంత్రులకు 'ఎక్స్' వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. వారితోపాటు శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించనున్న జాటో తు రాంచందర్‌నాయక్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## ఉగ్రవాదులు మళ్లీ తోకాడిస్తే
# విధ్వంసమే

**చెన్నై, జూన్ 8:** ఆపరేషన్ సిందూర్ ఇంకా పూర్తి కాలేదని, ఉగ్రవాదులు మళ్లీ తోకాడిస్తే సర్వనాశనమేనని కేంద్ర హెూంమంత్రి అమిత్‌షా హెచ్చరించారు. ఆదివారం తమిళనాడులోని మదురైలో జరిగిన బీజేపీ రాష్ట్ర నేతల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలో త్రివిధ దళాలు ఉగ్ర స్థావరాలను నాశనం చేశాయన్నారు. పాక్ ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్‌లను మన సైనికులు కూల్చివేశారని తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌కు తమిళనాడు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందని పేర్కొన్నారు. మరోవైపు రాష్ట్ర రాజకీయాలపైనా అమిత్‌షా కీలక వ్యాఖ్యలు చేశారు. తమిళనాట వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తుందని అన్నారు. అంతకుముందు అమిత్‌షా మదురైలోని సుప్రసిద్ధ మీనాక్షి, సుందరేశ్వరర్ ఆలయాన్ని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.



# దేశంలో 6 వేలు దాటిన కొవిడ్ కేసులు



న్యూఢిల్లీ , జూన్ 8: దేశంలో కొవిడ్ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆదివారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా యాక్టివ్ కొవిడ్ కేసుల సంఖ్య 6వేల మార్కును దాటి 6,133కు చేరుకుంది. గత 48 గంటల్లోనే ఏకంగా 769 కొత్త కేసులు నమోదయ్యాయి. అలాగే గత 24 గంటల్లో 6 మరణాలు సంభవించాయి. దీంతో ఈ ఏడాది జనవరి నుంచి మరణాల సంఖ్య 65కు చేరుకుంది. ఇక దేశవ్యాప్తంగా చూస్తే కేరళలో కొవిడ్ ప్రభావం ఎక్కువగా ఉంది. కొవిడ్ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. సంసిద్ధతను పరి?శీలించడానికి గాను మాక్ డ్రిల్స్ నిర్వహిస్తోంది.

## త్వరలో మరో ముగ్గురికి
# పదవులు

- మల్‌రెడ్డికి అప్పుడు అవకాశం కల్పించేందుకు ప్రయత్నిస్తాం
- ఈసారి కుల సమీకరణలతోనే ఆయనకు చోటు దక్కలేదు
- టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్



**చాదర్‌ఘాట్, జూన్ 8:** త్వరలో చేపట్టే క్యాబినెట్ విస్తరణలో మరో మూడు మంత్రి పదవులు భర్తీ చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు. ఈసారి మంత్రివర్గ విస్తరణలో కుల సమీకరణాల నేపథ్యంలో ఇబ్రహీం పట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి చోటు దక్కలేదని.. వచ్చేసారి ఆయనకు చోటు కల్పించే ప్రయత్నం చేస్తామన్నారు. మంత్రి పదవికి దక్కకపోవ డంతో అసంతృప్తికి గురైన మల్‌రెడ్డి రంగారెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేయనున్న విషయం తెలిసి మహేశ్ గౌడ్‌తోపాటు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం రాత్రి హుటాహుటిన మలక్‌పేట తిరుమలహిల్స్‌లోని ఆయన నివాసానికి వచ్చి బుజ్జగించారు. అనంతరం ఎమ్మెల్యే మల్‌రెడ్డితో కలిసి వారు మీడియాతో మాట్లాడారు. అధిష్ఠానం ఆదేశాల మేరకు మూడు స్థానాలతోనే క్యాబినెట్ విస్తరణ జరిగిందని మహేశ్ గౌడ్ చెప్పారు. ప్రస్తుత పరిస్థితిని అధిష్ఠానానికి కూడా వివరించా మన్నారు. రాష్ట్రంలోని 40 శాతం జనాభా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోనే ఉంటుందని, భవిష్యత్తులో ఈ జిల్లాలకు న్యాయం చేస్తామని హామీనిచ్చారు.

# మాగంటికి కన్నీటి వీడ్కోలు

## ఆదివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే

- నివాళులర్పించిన సీఎం రేవంత్, భట్టి, నేతలు - కన్నీటి పర్యంతమైన మాజీ సీఎం కేసీఆర్
- ఆస్పత్రి నుంచి మహాప్రస్థానం వరకు - మాగంటి కుటుంబం వెంట కేటీఆర్, హరీశ్
- మాగంటి కుమారుడి వెంట ఉన్న హిమాన్షు - చివరి చూపుకోసం భారీగా తరలివచ్చిన
- బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు - అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు



**హైదరాబాద్ జూన్ 8 :** జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ (62) కన్నుమూశారు. ఈ నెల 5న మధ్యాహ్నం తీవ్ర గుండెపోటుతో గచ్చిబౌలి ఏఐజీ ఆస్పత్రిలో చేరిన ఆయన.. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున 5.45 గంటలకు తుదిశ్వాస విడిచారు. మాగంటి గోపీనాథ్‌కు భార్య, ముగ్గురు పిల్లలు వాత్సల్యనాథ్, అక్షర నాగ, దిశిర ఉన్నారు. ఆయన మృతి విషయం తెలిసి బీఆర్ఎస్ శ్రేణులు, అనుచరులు, మిత్రులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆయన భార్య శైలిమ, తనయుడు హిమాన్షు, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, పలువురు పార్టీ నేతలు, అభిమానులు ఆస్పత్రికి చేరుకున్నారు. మాగంటి భౌతికకాయాన్ని ప్రత్యేక వాహనంలో మాదాపూర్ వసంత హైట్స్‌లోని స్వగృహానికి తీసుకెళ్లారు. మాగంటి గోపీనాథ్ చివరి చూపుకోసం నేతలు, ప్రముఖులు, జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఆయన నివాసానికి తరలివచ్చారు. మాగంటి భౌతికకాయానికి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్, మండలి చైర్మన్ గుత్తాసుఖేందర్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి, పొంగులేటి, పొన్నం, తుమ్మల, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, సినీనటుడు మాగంటి మురళీమోహన్, ఏపీ మంత్రి నారా లోకేశ్, ఆయన సతీమణి నారా బ్రాహ్మణితోపాటు బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నేతలు నివాళులు అర్పించారు. నేతలు, అభిమానులు సందర్శన అనంతరం ఆదివారం సాయంత్రం గోపీనాథ్ అంతిమయాత్ర మొదలైంది. మాదాపూర్‌లో నివాసం నుంచి ప్రారంభమైన మాగంటి అంతిమయాత్ర మహాప్రస్థానం వరకు సాగింది. అక్కడ ప్రభుత్వ లాంఛనాలతో మాగంటి అంత్యక్రియలు జరిగాయి. చితికి గోపీనాథ్ కుమారుడు వాత్సల్యనాథ్ నిప్పంటించారు.

### కన్నీటి పర్యంతమైన కేసీఆర్

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఉదయం 11.30 గంటల సమయంలో మాగంటి నివాసానికి చేరుకుని భౌతికకాయం వద్ద నివాళి అర్పించారు. ఈ సమయంలో కేసీఆర్ భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు. మాగంటి కుమారుడు వాత్సల్యనాథ్‌ను దగ్గరికి తీసుకొని ఓదార్చారు. తర్వాత ఇంటి లోపలికి వెళ్లి మాగంటి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాగంటి ఎంతో కష్టపడి ఎదిగారని, సౌమ్యుడిగా, ప్రజానేతగా పేరుపొందారని, ఆయన మరణం తీరని లోటని కేసీఆర్ పేర్కొన్నారు.

# 20న ఎల్బీ స్టేడియంలో యోగా వేడుకలు

- ఎమర్జెన్సీకి 50 ఏళ్లు నిండిన సందర్భంగా యువతకు అవగాహన కార్యక్రమాలు: కిషన్‌రెడ్డి



**బర్కత్‌పుర, జూన్ 8 :** యోగా ప్రాధాన్యాన్ని గుర్తించిన ఐక్యరాజ్య సమితి జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించి పదేళ్లు నిండుతున్న సందర్భంగా ఈ నెల 20న ఎల్బీ స్టేడియంలో యోగా ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. యోగా వేడుకలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందని అన్నారు. 20న ఉదయం 5 గంటలకు నిర్వహించే వేడుక ల్లో అందరూ భాగస్వాములు కావాలని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాల యంలో యోగా వేడుకల సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జె న్సీని ప్రకటించి 50 ఏళ్లు నిండుతున్న సందర్భంగా నాటి చీకటి రోజుల వాస్తవాలను, ప్రజలు పడిన ఇబ్బందులను నేటి యువతకు తెలియజేయడానికి విస్తృతంగా సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమర్జెన్సీని వ్యతిరేకించిన జాతీయ వాదులను ప్రభుత్వం చిత్రహింసలకు గురిచేసి జైల్లో పెట్టిందని, ఆ చీకటి రోజులను ప్రజలు నేటికీ మరచిపోలేదని చెప్పారు. మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి 11 ఏళ్లు నిండుతున్న సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు.

# తెలంగాణ లీడర్లకు భయపడుతున్న కాంగ్రెస్ హైకమాండ్ !



తెలంగాణలో ఆరు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. ఏడాదిన్నర అయిపోయింది. ఇప్పటికి కసరత్తు చేసి చేసి చివరికి మూడు మంత్రి పదవుల్ని భర్తీ చేయాలని నిర్ణియంచారు. ఎస్సీ, బీసీలకు ఈ పదవులు ఇస్తున్నారు. మాల వర్గం నుంచి వివేక్, మాదిగ వర్గం నుంచి అడ్లూరి లక్ష్మణ్, బీసీ నుంచి వాకిటి శ్రీహరిలకు చాన్స్ ఇస్తున్నారు. మరి మూడు పదవుల్ని ఎందుకు ఖాళీగా పెడుతున్నారు. పార్టీ నేతల హెచ్చరికల్ని , బెదిరింపుల్ని తట్టుకోలేక పక్కన పెడుతున్నారు.పదేళ్ల తర్వాత పార్టీ అధికారంలోకి వచ్చింది. పార్టీ కోసం కష్టపడిన వారికి అవకాశాలు ఇవ్వలేక పోతున్నారు. మూడు మంత్రి పదవుల్ని ఎందుకు భర్తీ చేయడం లేదంటే కోమిటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వంటి వారి బెదిరింపులకు తలొగ్గి. ఆయనకు ఇవ్వలేరు.. అలాగని ఇతరులకు ఇవ్వలేరు. అందుకే ఆపేశారు. ఈ రాజగోపాల్ రెడ్డి ఎవరు ..?. కాంగ్రెస్ పార్టీని ఎంతగా భ్రష్టుపట్టించాలో పట్టించారు. చివరికి పీక నొక్కేయడానికి మునుగోడు ఉపఎన్నిక తెచ్చారు. కానీ మళ్లీ కాంగ్రెస్ గెలుస్తుందన్న ఫీలింగ్ వచ్చాక మళ్లీ పార్టీలో చేరారు. ఇలాంటి వాళ్లకు కాంగ్రెస్ హైకమాండ్ భయపడుతోంది ?పార్టీనే నమ్ముకుని ఉన్న వారు చాలా మంది ఉన్నారు. ప్రేమ్ సాగర్ రావు, సుదర్శన్ రెడ్డి వంటి వారికి పదవులు ఇవ్వడానికి ఈ రాజగోపాల్ రెడ్డి లాంటి వారి వారి బెదిరింపులు అడ్డం పడుతున్నాయి. కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి ఇచ్చిన ధైర్యంతో మొదటి సారి ఎమ్మెల్యే అయిన ఇతరులు కూడా మంత్రి పదవులు ఇవ్వాలనిలాబీయింగ్ చేసుకుంటున్నారు. బెదిరింపు వ్యాఖ్యలు చేస్తున్నారు. కాంగ్రెస్ హైకమాండ్ ఇంత బేలగా ఉంటే.. కోమటిరెడ్డి లాంటి నేతలు ఓ ఆట ఆడుకుంటారు. ఇప్పుడు అదే జరుగుతోంది.

# ఎమ్మెల్యేలకు చంద్రబాబు హెచ్చరికలు !

సరైన ప్రతిపక్షం లేకపోవడం, ఉన్న ప్రతిపక్షం ఉలిపికట్టె లాంటిది కావడం, అసాధారణ ఎమ్మెల్యేల బలం ఉండటం అధికార పార్టీకి చాలా సమస్యలు తెచ్చి పెడుతుంది. ఇప్పుడు ఏపీలో టీడీపీకి అదే పరిస్థితి కనిపిస్తోంది. ఎమ్మెల్యేలను దారిలో పెట్టడానికి, వారు దారి తప్పకుండా చూడటానికి పార్టీ అధినేత చంద్రబాబునాయుడు చాలా ప్రయత్నాలు చేయాల్సి వస్తోంది.పార్టీ నేతలందరితో టెలీ కాన్ఫరెన్స్ పెట్టిన టీడీపీ అధినేత.. పద్దతిగానే చెప్పాల్సింది చెప్పారు. ప్రతి ఒక్క ఎమ్మెల్యే వ్యవహారాలపై తన వద్ద నివేదికలు ఉన్నాయని.. పద్దతి మార్చుకోకపోతే వన్ టైం ఎమ్మెల్యేగా మిగిలిపోతారని హెచ్చరించారు. ఎమ్మెల్యేలుచాలా విషయాల్లో జోక్యం చేసుకుంటు న్నారు. సంపాదనకు అలవాటు పడుతున్నారు. చాలా కొద్ది మంది ఇంకా ఎక్కువ అడ్వాంటేజ్ తీసుకుంటున్నారు. ఇలాంటి వారి విషయంలో చంద్రబాబు చాలా పర్టిక్యులర్‌గా ఉండాలని నిర్ణయించుకున్నారు.ఏడాది పాలన తర్వాత చంద్రబాబు .. ఎక్కువగా ఎమ్మెల్యేల ప్రవర్తన మీదనే అసంతృప్తిగా ఉన్నారు. చాలా మంది కొత్త ఎమ్మెల్యేలు, వైసీపీపై పోరాడాలు అని అవకాశం ఇచ్చారు. వారిలో చాలా మంది ఇప్పుడు తమ ప్రవర్తనను మార్చేసుకున్నారు. ఫలితంగా ప్రజల్లో వ్యతిరేకత మూటగట్టుకుంటున్నారు. ప్రభుత్వ పని తీరుకు తగ్గట్లుగా ఎమ్మెల్యేలు ఉంటే.. సాఫీగా నడిచిపోతుంది. కానీ ఎక్కువగా ఉన్న ఎమ్మెల్యేలు.. ఉనికి లేని ప్రతిపక్షం వల్ల ఇబ్బం దులు తలెత్తుతున్నాయి.రాజకీయాలు చేయాలంటే దందాలు చేయాలని కొంత మంది ఎమ్మెల్యేలు



అనుకుంటూ ఉంటారు. కానీ ఆ దందాలు ప్రజల్ని ఇబ్బంది పెట్టేలా ఉండకూడదు. ప్రజలకు సేవ చేస్తే డబ్బు అవసరం రాదు.దానికి నిమ్మల రామానాయుడు లాంటి వాళ్లే ఉదాహరణ. మరి ఇతర టీడీపీ ఎమ్మెల్యేలు ఎప్పుడు నేర్చుకుంటారో మరి !

# ఈటల Vs తుమ్మల : ఎవరివి అబద్దాలు?



కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో విచారణ చేస్తున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట ఈటల రాజేందర్ ఇచ్చిన వాంగ్మూలం రాజకీయవర్గాల్లో సంచలనంగా మారుతోంది. తన మెడకు చుట్టుకోకుండా ఉండటం కోసమో, కేసీఆర్ ను ఇరికించడం ఇష్టం లేదనో కానీ ఈటల రాజేందర్ .. అసలు తప్పే జరగలేని వాంగ్మూలం ఇచ్చారు. అన్నీ మంత్రి వర్గ నిర్ణయాల ప్రకారమే జరిగాయన్నారు. మూడు బ్యారేజీలు కట్టాలని మంత్రి వర్గ ఉపసంఘం నిర్ణయం తీసుకుంన్నారు. ఎలా చూసినా.. అచ్చమైన బీఆర్ఎస్ నాయకుడు.. కేసీఆర్ అనుచరుడు ఎలా వాంగ్మూలం ఇస్తారో అలా ఇచ్చారు రాజేందర్. ఈ వాంగ్మూలంలో ఇంకో టాపిక్ ఉంది. అదే మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం మేరకు మూడు బ్యారేజీలు నిర్మించాలని నిర్ణయించడం. ఆ మంత్రివర్గ ఉపసంఘంలో తుమ్మల నాగేశ్వరరావు కూడా సభ్యుడు. అందుకే ఆయన తెరపైకి వచ్చారు. ఈటల వాంగ్మూలం ఇచ్చినట్లుగా ఆ ఉపసంఘం.. మూడు బ్యారేజీలు నిర్మించాలని ఎలాంటి సిఫారసులు చేయలేదని స్పష్టం చేశారు. ఆ ఉపసంఘం నివేదిక ఇవ్వక ముందే.. మూడు ప్యారేజీల నిర్ణయం జరిగిపోయి దన్నారు. పసలు కాళేశ్వరంకు కేబినెట్లో అనుమతి కూడా తీసుకోలేదని తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. కావాలంటే తానే కాళేశ్వరం కమిషన్ కు ఓ లేఖ రాస్తానని ప్రకటించారు. వాంగ్మూలం ఇస్తానన్నారు.బీఆర్ఎస్ తొలి ప్రభుత్వంలో కీలక మంత్రులుగా పని చేసిన ఇద్దరూ ఇప్పుడు వేర్వేరు పార్టీల్లో ఉన్నారు. బీజేపీ ఎంపీగా ఈటల ఉంటే.. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా తుమ్మల ఉన్నారు. ఇద్దరూ భిన్నమైన ప్రకటనలు చేస్తున్నారు. ఆటల రాజేందర్ ను కేసీఆర్ అవమానకరంగా.. కుట్రలు చేసి మరీ పార్టీ నుంచి బయటకు పంపారు. తుమ్మల నాగేశ్వరరావుకు కేసీఆర్ రిటైర్మెంట్ ఇవ్వాల నుకుంటే ఆయనే బయటకు వెళ్లారు. అయితే ఈ వ్యవహారంలో ఇద్దరూ భిన్నమైన వాదనలు వినిపిస్తున్నారు. ఆటల రాజేందర్ కేసీఆర్ ను రక్షించేందుకు పూర్తి స్థాయిలో ప్రయత్నం చేశారు. కానీ తుమ్మల మాత్రం విబేధిస్తున్నారు. ఆయనకు కేసీఆర్ ను టార్గెట్ చేయాలని ఉండకపోవచ్చు కానీ.. తనను ఇన్వాల్వ్ చేయ దంతో తుమ్మల నిజాలు చెప్పడానికి సిద్ధమ య్యారని అనుకోవ చ్చు.కాళేశ్వరం విషయంలో కర్త, కర్మ , క్రియ కేసీఆర్ అనేది బహిరంగరహస్యం. ఆయనే ప్రాజెక్టుల రీ డిజైన్ చేశారు. ఆయనే ప్రజెంటేషన్ ఇచ్చారు. అన్నీ ఆయన చెప్పినట్లుగా జరిగాయి. కానీ ఇతరుల పేరు మిద జరిగాయి. అదే అసలు విషయం. ఇక్కడ తుమ్మల, ఈటలల్లో ఒకరు మాత్రమే నిజం చెబుతున్నారు. అది ఎవరన్నది కూడా కాస్త అవగాహన ఉన్న వారికి ఇట్టే అర్థమైపోతుంది.

# మాగంటి గోపీనాథ్ కన్నుమూత ఏఐజీ అధికారిక ప్రకటన!

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కన్నుమూశారు. తీవ్రమైన గుండెపోటు రావడంతో ఏఐజీ ఆస్పత్రిలో మూడు రోజుల కిందట ఆయనను కుటుంబసభ్యులు చేర్చారు. ఆ రోజే చనిపోయారని వార్తలు వచ్చాయి.అయితే ఆయనకు వెంటిలేటర్ పై వైద్యం అందిస్తూ వచ్చారు. సీపీఆర్ చేసిన తర్వాత గుండె కొట్టుకోవడంతో పరిస్థితి మెరుగుపడుతుందని అనుకున్నారు. మూడు రోజులు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఆదివారం ఉదయం ఆయన మరణించినట్లుగా వైద్యులు గుర్తించారు.మాగంటి గోపీనాథ్ జూబ్లిహిల్స్ నుంచి వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఓ సారి టీడీపీ నుంచి రెండు సార్లు బీఆర్ఎస్ నుంచి గెలిచారు. గోపీనాథ్ .. చాలా చిన్న వయసులోనే .. ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పుడే విద్యార్థి నేతగా భారీ ర్యాలీలు నిర్వహించి రాజకీయాల్లోకి వచ్చారు. అప్పటి నుంచి 2014లో ఎమ్మెల్యే సీటు దక్కే వరకూ పార్టీ కోసం పని చేశారు. అనంతర పరిణామాలతో ఆయన బీఆర్ఎస్ లో చేరారు.మాగంటి గోపీనాథ్ మృతితో బీఆర్ఎస్ పార్టీకి తీవ్ర నష్టం జరగనుంది. ఏడాదిలోనే ఆ పార్టీ ఇద్దరు ఎమ్మెల్యేలను



కోల్పోయింది. కంటోన్మెంట్ ఎమ్మెల్యే రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఇప్పుడు జూబ్లిహిల్స్ ఎమ్మెల్యే అనారోగ్యంతో మరణించారు.

# జాణంపేటలో భవాని మాత ఆలయ విగ్రహ పునః ప్రతిష్ట మహోత్సవం

## అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి - ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి



హాజరైన మున్సిపల్ మాజీ చైర్మన్ కొందూటి నరేందర్ సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్,నాయకులు మాజీ కౌన్సిలర్ బచ్చలి నర్సింహా

ఆధ్వర్యంలో ఆలయ విగ్రహ పునః ప్రతిష్ట మహోత్సవం ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండేలా అమ్మవారి చల్లని చూపు ఆశీస్సులు సకల జనులపై ఎల్లపుడు ఉండేలా చూడాలని అమ్మవారిని కోరుకున్నారు ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి. షాద్ నగర్ పట్టణంలోని 14వ వార్డులో మాజీ కౌన్సిలర్ బచ్చలి నర్సింహా ఆధ్వర్యంలో భవానిమాత ఆలయ మరియు విగ్రహ పునః ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.ఆలయ మరియు విగ్రహ పునః ప్రతిష్ట మహోత్సవానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మున్సిపల్ మాజీ చైర్మన్ కొందూటి నరేందర్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్ హాజరై ప్రత్యేక పూజలో పాల్గొని అమ్మవారి ఆశీర్వాదం తీసున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు బీఆర్ఎస్ నాయకులు కానుగ అనంతయ్య, (చిన్న) యాదగిరి,యుగేందర్,దినేష్ సాగర్, మంగ శ్రీశైలం,పిట్టల మల్లేష్, శి ,మధు,శివ చారి,సుధీర్,గుట్ట రాజు,పిఎన్ గౌడ్, అన్వారీ రాజు,తదితరులు పాల్గొన్నారు..

# కొలంబియా అధ్యక్ష అభ్యర్థిపై హత్యాయత్నం



కొంలబియా సెనేటర్, అధ్యక్ష అభ్యర్థి మిగ్యుల్ ఉరిబ్ టర్బే (39)పై హత్యాయత్నం జరిగింది. శనివారం ప్రచార కార్యక్రమంలో పాల్గొని ప్రసంగిస్తుండగా.. ఓ దుండగుడు ఆయన వెనక నుంచి కాల్పులు జరిపాడు. అధికారులు వెంటనే అప్రమత్తమై మిగ్యుల్ను ఆస్పత్రికి తరలించారు.ఈ ఘటనను మిగ్యుల్ పార్టీ కన్జర్వేటివ్ డెమోక్రటిక్ తీవ్రంగా ఖండించింది. కాల్పులు జరిపినట్లు అనుమానిస్తున్న ఓ వ్యక్తిని కూడా పట్టుకున్నట్లు తెలిపారు.

# మావోల ఏరివేత విజయవంతం చేశారు:అమిత్



షాఛత్తీస్ గఢ్ - తెలంగాణ సరిహద్దులో ఇటీవల చేపట్టిన మావోయిస్టుల ఏరివేత ఆపరేషన్లను విజయవంతంగా నిర్వహించిన అధికారులను కేంద్ర హెూం మంత్రి అమిత్ షా అభినందించారు. వామపక్ష తీవ్రవాద ముప్పు నుంచి దేశాన్ని విముక్తి చేయడానికి మోదీ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని అమిత్ షా పేర్కొన్నారు. త్వరలోనే తాను ఛత్తీస్గఢ్కు వెళ్లి ఈ ఆపరేషన్లలో ధైర్యసాహసాలతో విధులు నిర్వర్తించిన జవాన్లను కలుస్తానని ఆయన తెలిపారు.

# మణిపూర్లో మరోసారి ఉద్రిక్తత



మణిపూర్ మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మెయితీ తెగకు చెందిన వాలంటీర్ గ్రూప్ అరంబాయ్ టెంగోల్ నాయకుడు కానన్ సింగ్ను పోలీసులు ఇంఫాల్లో శనివారం అరెస్టు చేశారు. దీంతో మెయితీ తెగకు చెందిన యువత పెద్ద సంఖ్యలో వీధుల్లోకి వచ్చి నిరసనకు దిగి షాపులను ధ్వంసం చేశారు. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో ఐదు జిల్లాల్లో ఐదు రోజులపాటు ఇంటర్ నెట్ సేవలను ప్రభుత్వం నిలిపివేసింది.

# పాక్ మాజీ పోలీసుతో జ్యోతి మల్హోత్రాకు సంబంధం



పాకిస్తాన్ కోసం గూఢచర్యం చేశారనే ఆరోపణలతో హర్యానాకు చెందిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా అరెస్టు అయ్యారు. ఆమెకు పాక్ మాజీ సబ్-ఇన్స్పెక్టర్ నాసిర్తో సంబంధం ఉందని దర్యాప్తులో తేలింది. జ్యోతికి అతడితో పరిచయం ఉన్నట్టు, వారిద్దరి మధ్య జరిగిన సంభాషణ వీడియో వైరల్ అవుతోంది. అందులో జ్యోతి తన లాహెూర్ సందర్శన, కుటుంబ సంబంధాల గురించి మాట్లాడుతోంది. ఆ వీడియోలో ఆమె పాకు స్నేహపూర్వకంగా అభివర్ణించింది.

# డిప్యూటీ సీఎంను దుర్భాషలాడిన యువకుడు అరెస్టు



AP: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ను దుర్భాషలాడిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 4న తెనాలిలో మాజీ సీఎం జగన్ పర్యటన సందర్భంగా ఇర్ఫాన్ సోషల్మీడియా వేదికగా పవన్ కల్యాణ్ను దుర్భాషలాడారు. దీంతో ఇర్ఫాన్పై చర్యలు తీసుకోవాలంటూ జనసేన పల్నాడు జిల్లా నాయకులు నరసరావుపేట గ్రామీణ APలో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన పోలీసులు మండలంలోని ములకలూరుకు చెందిన ఇర్ఫాన్ను శనివారం అరెస్టు చేశారు.

# సొంతగూటికి చేరిన కనకరాజు



ఎన్ఎంఆర్ యువసేన సభ్యుడు వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కనకరాజు ఆదివారం నాడు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి కనకరాజు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ యువత నాయకత్వం పార్టీకి అవసరమని, కనకరాజు చేరికతో బిఆర్ఎస్ బలపడుతుందన్నారు. పార్టీలోకి వచ్చిన కొత్త నాయకులను ఆదరిస్తామని హామీ ఇచ్చారు. కనకరాజు మాట్లాడుతూ ప్రజల కోసం పనిచేసేందుకు బిఆర్ఎస్ సరైన వేదిక అని పేర్కొన్నారు. కార్యక్రమానికి దేవేందర్ రెడ్డి, జింక గోపాల్, యాదిరెడ్డి, లక్ష్మణ్, సూర్యనారాయణ, చంద్రారెడ్డి, శ్రీకాంత్, కౌశిక్ గౌడ్,వినోద్ గౌడ్, చంద్రశేఖర్,పలువురు కార్యకర్తలు హాజరయ్యారు.

# హాయ్ హాయ్ నాయకా పై వంతెన వస్తోందిక

**రూ. 100 కోట్లకు పైగా వ్యయంతో నిర్మాణానికి శ్రీకారం**

**షాద్ నగర్ బైపాస్ జాతీయ రహదారిపై పైవంతెనల నిర్మాణానికి సర్వే**

**షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్" కృషితో ఆచరణలోకి**

**షాద్ నగర్ వద్ద రహదారిపై ముమ్మరంగా సర్వేలు నిర్వహిస్తున్న అధికారులు**

**కొత్తూరు నుంచి బూర్గుల వరకు పైవంతెనల నిర్మాణం**









రోడ్డు ప్రమాదాలు.. ఎందరో అమ్మలకు తమ బిడ్డలను దూరం చేశాయి.. మరెందరో ఆడపడుచులను వితంతువులుగా మార్చాయి.. నూరేళ్ల జీవితానికి క్షణకాలంలో ముగింపు పలికాయి.. నిమిషాల వ్యవధిలో ఇంటికి చేరాల్సిన వ్యక్తులు సెకండ్ల వ్యవధిలో మృత్యుఒడికి చేరిన సంఘటనలు ఎన్నెన్నో.. అలాంటి విషాదాలకు ఇక తెరదించాలన్న సంకల్పంతో షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ "వీర్లపల్లి" శంకర్ ఒక ప్రయత్నానికి శ్రీకారం చుట్టారు..నియోజకవర్గ పరిధిలోని మూడు వంతెనల కోసం దాదాపు 100 కోట్లకు పైగా ప్రభుత్వం వెచ్చించి ఈ మూడు వంతులను పూర్తి చేసేందుకు శ్రీకారం చుట్టబోతున్నారు. ఒక్కోవంతెనకు దాదాపు 35 కోట్ల రూపాయలు ఖర్చు చేయనున్నట్లు ప్రభుత్వం అంచనా వేసింది. వీటికి టెండర్లు కూడా పూర్తి చేసింది. ప్రస్తుతం బాలనగర్ వద్ద పనులు నడుస్తున్నాయి. ఆ తర్వాత వెంటనే ఇక్కడ పనులు ప్రారంభం కాబోతున్నాయి. కేశంపేట వెళ్లే బైపాస్ జాతీయ రహదారి పై సర్వేకు నేషనల్ హైవే అథారిటీ అధికారులు శ్రీకారం చుట్టారు.ప్రస్తుతం దానికి ఆకారం తెచ్చారు.. అవే నియోజకవర్గ పరిధిలో ఉన్న బైపాస్ జాతీయ రహదారిపై కీలకమైన ప్రమాద మలుపుల వద్ద పైవంతనలు. కొత్తూరు నుంచి మొదలుపెట్టి షాద్ నగర్ పరిధిలోని బూర్గుల గ్రామ రోడ్డు కూడలి వరకు ఈ వంతెనలు ఏర్పాటు కానున్నాయి. వీటితోపాటు మహబూబ్ నగర్ జిల్లా పరిధిలోకి వచ్చే బాలానగర్, రాజాపూర్ మండలాలలోనూ రెండు వంతెనలు ఏర్పాటు అవుతున్నాయి. ఒక్కసారి ఈ వంతెనల అవసరం, ఆవశ్యకత, ఆచరణల గురించి చెప్పుకుంటే..

### అవసరం ఇలా..

కొత్తూరు నుంచి షాద్ నగర్ శివారు అన్నారం గేట్ వరకు 44వ నెంబర్ జాతీయ రహదారి బైపాస్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ ప్రాంతాలలో అత్యంత వేగంగా ప్రయాణించే వాహనాల దాటికి పలు రోడ్డు ప్రమాదాలు జరిగిన కారణంగా గతంలో వందల సంఖ్యలో జనం తమ ప్రాణాలను కోల్పోయారు. వీరిలో ద్విచక్ర వాహనదారులతో పాటు సమీపతాండాల నుంచి వివిధ పనుల నిమిత్తం వెళ్లే పాదాచారులు ఎక్కువగా ఉన్నారు. ప్రమాదాల కారణంగా వీరు తమ ప్రాణాలను కోల్పోవడంతో కుటుంబాలు రోడ్డున పడ్డ సందర్భాలు ఎన్నో. ఇప్పటివరకు కూడా కొత్తూరు, నందిగామ, షాద్ నగర్ పట్టణం పరిధిలోని కమ్మదనం కూడళ్లలో పలు రోడ్డు ప్రమాదాలు జరిగి ఎంతోమంది మృత్యువాత పడ్డారు. ఈ ప్రమాదాలను నివారించేందుకు ఇక్కడ పైవంతనాలు ఏర్పాటు చేయాలనే సంకల్పం ఎప్పటినుంచో ఉంది. కానీ ఎంతో కాలంగా అది కేవలం కలగానే మిగిలింది. గతంలో వీటిపై ఎన్నో వార్తలు మీడియా ద్వారా వెలుగుచూసిన గత ప్రభుత్వాలు స్పందించలేదు. ఇక వర్తమానం లోకి వస్తే..

### ఇదీ ఆచరణ..

ఇక్కడ పైవంతెనల ఏర్పాటు ఆవశ్యకత గురించి తెలుసుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వంతెనల ఏర్పాటుకు కృషి చేస్తానని తొలి దశలోనే హామీ ఇచ్చారు. హామీ ఇవ్వడమే కాకుండా సంబంధిత మంత్రులను, అధికారులను కలిసి ప్రతిపాదనలు ఇచ్చి మంజూరు చేయించారు. ఈ క్రమంలో నియోజకవర్గ పరిధిలో మొత్తం 3 వంతెనలు మంజూరయ్యాయి. నందిగామ-జేపీ దర్గాల మధ్యన ఒక వంతెన. అదేవిధంగా కేశంపేట రోడ్డు-చటాన్ పల్లి మధ్యన మరో వంతెన, రాయికల్-బూర్గుల గ్రామాల మధ్య ఇంకో వంతెన ఏర్పాటు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు ఆదివారం సర్వే కార్యక్రమాలు నిర్వహించి మార్కింగులు వేశారు. దీనిపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పందిస్తూ నియోజకవర్గంలో రోడ్డు ప్రమాదాల నివారణ దిశగా అవసరమైన అత్యవసరమైన పరిస్థితులను గుర్తించి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని ఇప్పటికే వెల్లడించారు. వీలైనంత త్వరగా వీటిని నిర్మాణం చేపట్టి ప్రయాణికుల ఇబ్బందులను నివారిస్తామని పేర్కొన్నారు. సాధ్యమైనంత తొందరగా ఈ వంతెన నిర్మాణాలను పూర్తి చేయాలనే కృత నిశ్చయంతో ఎమ్మెల్యే శంకర్ ఉన్నారు.

### వందనం.. అభివందనం..

**- కాంగ్రెస్ నాయకుడు చిలకమర్రి రవీందర్ రెడ్డి**

మా గ్రామాలకు వెళ్లాలంటే ఈ జాతీయ రహదారి దాటి వెళ్లాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఎన్నెన్నో రోడ్డు ప్రమాదాలు ఎంతోమంది ప్రాణాలను పని తీసుకున్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తీసుకున్న ఈ నిర్ణయం మాలాంటి గ్రామస్తులకు ఎంతో ప్రయోజనకరం. ఈ సందర్భంగా ఆయనకు వందనం.. అభివందనం అంటూ కాంగ్రెస్ నాయకుడు చిలకమర్రి గ్రామస్తులు రవీందర్ రెడ్డి పేర్కొన్నారు..

# గ్రామదేవతలను ఆరాధించడం మన తెలంగాణ సంప్రదాయం

**బీఆర్ఎస్ యువ నాయకుడు వై. మురళీకృష్ణ యాదవ్**

ఇన్ముల్ నర్వ గ్రామంలో శ్రీ కేతమ్మ, శ్రీ మేడలమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం లో పూజలు చేసిన మురళీకృష్ణ యాదవ్ గ్రామదేవతలను పూజించడం, ఆరాధించడం మన తెలంగాణ సంప్రదాయమని బీఆర్ఎస్ యువ కార్యక్రమంలో వై. మురళీకృష్ణ యాదవ్ అన్నారు. ఆదివారం కొత్తూరు మండలం ఇన్ముల్ నర్వ గ్రామంలో నిర్వహించిన శ్రీ కేతమ్మ శ్రీ మేడలమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మాట్లాడారు. శ్రీ కేతమ్మ, శ్రీ మేడాల మ్మలను శక్తి స్వరూపులుగా, కులదేవ తలుగా కొలుస్తారని, అన్ని వర్గాల ప్రజలు అమ్మవార్లను పూజించి మొక్కలు తెలుసుకుంటారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో ఇరువురి అమ్మవార్ల దేవాలయాలను నిర్మించి జాతర, ఉత్సవాలను నిర్వహిస్తారని, ఘనంగా బోనాలను నిర్వహించడం తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు నిదర్శనమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, బీఆర్ఎస్ నాయకులు దేవేందర్ యాదవ్, ఎమ్మె సత్యనారాయణ, మెండే కృష్ణ, విఠల్, అశోక్, కోస్గి శ్రీనివాస్, గోపాల్ నాయక్, శ్రీరాములు, శ్రీను, శ్రీశైలం, మహేష్, జంగయ్య, అజయ్, పాండు, రమేష్ తదితరులు పాల్గొన్నారు



# అంగరంగ వైభవంగా భవానీ మాత దేవాలయ ప్రారంభ మహోత్సవం




ప్రత్యేక పూజలు చేసిన బీఆర్ఎస్ యువ నాయకుడు వై. మురళీకృష్ణ యాదవ్హాజరైన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ నరేందర్ తదితరులు దేవాలయ నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ ఆర్థిక సహాయం షాద్ నగర్ మున్సిపాలిటీ జానంపేటలో శ్రీ భవాని మాత దేవాలయ ప్రారంభో త్సవాన్ని అంగరంగ వైభ వంగా నిర్వహి చారు. మూడు రోజులపాటు భక్తి శ్రద్ధలతో దేవాలయ ప్రారం భోత్సవాన్ని వైభ వంగా ప్రారంభించి, దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగానే బీఆర్ఎస్ యువ నాయ కుడు వై. మురళి కృష్ణ యాదవ్ దేవాలయ ప్రారం భోత్సవ కార్యక్రమంలో పాల్గొని అమ్మవా రికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామదేవతలను పూజించడం, ఆరాధించడం మన హిందూ సంస్కృతి ఆనవాయితీని, కాలనీలలో అత్యంత వైభవంగా దేవాలయ ప్రారంభోత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించడం సంతోషకరమని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు తమ ఇష్ట దైవాన్ని ఆరాధించాలని, నేటి తరం యువత హిందూ సంస్కృతి సంప్రదాయాలను పాటిస్తూ హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలని ఆకాంక్షించారు. దేవాలయ నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ ఆర్థిక సహాయం అందించడం పట్ల స్థానిక మాజీ కౌన్సిలర్ బచ్చలి నరసింహా, కాలనీవాసులు అంజయ్య యాదవ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు నటరాజ్, పీఏసీఎస్ చైర్మన్ అశోక్, మాజీ చైర్మన్ విఠల్, నాయకులు దేవేందర్ యాదవ్, కోస్గి శ్రీనివాస్, బచ్చలి నరసింహా, కానుగు అనంతయ్య, చింటూ, పిల్లి శేఖర్, నందిగామ శ్రీనివాస్, చెట్ల జంగయ్య, మహమ్మద్ ఎజాజ్ (అడ్డు), గుండు అశోక్, కొండ మల్లేష్, నవీన్ పులిజాల, మంగ శ్రీశైలం, పిట్టల మల్లేష్, పవన్ సింగ్, బాబ ఘోరీ తదితరులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు..

# ముదిరాజు బిడ్డ వాకిటి శ్రీహరికి పట్టం

**షాద్ నగర్ కాంగ్రెస్ నాయకుడు రాయికల్ శ్రీనివాస్**



సర్పంచ్ స్థాయి నుండి మంత్రి స్థాయి వరకు ఎదిగిన ముదిరాజుల ముద్దుబిడ్డ మంత్రి వాకిటి శ్రీహరికి రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం రాయికల్ శ్రీనివాస్ హర్షం ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలకు ప్రాధాన్యతనిస్తూ ముఖ్యంగా ముదిరాజుల పట్ల ఎంతో గౌరవంగా మంత్రి పదవిని కేటాయించి వారికి గౌరవం ఇవ్వడం జరిగిందని శ్రీనివాస్ తెలిపారు. మంత్రి వాకిటి శ్రీహరి ఎంతో మంచి ఆత్మీయ మిత్రులందరికీ కాంగ్రెస్ పార్టీలో ఒక గొప్ప కార్యకర్తగా ఎదిగి నేడు మంత్రి స్థాయికి ఎదిగిన ముదిరాజ్ ముద్దుబిడ్డ వాకిటి శ్రీహరి అని కొనియాడారు. శ్రీహరికి మంత్రి పదవి రావడం ముదిరాజు యావత్తు జాతిని గౌరవించడమేనని పేర్కొన్నారు. శ్రీహరిని మంత్రిని చేసిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ తరఫున రాయికల్ శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు

# ముదిరాజ్ ముద్దుబిడ్డకు మంత్రి పదవి

**కొత్తూరు మాజీ జెడ్పిటిసి కాంగ్రెస్ నేత మామిడి శ్యాంసుందర్ రెడ్డి హర్షం**

**సర్పంచ్ నుంచి మంత్రి వరకు.. వాకిటి శ్రీహరి**



మంత్రి శ్రీహరిని సన్మానించిన కొత్తూరు మాజీ జెడ్పిటిసి కాంగ్రెస్ నేత మామిడి శ్యాంసుందర్ రెడ్డి వాకిటి శ్రీహరిది స్థానికంగా రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబమని కాంగ్రెస్ ప్రభుత్వంలో ముదిరాజులకు సామాజిక న్యాయం జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశీస్సులతో పాలమూరు ఉమ్మడి జిల్లాకు చెందిన వాకిటి శ్రీహరికి మంత్రి పదవి రావడం గొప్ప విషయమని షాద్ నగర్ నియోజకవర్గం కొత్తూరు మండల మాజీ జెడ్పిటిసి సీనియర్ కాంగ్రెస్ నేత మామిడి శ్యాంసుందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం మంత్రిగా వాకిటి శ్రీహరి ప్రమాణ స్వీకారం చేయడంతో మామిడి శ్యాంసుందర్ రెడ్డి ఆయనను ప్రత్యేకంగా కలుసుకొని పూల బొకే శాలువాతో ఘనంగా సన్మానించారు. తన ఆత్మీయతను చాటుకున్నారు. ఈ సందర్భంగా వాకిటి శ్రీహరి గురించి మామిడి శ్యాంసుందర్ రెడ్డి వివరిస్తూ.. వాకిటి నర్సింహులు, రాములమ్మకు ఎనిమిది మంది సంతానంలో వాకిటి శ్రీహరి ఒకరనీ డిగ్రీ వరకు చదివిన ఆయనది స్థానికంగా రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబమని ఇక మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి రాజకీయ ప్రస్థానం చాలా ఆసక్తికరంగా సాగుతూ వచ్చిందనీ సర్పంచ్గా ప్రస్థానం ప్రారంభించి, నేడు రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారన్నారు. 1995 నుండి కాంగ్రెస్ పార్టీలో రాజకీయ ప్రస్థానం ప్రారంభమై సుదీర్ఘంగా నేటికీ 28 సంవత్సరాలుగా నిఖార్సైన కాంగ్రెస్ వాదిగా కొనసాగుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు, పార్టీకి వీర విధేయులుగా పనిచేస్తూ ఏకంగా ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆశీస్సులు కలిగిన నేతగా ఎదిగాడనీ శ్యాంసుందర్ రెడ్డి పేర్కొన్నారు. ఇక 2001 -2006 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ నుండి మక్తల్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్గా పోటీ చేసి తొలి అవకాశంలోనే గెలుపొందారనీ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో అత్యధిక మెజార్టీ సాధించి రికార్డు సృష్టించారనీ అంతేకాకుండా అదే సంవత్సరంలోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సర్పంచ్ల సంఘం ఉపాధ్యక్షుడిగా కొనసాగారనారు. 2006-2011 సంవత్సరంలో స్థానిక సంస్థల మండల పరిషత్ ఎన్నికల్లో దాసర్ పల్లి గ్రామం నుండి ఎంపీటీసీగా పోటీ చేసి అత్యధిక మెజార్టీతో గెలుపొంది, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో చరిత్ర సృష్టించారనీ 2014-2018 సంవత్సరంలో మక్తల్ మండలం నుండి స్థానిక సంస్థల ఎన్నికల్లో జెడ్పీటీసీగా పోటీ చేసి అత్యధిక మెజార్టీతో గెలుపొందారనీ తెలంగాణ రాష్ట్రంలో జెడ్పీటీసీ అభ్యర్థిగా అత్యధిక మెజార్టీ సాధించిన రికార్డు సృష్టించాడన్నారు. అలాగే 2014-2018 సంవత్సరం కాలంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ గా ఎన్నికయ్యారనీ ఇక 1996-2001 వరకు కాంగ్రెస్ పార్టీ మక్తల్ మండలం ప్రధాన కార్యదర్శిగా, 2001-2006 సంవత్సరం వరకు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా, 2006-2014 సంవత్సరం వరకు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా సెక్రెటరీగా పనిచేశారనీ 2018 సంవత్సరం నుండి కృష్ణా జలాల పరిరక్షణ సమితి సభ్యుడుగా కొనసాగారు. 2023 సంవత్సరంలో నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టి, మక్తల్ అసెంబ్లీ టికెట్ ఖరారు కావడంతో ఆ బాధ్యతల నుంచి తప్పుకున్నారనీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తలపెట్టిన భారత్ జోడో యాత్ర మక్తల్ నియోజకవర్గంలో విజయవంతం చేసి రాహుల్ గాంధీతో ప్రశంసలు పొందారు వాకిటి శ్రీహరి, తెలంగాణ కేబినెట్లో చోటు కల్పించడం పట్ల మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హర్షం వ్యక్తం చేశారన్నారు అధిష్టానానికి రుణపడి ఉంటానన్నారు. బీసీ కుల గణన తర్వాత బీసీలకు న్యాయం చేయాలనే ఉద్దేశ్యంతో.. తనకు అవకాశం ఇవ్వడం గొప్ప వరంగా భావిస్తున్నానని వాకిటి శ్రీహరి అన్నారు. కాగా, ముదిరాజ్ ముద్దుబిడ్డకు మంత్రివర్గంలో చోటు దక్కడంతో ఆ సామాజిక వర్గం నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అసలైన కార్యకర్తకు, పార్టీని నమ్ముకున్న వారికి మంత్రిగా అవకాశం కల్పించిందని ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ శ్రేణులు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి..

# తెలంగాణ కేబినెట్ విస్తరణ

## ఉమ్మడి పాలమూరు జిల్లా నుండి వాకిటి శ్రీహరికి మంత్రి పదవి



మంత్రి వాకిటి శ్రీహరికి శుభాకాంక్షలు తెలిపిన షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్" తెలంగాణ కేబినెట్ విస్తరణలో కొత్తగా ముగ్గురికి అవకాశం దక్కింది. వీరిలో గడ్డం వివేక్, అడ్లూరి లక్ష్మణ్, పాలమూరు ఉమ్మడి జిల్లాకు చెందిన వాకిటి శ్రీహరిలకు రేవంత్ ప్రభుత్వం ఛాన్స్ కల్పించింది. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నూతన మంత్రులతో ఆదివారం రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, అసెంబ్లీ, శాసనమండలి స్పీకర్లు గడ్డం ప్రసాద్ కుమార్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మంత్రులు, ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాజ్‌భవన్‌లో ప్రమాణస్వీకారం సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేశారు. కొత్త మంత్రులకు ఈరోజు సాయంత్రం శాఖల కేటాయింపు చేసే అవకాశాలు ఉన్నాయి.

**నూతన మంత్రులకు సీఎం రేవంత్‌రెడ్డి అభినందనలు**

ప్రమాణ స్వీకారం చేసిన నూతన మంత్రులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. వివేక్, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరిలకి అభినందనలు చెప్పారు. తెలంగాణ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించనున్న రామచంద్రనాయక్‌కు కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. అదేవిధంగా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన మంత్రి వాకిటి శ్రీహరికి ప్రత్యేకంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలియజేశారు.

**తెలంగాణ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా రామచంద్రనాయక్**

తెలంగాణ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా రామచంద్రనాయక్‌ని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. రెండు రోజుల్లో ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది. ఈ సందర్భంగా డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ మాట్లాడారు. డిప్యూటీ స్పీకర్ పదవి దక్కడం గిరిజన జాతికి దక్కిన గౌరవంగా భావిస్తున్నానని రామచంద్రనాయక్ తెలిపారు. డోర్నకల్ ప్రజలందరికీ కృతజ్ఞతలు చెప్పారు. తనకు డిప్యూటీ స్పీకర్ పదవి ఇచ్చిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, సహచర ఎమ్మెల్యేలకు రామచంద్రనాయక్ కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, రాహుల్ గాంధీని ప్రధానిగా చేయడానికి తనవంతుగా కృషి చేస్తానని రామచంద్రనాయక్ పేర్కొన్నారు.

**నేతలకు బుజ్జగింపులు...**

ఈసారి తెలంగాణ కేబినెట్ విస్తరణలో కాంగ్రెస్‌లో మంత్రి పదవులు ఆశించి పలువురు నేతలు భంగపడ్డారు. వారిని అగ్రనేతలు బుజ్జగిస్తున్నారు. పదవులు రాలేదని నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అసంతృప్తితో ఉన్న నేతలకు ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రి పొన్నం ప్రభాకర్, మహేష్‌గౌడ్, వేం నరేందర్‌రెడ్డి సర్దిచెబుతున్నారు. అయితే మాజీమంత్రి సుదర్శన్‌రెడ్డి నివాసానికి కాంగ్రెస్ పెద్దలు చేరుకున్నారు. మంత్రివర్గ విస్తరణపై సుదర్శన్‌రెడ్డి మొదటి నుంచి ఆశలు పెట్టుకున్నారు. కేబినెట్ విస్తరణలో తనకు అవకాశం రాలేదని అసంతృప్తిలో ఆయన ఉన్నారు. ఎమ్మెల్యే రాజ్‌గోపాల్‌రెడ్డితో సహా ఇతర నేతల ఇళ్లకు మీనాక్షి నటరాజన్, నేతలు వెళ్లారు.

## రిపోర్టర్ సంజీవ్ కుమార్‌ను పరామర్శించిన షాద్ నగర్ కాంగ్రెస్ నేతలు



మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్, నడి కూడా యాదగిరి యాదవ్ ల పరామర్శషాద్ నగర్ ఆంధ్రజ్యోతి సీనియర్ పాత్రికేయులు సంజీవ్ కుమార్ ను షాద్ నగర్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ నేతలు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, నడి కూడా యాదగిరి యాదవ్ ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఆంధ్రజ్యోతి రిపోర్టర్ ఆర్.సి ఇంచార్జ్ సంజీవ్ కుమార్ ఇటీవల రోడ్డు మహబూబ్ నగర్ రోడ్డు ప్రమాదంలో గాయపడి తన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న సంజీవ్ కుమార్ ను ఆదివారం రోజు కాంగ్రెస్ నాయకులు, షాద్ నగర్ మార్కెట్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ బాబర్ ఖాన్ మరియు ఆయన తో పాటు 22వ వార్డు మున్సిపల్ మాజీ కౌన్సిలర్ నడికూడా యాదగిరి యాదవ్ లు వెళ్లి పరామర్శించారు. జరిగిన ప్రమాద కారణాలను వారు అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ల సలహాలను పాటించి, త్వరగా కోలుకొని ప్రజాక్షేత్రంలోనికి వచ్చి ప్రజలకు, నాయకులకు వారధిగా అక్షరం అనే,ఆయుధంతో.. పని చేయాలని వారు ఆకాంక్షించారు.

# సొంతింటి కలను సాకారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ

## కొందుర్గు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కృష్ణారెడ్డి

కొందుర్గు మండలం విశ్వనాథ్ పూర్, వెంకిర్యాల, లక్ష్మీదేవి పల్లి, ఆగిరాల, పాత ఆగిరాల గ్రామాలలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులకు అనుమతి పత్రాలు అందజేత పాల్గొన్న, పిఎసిఎస్ చైర్మన్ దామోదర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు జితేందర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ పార్లమెంట్ మాజీ అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వజ్రమ్మ కొందుర్గు మండలం పలు గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల భూమి పూజ కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా కొందుర్గు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కృష్ణారెడ్డి పిఎసిఎస్ చైర్మన్ దామోదర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు జితేందర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ పార్లమెంట్ మాజీ అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వజ్రమ్మలు మాట్లాడుతూ తెలంగాణ ప్రజా ప్రభుత్వం శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ ఆదేశానుసారం అందజేశామని తెలిపారు. మొదటి విడతలో ఇల్లు మంజూరు కాని వారికి తరువాత ఖచ్చితంగా మంజూరు అవుతుందని ఎవరు ఆందోళన చెందొద్దని తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్లపాటు డబుల్ బెడ్ రూమ్ ల పేరుతో కాలయాపన చేసిందని కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి నాయకత్వంలో



అధికారంలోకి వచ్చిన పార్టీలకు అతీతంగా సంవత్సరం లోపే డబుల్ బెడ్ రూమ్ల ఇల్లు ప్రక్రియ ప్రారంభించడం చాలా సంతోషమని దీనివలన పేదలకు ఐదు లక్షల ఆర్థిక సహాయం అందుతుందని తద్వారా గ్రామాల అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ఇల్లు మంజూరు అయిన లబ్ధిదారులు వారం రోజులలోపు బేస్మెంట్ ప్రక్రియ ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు వార్డు మెంబర్స్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ఎలికట్ట గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన "టీ టైం"




ఏలికట్టలో నూతనంగా టీ టైంలో ఏర్పాటు చేశారు. నిర్వాహకులు బర్మలి ప్రశాంత్ మరియు వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసిన నాయకులు. ఫరూక్నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీ చల్లా శ్రీకాంత్ రెడ్డి, మరియు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండ్రాతి బాలరాజు గౌడ్, ఈ సందర్భంగా యువత ఒకరిపై ఆధారపడకుండా స్వయం ఉపాధితో ఎదిగి ఆర్థిక పురోగతి ని సాధించాలని వారు ఆశించారు.ఇట్టి కార్యక్రమంలో మొగిలిగిద్ద గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంబటి. రాజు, మాజీ ఎంపీటీసీ కోట్ల శ్రీశైలం అప్పారెడ్డి గూడ మాజీ ఉపసర్పంచ్ సీతారాములు, శ్రీను, శేఖర్ శివయ్య, బుడ్డోళ్ల నర్సిములు, మాజీ ఎంపీటీసీ భార్గవ కుమార్ రెడ్డి, బర్మలి జంగయ్య, రాయికల్ సురేందర్, విజయ్ కుమార్ గౌడ్, పిల్లి జగన్, బాబు , యూసుఫ్, రాగపురం సుదర్శన్ కుమార్, పోలేమోని భరత్,లడ్డు ( భరత్) తదితరులు పాల్గొన్నారు. కెపి

# ఎప్పుడొచ్చామన్నది కాదన్నయ్యా..!

**ఇప్పుడే ఇంకా ఏం చూశారు ముందుంది - ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో ఉన్న పేర్లను చూస్తే మీకే అర్థమవుతుంది**

**బిజెపి నాయకుల తీరుపై రామేశ్వరం మాజీ డిప్యూటీ సర్పంచ్ సురేష్ యాదవ్**

ఉన్నమాట అంటే ఉలుకెక్కువ అన్నట్టుగా బిజెపి నాయకుల వ్యవహారం మారిందని రామేశ్వరం మాజీ డిప్యూటీ సర్పంచ్ సురేష్ యాదవ్ విమర్శించారు. వాస్తవ విషయాలు కాంగ్రెస్ నాయకులు మాట్లాడితే బిజెపి నాయకులు జీర్ణించు కోలేక పోతున్నారని, వాస్తవాలు గ్రహించలేక పోతున్నారని ఆయన విమర్శించారు. ఇందిరమ్మ ఇండ్ల గురించి బిజెపి నాయకులు పరితపిస్తున్నారని తప్పకుండా అన్ని పార్టీలకు అతీతంగా తమ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఇండ్లను ఇస్తారని పేర్కొన్నారు. ఇలాంటి డౌట్ అవసరం లేదని ఏ పార్టీ వారైనా ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని అర్హులైతే చాలని పేర్కొన్నారు. బిజెపి నాయకులు ఆరోపిస్తున్నట్లుగా మౌనిక, భాస్కర్ కరుణా నరేష్ శంషాబాద్ జయమ్మ యాదయ్య గౌడ్ లకు సంబంధించిన ఇల్లు కూడా జాబితాలో పేర్లు నమోదు చేయడం జరిగిందని కళ్ళుండి చూడలేని గుడ్డివాలుగా బిజెపి నాయకులు మాట్లాడు తున్నారని విమర్శించారు. తమ నాయకుడికి గెలిచిన తర్వాత పార్టీలతో సంబంధం లేదని అందరూ తన ప్రజలు గానే భావించి ఎమ్మెల్యే శంకర్ అందరికీ ఇండ్లు మొదటి దశలో ఇచ్చారని రెండో దశలో మరికొన్ని ఇండ్లు వస్తున్నాయని వాటికి సంబంధించిన జాబితా కూడా మీడియాకు విడుదల చేశారు. కళ్ళు ఉండి కూడా చూడలేని ధృతరాష్టలుగా బిజెపి నాయకులు మారారని విమర్శించారు. రెండవ జాబితాలో 14వ నెంబర్ మౌనిక పేరు ఉందని, అదేవిధంగా 7, 8 క్రమ సంఖ్యలలో కూడా సదరు వ్యక్తుల పేర్లు ఉన్నాయని అందరికీ ఇందిరమ్మ గృహాలు వస్తాయని తెలిపారు.



రాజకీయాల్లో విమర్శలకు దిగాక చిన్న పెద్ద తేడా ఏమీ ఉండదని విమర్శలకు ప్రతి విమర్శలు చేయడమే రాజకీయ సంస్కారం అని పేర్కొన్నారు. అవతలి వ్యక్తులు విమర్శిస్తే తాము మళ్లీ తిరిగి విమర్శ చేయకూడదన్న మీ సంస్కారానికి ఏమనాలో ప్రజలకు తెలుసు అన్నారు. రాజకీయాల్లో దిగిన ప్రతి నాయకుడి జీవితం తెరిచిన పుస్తకమేనని ఇందులో కొత్త ఏమీ లేదని విమర్శించారు. ఎప్పుడొచ్చామన్నది కాదు అన్నయ్యలు పనులు చేస్తున్నామా లేదా అన్నది తెలుసుకోవాలన్నారు. తమ నాయకుడు వీర్లపల్లి శంకరన్నను కాంగ్రెస్ తమ్ముళ్లు గెలిపించు కున్నారని, పాపం బాబయ్య తమ్ముళ్ళే ఆయనను వంచించి పార్టీలోనే చాలామంది ద్రోహం చేశారని అందుకే బాబయ్య ఘోర ఓటమితో ఓడిపోయారని సురేష్ యాదవ్ గుర్తు చేశారు. బిజెపిలోని అన్నకు తగ్గతములు ద్రోహం చేసి ఉండవచ్చని తమ పార్టీలో అలా లేదని ధీమా వ్యక్తం చేశారు. మీకు రాజకీయాల్లో ఏం చేయాలో పాలు పోక ఊర్ల మీద పడి తిరుగుతున్నారని వాస్తవాలు గ్రహించలేక పోతున్నారని ప్రతి విమర్శ చేశారు. మేకపోతు గంభీర్యం బిజెపి పార్టీ నాయకులది మాది కాదని పేర్కొన్నారు. ఇలా మాటకు మాట సమాధానం చెప్పుకుంటూ పోతే అందరి చరిత్ర పొడుగ్గా ఉంటుందని హెచ్చరించారు. ప్రజలు ఎవరు అస్తవ్యస్తంగా లేరని బిజెపి నాయకులు అస్తవ్యస్తం అవుతున్నారని గగ్గోలు పడుతున్నారని, వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఎమ్మెల్యేగా శంకర్ గెలుస్తారని బీజేపీకి ఆదుర్దా ఎక్కువైందని అందుకే ఊర్ల మీద పడి తిరుగుతున్నారని ఆరోపించారు. పండ్లిచ్చే చెట్టును దాని వేరును మొదలును నరికి ఎవరు బాగుపడ్డారో నియోజకవర్గంలో ప్రజలందరికీ తెలుసని కొత్తగా చెప్పేది ఏమీ లేదని వారు పేర్కొన్నారు. గత 30 ఏళ్లలో బాబాయా ఎంతమందికి ఇండ్లు ఇచ్చారు కచ్చితంగా వెనక్కి తిరిగి చూసుకుందామని పరిశీలిద్దామని ఇల్లు ఇచ్చిన వారిని కలుద్దామని ప్రతి సవాల్ విసిరారు. బిజెపి అధికారంలో ఉన్నది ఇక్కడ ఎప్పుడు అని అంతకుముందు టిఆర్ఎస్ లో కూడా ఏలాంటి ఇండ్లు ఇవ్వలేదని బాబయ్య రెండు పార్టీలలో సాధించింది శూన్యమని ఇది ముందుగా తెలుసుకోవాలని వారు ఛాలెంజ్ విసిరారు. ప్రభుత్వం ఏం చేయాలో ఏ పథకాలను ఎక్కడ ఉంచాలో తమకు తెలుసని బిజెపి ఉత ఉచిత సలహాలు పొందే అవసరం తమ కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని కొట్టిపారేశారు. ఇప్పుడు కూడా అదే మాట చెబుతున్నాం బిజెపి నాయకులకు అంత సీన్ లేదని.. ఇప్పుడే ఇంకా ఏం చూశారు ముందుంది.. అంటూ సురేష్ యాదవ్ విమర్శలు గుప్పించారు.

## కేబినెట్ విస్తరణలో విద్యాశాఖకు మంత్రిని నియమించాలి

**ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వడ్ల శ్రీకాంత్ డిమాండ్**



విద్యా రంగంలో అనుభవం ఉన్న, సామాజిక న్యాయంపై నిబద్ధత కలిగిన నాయకుడిని మంత్రిగా నియమించాలనీ విద్యాశాఖ బడ్జెట్ వినియోగం, కార్యక్రమాల అమలులో పారదర్శకతను నిర్ధారించడానికి మంత్రి నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్ డిమాండ్ చేశారు.తెలంగాణ కేబినెట్ విస్తరణలో విద్యాశాఖ కేటాయింపు అవసరం తెలంగాణ రాష్ట్రంలో ఈ రోజు, జూన్ 8, 2025న జరగబోయే కేబినెట్ విస్తరణ రాష్ట్ర రాజకీయాల్లో కీలక అంశంగా మారింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, గత 15 నెలలుగా విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించకుండా, ఈ శాఖను ముఖ్యమంత్రి స్వయంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో, కేబినెట్ విస్తరణలో విద్యాశాఖకు పూర్తిస్థాయి మంత్రిని కేటాయించాలనే డిమాండ్ చేస్తున్నామనీ పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రం యొక్క భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లో ఉందనీ విద్యాశాఖకు ప్రత్యేక మంత్రి నియామకం రాష్ట్ర విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే కాక, సామాజిక, ఆర్థిక అసమానతలను తగ్గించడంలో కూడా దోహదపడుతుంది. ఈ రోజు జరిగే కేబినెట్ విస్తరణలో విద్యాశాఖ కేటాయింపు ఒక సానుకూల అడుగుగా ఉంటుందని ఆశిద్దాం

# మీకు ప్రెస్ మీట్ పెట్టడంలో ఉన్న ఉత్సాహం

# “మౌనిక”ను పలకరించడంలో మాత్రం లేకపాయే

**ఖబర్దార్ కాంగ్రెస్ నాయకుల్లారా బాబన్నను విమర్శించే స్థాయి మీకు లేదు**

**నమస్కారానికి నమస్కారం సంస్కారం**



బాబయ్య గారు ఎమ్మెల్యే గారిని ఏమని విమర్శించారో బయట పెట్టాలి ఒక సీనియర్ యకుడిని ఏకవచనంతో సంబోధించారు, అదీ మీకున్న సంస్కారము సలహా, విమర్శకు ఏ మాత్రం తేడా తెలియని కాంగ్రెస్ నాయకులు అందె బాబయ్య గారిని విమర్శించడమా..! బాబయ్య గారి రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం, ఆయన రాజకీయ జీవితం ప్రారంభించినప్పుడు బహుశా మీలో కొంతమంది పుట్టే ఉండరు, నిజంగా మీ సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి చేరితే మా %దీజ్రీ% వాళ్ళు ఊర్ల మీద పడి తిరిగే పరిస్థితి ఎందుకొస్తుంది, ప్రజల కోసం ఎన్ని ఊర్లైన తిరుగుతాం ఎంత దూరమైనా వెళ్తాం, ఆరు గ్యారంటీల అమలు విషయంలో ఇంకా ప్రజల్ని మోసం చేస్తూ “మేకపోతు గాంభీర్యాన్నీ” అవలంబిస్తున్నది మీరు కదా..! వాటిపై బహిరంగ చర్చకు మేము సిద్ధం మీరు సిద్ధమా..! సంవత్సర నర కాలమవుతుంది సర్పంచులు లేక ఎన్నికలు నిర్వహించడం చేతకాక గ్రామాల్లో పాలన అస్తవ్యస్తమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే మీకు “దున్నపోతు మీద వాన పడ్డట్టు” కూడా లేదు మీరా మా నాయకున్ని విమర్శించేది, మీరన్నది నిజమే నిజంగానే తెలంగాణలో మీ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజలకు ఏ పని పాట లేక ఇల్లు గడవడమే ఇబ్బందిగా మారింది.ఒక ముదిరాజ్ బిడ్డగా చెట్టు పేరు చెప్పి కాయలు, పండ్లూ అమ్ముకుంటాం అదీ మా వృత్తి ధర్మం, కానీ మీ కాంగ్రెస్ నాయకులు మాత్రం ఆ పండ్లు ఇచ్చిన చెట్టును వేర్లతో సహా అమ్మేస్తారు. ప్రతి ఊరిలో ఎంత మంది “మౌనిక” లాంటి బాధితులు ఉన్నారో? వాస్తవాలు త్వరలోనే బయటపడతాయి, బాబయ్య గారు తన హయంలో నిరుపేదలకు ఎన్ని ఇల్లు కట్టించారో 30 ఏళ్లు వెనక్కి వెళ్లి చూస్తే తెలుస్తుంది, లేక పోతే %జవీ% గారినీ అడగండి, ఇంకా మీరు ఇచ్చిన 150 ఇల్ల ప్రతి లబ్ధిదారుల జాబితా వివరాలు గ్రామపంచాయతీలో పెట్టాలి, లేకపోతే ఈ పథకం కూడా తప్పుల తడకే అని తమ నాయకుడు పై వచ్చిన ప్రతి విమర్శకు గట్టిగా సమాధానం చెప్పిన బిజెపి నాయకులు.ఈ కార్యక్రమంలో షాద్ నగర్ బిజెపి సీనియర్ నాయకులు, మండల అధ్యక్షులు మరియు రామేశ్వరం, రాయికల్ బూత్ అధ్యక్షులు బిజెపి నాయకులు పాల్గొన్నారు

## రిపోర్టర్ సంజీవ్ కుమార్ పరామర్శించిన షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి



ఆంధ్రజ్యోతి రిపోర్టర్ సంజీవ్ కుమార్ పరామర్శించిన షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఆంధ్రజ్యోతి రిపోర్టర్ ఆర్ సి ఇంచార్జ్ సంజీవ్ కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి తన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటన్న సంజీవ్ కుమార్ పరామర్శించాన్న షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి ప్రమాద కారణాలను అడిగి తెలుసుకున్నారు..

## ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు నివాళి

**షాద్ నగర్ చౌరస్తాలో టిఆర్ఎస్ నాయకుల శ్రద్ధాంజలి**



షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సూచనల మేరకు షాద్ నగర్ ముఖ్య కూడలిలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతికి సంతాపం తెలియజేస్తూ వారి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన షాద్ నగర్ బీఆర్ఎస్ శ్రేణులు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ కవిత నారాయణ, మాజీ మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ నటరాజ్, నాయకులు చంద్రశేఖర్, లక్ష్మణ్ నాయక్, వీరేశం, శ్రీనివాస్ రెడ్డి, చిన్న యాదగిరి, రాఘవేందర్, శరత్ కృష్ణ, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

# మహిళా శక్తిని చాటుదాం

**ఫరూక్ నగర్ మండల బీసీ సేన అధ్యక్షురాలు జక్కుల జలజ - రంగంపల్లి గ్రామంలో బీసీసేన మహిళ కమిటీ ఎన్నిక**







సమాజంలో అన్ని రంగాల్లో మహిళల శక్తిని చాటాలని ఫరూక్ నగర్ మండల బీసీ సేన అధ్యక్షురాలు జక్కుల జలజ పిలుపునిచ్చారు. ఫరూక్ నగర్ మండల బీసీ సేన అధ్యక్షురాలు జలజ ఆధ్వర్యంలో మహిళా కమిటీ రంగంపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించడం జరిగింది. అధ్యక్షురాలు జక్కుల జలజ మాట్లాడుతూ.. బీసీలందరూ ఏకతాటిపైకి రావాలని ప్రతి మహిళ చైతన్యవంతురాలు కావాలని గ్రామాల వారిగా పట్టణాల వారిగా ఎదుగుదల అనేది మహిళల నుంచి సాధ్యమవుతుందని తెలియజేశారు. ఈ నేపథ్యంలో రంగంపల్లి గ్రామ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందనీ ఫరూక్ నగర్ మండల సహాయ కార్యదర్శిగా పురుగుల సుజాతని ఎన్నుకోవడం జరిగిందని రంగంపల్లి గ్రామంలో బీసీలు ఎప్పుడు ముందంజలో ఉండాలని ప్రతి ఒక్క మహిళ ముందుకు రావాలని వారి మాటల ద్వారా గ్రామ కమిటీ లోని సభ్యులకి తెలియజేయడం జరిగిందనీ ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగ జిల్లా బీసీ సేన అధ్యక్షులు సదర్ శ్రీనివాస్, అసెంబ్లీ బీసీ సేన అధ్యక్షులు కత్తి చంద్రశేఖర్ చౌదర్ గూడా మండల అధ్యక్షురాలు జయ శ్రీకాంత్ ఫరూక్ నగర్ మండల ఉపాధ్యక్షురాలు అనుప ప్రవంతి రాజు కార్యక్రమాన్ని గ్రామ మహిళలు పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. అధ్యక్షులుగా పురుగుల అంబమ్మ ఉపాధ్యక్షులు పురుగుల లావణ్య, ప్రధాన కార్యదర్శి పురుగుల స్వరూప కార్యదర్శి జవ్వాజీ అనిత, సహాయ కార్యదర్శి పురుగుల లలితను ఎన్నుకొ న్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మహిళా సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపినారు.

## పై వంతెనలకు శ్రీకారం క్షేమదాయకం

**కేశంపేట మండలం మాజీ జెడ్పీటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి**



జాతీయ రహదారిపై పైవంతెనల నిర్మాణంతో గ్రామీణుల ప్రయాణానికి ఎంతో క్షేమకరమని దీనికోసం కృషిచేసిన స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు కృతజ్ఞతలని కేశంపేట మండలం మాజీ జెడ్పీటిసి విశాల శ్రావణ్ రెడ్డి పేర్కొన్నారు. షాద్ నగర్ బైపాస్ కొత్తూరు నుంచి బూర్గుల వరకు జాతీయ రహదారిపై 100 కోట్లకు పైగా వ్యయంతో పై వంతెనల నిర్మాణానికి కృషిచేసిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఇట్టి పైవంతెనలు ఎంతో ఉపయోగపడతాయనీ కేశంపేట్, కొత్తూర్, ఫరూక్ నగర్ మండలాలకు సంబంధించిన ప్రజలకు ఇది ఎంతో మేలు చేస్తుందని, అదేవిధంగా బెంగుళూరు హైవే పై రాకపోకలు కొనసాగిస్తున్న సుదూర ప్రాంతాల ప్రయాణికులకు కూడా ఇది ఎంతో క్షేమకరమని అన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు విశాల.

# ఇందిరమ్మ రాజ్యంలో పార్టీలకు అతీతంగా ప్రతి పేదవాడికి ఇల్లు



బిఆర్ఎస్ ప్రభుత్వంలో పార్టీ కార్యకర్తలకె దళిత బంధు, సీఎం రిలీఫ్ చెక్కులు షాద్ నగర్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు మాజీ వార్డు సభ్యులు ఎర్రోళ్ల జగన్ కాంగ్రెస్ రాజ్యంలో పార్టీలకు అతీతంగా ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు వస్తుందని షాద్ నగర్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ నేత మాజీ వార్డు సభ్యులు ఎర్రోళ్ల జగన్ అన్నారు. వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వంలో బిఆర్ఎస్ కార్యకర్తలకె దళిత బంధు ఇచ్చారని గుర్తు చేశారు. అది కూడా ఊరికి ఒకటి రెండు మాత్రమే ఇచ్చారు ఒక్కో ఊర్లో మొత్తమే రాలేదని అన్నారు ఇచ్చిన దళిత బంధు కూడా ఆర్థికంగా ఉన్నవారికి ఇచ్చారు ఆ పార్టీ దళితుల్లో కూడా ఒక్కరికి ఇద్దరికీ ఇచ్చి దళితుల మధ్యన చిచ్చుపెట్టారనీ గుర్తు చేశారు, పేరుకు ప్రజలందరికీ సీఎం రిలీఫ్ ఫండ్ అందులో కూడా బిఆర్ఎస్ కార్యకర్తలను గుర్తించి తమ పార్టీ వారికే సీఎం రిలీఫ్ ఫండ్ అందజేశారని గుర్తు చేశారు, కానీ కాంగ్రెస్ ఇందిరమ్మ రాజ్యంలో పార్టీలకతీతంగా సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో షాద్ నగర్ ఎమ్మెల్యే శంకర్ ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా ప్రతి పేదవాడికి ఇండ్లు అందుతాయని ఎర్రోళ్ల జగన్ తెలిపారు.

# అలయ్ బలయ్ కమిటీ ఆధ్వర్యంలో

## శ్రీ బండారు దత్తాత్రేయ ఆత్మకథ “ ప్రజల కథే నా ఆత్మకథ






“ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్హైదరాబాద్ మాదాపూర్ శిల్పకళా వేదిక లో జూన్ 8వ తేదీన శ్రీ బండారు దత్తాత్రేయ గారి జీవితాన్ని ఆధారంగా చేసుకుని రాసిన వారి ఆత్మకథను “ప్రజల కథే నా ఆత్మకథ “శీర్షికన పుస్తక ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమం అలయ్ బలయ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి శ్రీ వెంకయ్య నాయుడు గారు శ్రీ రామ్నాథ్ కోవింద్ గారు శ్రీ రేవంత్ రెడ్డి గారు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు శ్రీ జిష్ణు దేవ శర్మ గారు మరియు కిషన్ రెడ్డి గారు తదితర ప్రముఖులు ఈ పుస్తకావిష్కరణ లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిసి ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ గారు పాల్గొని శ్రీ బండారు దత్తాత్రేయ గారికి శుభాకాంక్షలు తెలియజేశారు. బండారు దత్తాత్రేయ గారి జీవితం ఆదర్శనీయమని ఒక ఆచరణాత్మకమని అన్నారు. బిజెపి పార్టీ తరఫున అనేక పదవుల అలంకరించిన ఆయన ప్రజల పక్షాన ఒక ఎత్తైన శిఖరం అని ప్రజల పక్కన ఒక నిలువెత్తు అండ అని అన్నారు. ప్రముఖుల జీవిత చరిత్రలు నేటి యువతకు ఆదర్శమని అలాంటి చరిత్ర మరొకటి ఈ “ప్రజలకథే నా ఆత్మకథ” పుస్తకం అని అన్నారు.ఈ కార్యక్రమంలో సామాజిక సేవ కర్త బాలల అశోక్ , గోకుల్ యూత్ వ్యవస్థాపక అధ్యక్షులు నేర్సు శ్రీధర్ యాదవ్, గొర్రెల మేకల తప్పకుండా వనపర్తి జిల్లా అధ్యక్షులు మధు యాదవ్, భేరి చంద్రశేఖర్ యాదవ్, మరియు కేంద్ర రాష్ట్ర మంత్రివర్యులు గవర్నర్ లు అలయ్ బలయ్ టీం సభ్యులు బంధుమిత్రులు శ్రేయోభిలాషులకు పెద్ద ఎత్తున పాల్గొని గౌరవనీయులు బండారు దత్తాత్రేయ కి శుభాకాంక్షలు తెలియజేశారు

# సంతాప ప్రకటన

**ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ ఆకస్మిక మృతిపై దిగ్బ్రాంతి**

**ఎమ్మెల్సి ఎన్. నవీన్ కుమార్ రెడ్డి**





జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాగంటి గోపినాథ్అకస్మిక మృతి పట్ల దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేసిన ఎమ్మెల్సీ ఎన్ .నవీన్ కుమార్ రెడ్డి. మూడు సార్లు ఎమ్మెల్యేగా జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి మాగంటి గోపినాథ్ చేసిన కృషిని గుర్తు చేశారు%ా% ఇది టిఆర్ఎస్ పార్టీకి తీరని లోటు అని అన్నారు. గోపినాథ్ గారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశాం

# ఎవరీ మాధవీలత  చీనాబ్ బ్రిడ్జి నిర్మాణంలో తెలుగు ప్రొఫెసర్ కీలకపాత్ర!

## చీనాబ్: ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే వంతెన ప్రారంభం



నిర్మాణంలో 17 ఏళ్లుగా తెలుగు ప్రొఫెసర్ జి. మాధవీలత సేవలుఐఐఎస్‌సీ బెంగళూరు ప్రొఫెసర్, జియోటెక్నికల్ కన్సల్టెంట్‌గా బాధ్యతలు క్లిష్టమైన భూ పరిస్థితుల్లో "డిజైన్ యాజ్ యూ గో" పద్ధతిలో రూపకల్పనకశ్మీర్ లోయ అనుసంధానతకు ఈ వంతెన ఓ మైలురాయిరూ. 1,486 కోట్ల వ్యయంతో నిర్మాణం, ఈఫిల్ టవర్ కన్నా ఎత్తైనదిజమ్మూకశ్మీర్‌లో నిర్మించిన ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే వంతెన, చీనాబ్ బ్రిడ్జిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం ప్రారంభించారు. ఈ భారీ ప్రాజెక్టు విజయవంతం కావడంలో బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ) ప్రొఫెసర్, తెలుగింటి ఆడపడుచు జి. మాధవీలత కీలక పాత్ర పోషించారు. సుమారు 17 సంవత్సరాల పాటు జియోటెక్నికల్ కన్సల్టెంట్‌గా ఆమె ఈ ప్రాజెక్టుతో మమేకమై పనిచేశారు.

**ప్రొఫెసర్ మాధవీలత నేపథ్యం**

ప్రస్తుతం ఐఐఎస్సిలో సీనియర్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ మాధవీలత ఓ రైతు కుటుంబం నుంచి వచ్చారు. 1992లో జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూ) నుంచి సివిల్ ఇంజనీరింగ్‌లో ఫస్ట్ క్లాస్ విత్ డిస్టింక్షన్‌తో బీటెక్ పూర్తి చేశారు. వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) నుంచి జియోటెక్నికల్ ఇంజనీరింగ్‌లో ఎంటెక్ అభ్యసిస్తూ గోల్డ్ మెడల్ సాధించారు. 2000 సంవత్సరంలో ఐఐటీ-మద్రాస్ నుంచి జియోటెక్నికల్ ఇంజనీరింగ్‌లోనే డాక్టరేట్ పొందారు. ఆమె ప్రతిభకు గుర్తింపుగా అనేక పురస్కారాలు వరించాయి. 2021లో ఇండియన్ జియోటెక్నికల్ సొసైటీ నుంచి 'బెస్ట్ ఉమెన్ జియోటెక్నికల్ రీసెర్చర్' అవార్డు అందుకున్నారు. 2022లో 'టాప్ 75 ఉమెన్ ఇన్ స్టీమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, ఆర్ట్స్ అండ్ మ్యాథమెటిక్స్) ఆఫ్ ఇండియా' జాబితాలో కూడా స్థానం సంపా దించారు.

**చీనాబ్ ప్రాజెక్టులో కీలక భూమిక**

చీనాబ్ వంతెన నిర్మాణం చేపట్టిన ప్రాంతంలోని క్లిష్టమైన భూభాగం, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, మారుమూల ప్రదేశం కావడం వంటి అంశాలు నిర్మాణాన్ని అత్యంత సవాలుగా మార్చాయి. ప్రొఫెసర్ మాధవీలత, వంతెన కాంట్రాక్టర్ అయిన ఆఫ్‌కాన్స్ సంస్థతో కలిసి ప్రణాళిక, డిజైన్ మరియు నిర్మాణ దశల్లో భూసంబంధమైన ఆటంకాలను అధిగమించడంపై ప్రధానంగా దృష్టి సారించారు. ఆమె బృందం 'డిజైన్ యాజ్ యూ గో' అనే వినూత్న విధానాన్ని అనుసరించింది. ప్రాథమిక సర్వేలలో కనిపించని విరిగిన రాళ్లు, రహస్య ఖాళీ ప్రదేశాలు, వివిధ రకాల రాతి లక్షణాలు వంటి వాస్తవ భూగర్భ పరిస్థితులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు డిజైన్‌లో మార్పులు చేస్తూ ముందుకు సాగారు. నిర్మాణ సమయంలో ఎదురైన యథార్థ రాతి పరిస్థితులకు అనుగుణంగా సంక్లిష మైన గణనలు, డిజైన్ సవరణలు చేశారు. వంతెన స్థిరత్వాన్ని పెంచడానికి రాక్ యాంకర్ల రూపకల్పన, వాటిని అమర్చాల్సిన ప్రదేశాలపై ఆమె అందించిన సలహాలు అమూల్యమైనవి. ఇటీవలే ఇండియన్ జియోటెక్నికల్ జర్నల్ మహిళా ప్రత్యేక సంచికలో 'డిజైన్ యాజ్ యూ గో: ది కేస్ స్టడీ ఆఫ్ చీనాబ్ రైల్వే బ్రిడ్జ్' అనే పేరుతో ఆమె ఒక పరిశోధనా పత్రాన్ని ప్రచురించారు. స్థలంలోని భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా, వంతెన మొత్తం నిర్మాణం, ప్రదేశం, రకం స్థిరంగా ఉండగా, డిజైన్ ఎలా నిరంతరం రూపాంతరం చెందిందో ఈ పత్రం వివరిస్తుంది.

**చీనాబ్ వంతెన... కొన్ని విశేషాలు**

సుమారు రూ. 1,486 కోట్ల వ్యయంతో నిర్మించిన చీనాబ్ వంతెనను 'భారతదేశ రైల్వే ప్రాజెక్టుల చరిత్రలో ఎదురైన అతిపెద్ద సివిల్-ఇంజనీరింగ్ సవాలు'గా ప్రభుత్వం అభివర్ణించింది. 359 మీటర్ల ఎత్తుతో, ప్యారిస్‌లోని ఈఫిల్ టవర్ కంటే 35 మీటర్లు ఎక్కువ ఎత్తులో ఈ వంతెన నిర్మితమైంది. ఈ ప్రాజెక్టు 2003లో ఆమోదం పొందిన 272 కిలోమీటర్ల ఉదంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైల్వే లింక్ (యుఎస్‌బిఆర్‌ఎల్)లో భాగం. ఈ వంతెన కశ్మీర్ లోయలో కనెక్టివిటీని గణనీయంగా మెరుగుపరుస్తుంది.

# అనపర్తి పోలీస్ స్టేషన్లో కూటమి మహిళా నేతలు ఫిర్యాదు



**తెలుగు - వెలుగు, తూ. గో. జిల్లా బ్యూరో (అనపర్తి):** ఆంధ్రుల కలల రాజధాని అమరావతి ని "వేశ్యల రాజధాని అని సాక్షి డిబేట్ లో ఒక నీచుడు మాట్లాడి ఆడబిడ్డలను అవమానించినందుకు,రాష్ట్ర రాజధాని పై దుష్ప్రచార దాడి,మహిళల శీల హననం చేయించినందుకు సాక్షి టీవి జర్నలిస్ట్ కృష్ణంరాజు,సాక్షి చానల్ యాజమాన్యం పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని అనపర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ పోలీస్ స్టేషన్ లో ఇంచార్జ్ కి అనపర్తి నియోజకవర్గ తెలుగు మహిళలు,బీజేపీ మహిళా మోర్చా, వీర మహిళలు ఫిర్యాదును అందచేసారు. ఆదివారం మహిళలు సాక్షి చానెల్ కు వ్యతిరేకంగా నినాదాలు చేసి సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో ఇంచార్జ్, అనపర్తి ఎస్ ఐ శ్రీను నాయక్ కి ఫిర్యాదు అందజేశారు. ఈ కార్యక్రమంలో అనపర్తి నియోజకవర్గ తెలుగు మహిళలు సూర్యకుమారి, శేషారత్నం, వేణమ్మ ,త్రివేణి, తెలుగు మహిళలు,బీజేపీ మహిళా మోర్చా, వీర మహిళలు పాల్గొన్నారు.

# హైటెక్ సిటీ చుస్తే చంద్రబాబు  గుర్తుకే వస్తారు: కోమటిరెడ్డి




హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఏపీ సీఎం చంద్రబాబును మంత్రి కోమటిరెడ్డి పొగడ్తలతో ముంచెత్తారు. హైటెక్ సిటీ చూసినా, హైదరాబాద్ చూసినా చంద్రబాబు నాయుడు గుర్తొస్తారంటూ కొనియాడారు. చంద్రబాబు వల్లే హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెరిగిందని.. ఆయన ముందుచూపుకు హైదరాబాద్ నిదర్శనమని కోమటిరెడ్డి పేర్కొన్నారు.

# కాళేశ్వరం కమిషన్ విచారణపై ఈటల సంచలన వ్యాఖ్యలు

**కేసీఆర్ ను కాపాడాల్సిన అవసరం తనకేంటని ప్రశ్న - కేబినెట్ లో చర్చించకుండా ప్రభుత్వంలో ఏమీ జరగదని వెల్లడి**

**తుమ్మల నాగేశ్వర్ రావు వ్యాఖ్యలను తిప్పికొట్టిన ఈటల**


బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను కాపాడాల్సిన అవసరం తనకు లేదని బీజేపీ నేత, తెలంగాణ మాజీ మంత్రి ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. కాళేశ్వరం కమిషన్ విచారణకు హాజరైన ఈటల.. కేసీఆర్ ను రక్షించేందుకే వాస్తవాలను దాచిపెట్టారన్న ఆరోపణలపై మాజీ మంత్రి స్పందించారు. ఆదివారం ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టినపుడు ఆర్థిక మంత్రిగా ఉన్నానని, ఆ సమయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, వాటిలో తన పాత్రను కమిషన్ ముందు వెల్లడించినట్లు చెప్పారుఈ విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే కాంగ్రెస్ నేతలు ఇలాంటి కామెంట్స్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రివర్గ ఉప సంఘం లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టే లేదని తెలిపారు. కాళేశ్వరంలోని అనేక ప్రాజెక్టుల రీడిజైనింగ్ను కేబినెట్ సబ్ కమిటీ సూచించింది. త్వరలోనే అన్ని జీవోలు, సబ్ కమిటీ నిర్ణయాలు, సూచనలు బయటపెడతా అని చెప్పారు.




**మంత్రి తుమ్మల వ్యాఖ్యలపై..**

కాళేశ్వరం ప్రాజెక్టు అంశం అసలు కేబినెట్ ముందుకే రాలేదంటూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యలను ఈటల రాజేందర్ కొట్టిపారేశారు. కేబినెట్లో చర్చించకుండా ప్రభుత్వంలో ఏదీ జరగదని గుర్తుచేశారు. అలాంటిది కాళేశ్వరం ప్రాజెక్టుపై కేబినెట్ చర్చించలేదనడం సరికాదని అన్నారు. ప్రాజెక్టు విషయంలో తీసుకున్న ప్రతీ నిర్ణయంపై కేసీఆర్ అందరితో సంతకాలు తీసుకున్నారని చెప్పారు. ఈ విషయం అప్పటి మంత్రులు తుమ్మల, జూపల్లి, కడియం శ్రీహరిలకు కూడా తెలుసని అన్నారు. కాంగ్రెస్ నేతలకు దమ్ముంటే ఈ కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు.

# ఛార్జింగ్ పెట్టి మాట్లాడుతుండగా పేలిన ఫోన్ యువకుడు మృతి



TG% మేడ్చల్ జిల్లా జగద్గిరిగుట్ట పీఎస్ పరిధిలోని రింగ్ బస్తీలో విషాదం చోటుచేసుకుంది. సాయి (27) అనే యువకుడు ఇంట్లో ఫోన్ ఛార్జింగ్ పెట్టి మాట్లాడుతుండగా ఒక్కసారిగా పేలింది. దీంతో తీవ్రగాయాలై అక్కడే పడిపోయాడు. అదే సమయంలో షార్ట్ సర్క్యూట్ కావడంతో అతడు ఉన్న రూమ్ మొత్తం మంటలు వ్యాపించగా శరీరం కాలిపోయి మృతిచెందాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ ఘటన జరిగింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మస్క్ కు సీరియస్ వార్నింగ్ ఇచ్చిన ట్రంప్

**వ్యయ బిల్లుపై ఇరువురి మధ్య ముదిరిన వివాదం**

**ఆ పనిచేస్తే మస్క్‌ను తీవ్రంగా దండించాల్సి వస్తుందన్న ట్రంప్**

**రిపబ్లికన్లకు వ్యతిరేకంగా మస్క్ నిధులిస్తే తీవ్ర పరిణామాలు**




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌ల మధ్య వివాదం మరింత ముదిరింది. కాంగ్రెస్‌లో ప్రవేశపెట్టిన వివాదాస్పద వ్యయ బిల్లుకు అనుకూలంగా ఓటు వేసే రిపబ్లికన్లను శిక్షించేందుకు మస్క్ ప్రయత్నిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ట్రంప్ హెచ్చరించారు. ట్రంప్ ప్రతిపాదించిన "బిగ్ బ్యూటిఫుల్ బిల్"ను మస్క్ తీవ్రంగా విమర్శించడంతో ఈ వివాదం మొదలైంది. ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఉన్న కొందరు చట్టసభ సభ్యులు, బిల్లుకు మద్దతిచ్చే రిపబ్లికన్లపై ప్రైమరీ ఎన్నికల్లో పోటీకి నిధులు సమకూర్చాలని గత ఏడాది అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీకి మద్దతు ఇచ్చిన మస్క్‌ను కోరారు. దీనిపై స్పందించిన ట్రంప్.. "అతను (మస్క్) అలా చేస్తే చాలా తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవలసి ఉంటుంది" అని ఎన్బీసీ న్యూస్‌తో అన్నారు. మస్క్ "అగౌరవంగా" ప్రవర్తించారని కూడా ట్రంప్ ఆరోపించారు. మస్క్‌తో సంబంధాన్ని చక్కదిద్దుకోవాలనే కోరిక తనకు లేదని, అతనితో మాట్లాడే ఉద్దేశం కూడా లేదని ట్రంప్ స్పష్టం చేశారు.

# 'వేశ్యలు" అంటూ చేసిన ఈ వ్యాఖ్యలను ఉపేక్షించే పరిస్థితే లేదు: సీఎం  చంద్రబాబు

## రాజధాని మహిళలపై సాక్షి టీవీలో జర్నలిస్ట్ కృష్ణంరాజు వివాదాస్పద వ్యాఖ్యలు




జర్నలిస్ట్ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం, ఖండనస్త్రీ జాతిని అవమానిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేసిన సీఎంమాజీ సీఎం జగన్ తీరుపై చంద్రబాబు అసంతృప్తి, విచారంమహిళల మనోభావాలు దెబ్బతీసిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరికరాజధాని అమరావతి ప్రాంత మహిళలను ఉద్దేశించి సాక్షి టీవీ ఛానల్ లో కృష్ణంరాజు అనే జర్నలిస్ట్ తీవ్ర అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాజధాని గురించి, అక్కడి మహిళల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా 'వేశ్యలు' అంటూ చేసిన దారుణమైన వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ, మీడియా ముసుగులో సాగుతున్న ఇలాంటి వికృత చేష్టలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. "తన సొంత మీడియా చానల్ ద్వారా జరిగిన ఈ దారుణాన్ని ఒక మాజీ ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి ఇప్పటికీ ఖండించక పోవడం, స్త్రీ జాతికి క్షమాపణ చెప్పకపోవడం మరింత విచారకరం. ఆడబిడ్డలను గౌరవించే సంస్కృతి మనది. స్త్రీమూర్తులను ఆరాధించే సమాజం మనది. ఇది మన సంప్రదాయం. మన భారతీయ జీవన విధానం. ముఖ్యంగా మన తెలుగు ప్రజల విషయానికి వస్తే ఆడబిడ్డను, అమ్మను ఎంతో ఆదరణతో చూస్తాం. అలాంటి మన రాష్ట్రంలో రాజకీయ కక్షతో, మీడియా విశ్లేషణల పేరుతో నిస్సిగ్గుగా ఏకంగా మన తల్లులు, చెల్లెళ్లపై దారుణ వ్యాఖ్యలు చేయడం క్షమించరాని నేరం. వాళ్లు ఎప్పుడూ అనుసరించే ఈ విష సంస్కృతిపై తిరుగుబాటుగా గత ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చినా వారి వైఖరిలో మార్పు రాలేదనేది సుస్పష్టం. రాజధానిపై విషం చిమ్మే కుట్రలో గట్టు దాటి మహిళల మనోభావాలను గాయపరచిన వారిపై అత్యంత కఠిన చర్యలు తీసుకుంటాం. గత విధ్వంస ప్రభుత్వం పై రాజధాని మహిళల పోరాటాన్ని మనసులో పెట్టుకుని ఆ ప్రాంత మహిళలపై ఉద్దేశ్య పూర్వకంగా, నీచాతినీచంగా చేసిన ఈ వ్యాఖ్యలు మొత్తం మహిళా సమాజాన్నే అవమానించడం. మహిళలను గౌరవించే, వారి ఆత్మగౌరవానికి అండగా నిలిచే కూటమి ప్రభుత్వం ఈ నీచ సంస్కృతికి చెక్ పెట్టే బాధ్యత తీసుకుంటుంది" అని చంద్రబాబు పేర్కొన్నారు.

# ట్రంప్కు వ్యతిరేకంగా వీధుల్లోకి ప్రజలు



అమెరికా కాలిఫోర్నియాలోని లాస్ ఏంజిల్స్‌లోట్రంప్ పరిపాలన వలస విధానానికి వ్యతిరేకంగానిరసనలు తీవ్రమయ్యాయి. పారామౌంట్ప్రాంతంలో ఆందోళనలు హింసాత్మకంగామారాయి. పోలీసులకు, నిరసనకా రులకు మధ్యఘర్షణలు జరిగాయి. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు లాఠీఛార్జ్, టియర్‌గ్యాస్ను ప్రయోగించాల్సి వచ్చింది.

# తెలంగాణ రాజ్ భవన్‌లో మంత్రుల ప్రమాణ స్వీకారం

తెలంగాణ క్యాబినెట్ లో మరో ముగ్గురు నేతలకు చోటు దక్కింది. కొత్తగా ఎమ్మెల్యేలు గడ్డం వివేక్, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లు ఈ రోజు ఉదయం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్ భవన్ లో నూతన మంత్రులతో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ప్రమాణస్వీకారం చేసిన వారిలో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఉన్నారు. తాజా విస్తరణలో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయాన్ని పరిగణనలోకి తీసుకున్నది. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మాత్రమే అవకాశం కల్పించింది. కాగా, ఈసారి మంత్రివర్గ విస్తరణలో సుదర్శన్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలకు చోటు దక్కుతుందని ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. అయితే, ప్రస్తుతానికి ఎస్సీ, బీసీలకు




మాత్రమే అవకాశం ఇవ్వాలని అధిష్టానం సూచించినట్లు తెలిసింది. కొత్త మంత్రులతో పాటు శాసనసభ డిప్యూటీ స్పీకర్ గా రామచంద్రునాయకన్ ను కాంగ్రెస్ అధిష్టానం ఎంపిక చేసింది.

# అప్పులన్నీ రికవరీ చేసుకున్న బ్యాంకులు

## ఇంకా మాల్యా నేరగాడేనా ?



విజయ్ మాల్యా. ఆయన లండన్ పోవడానికి ముందు వరకూ దేశ ప్రజల్లో ఓ ప్రత్యేకమైన ఇమేజ్ ఉన్న వ్యక్తి. డబ్బులు సంపాదించడం కాదు..దానితో ఎలా ఎంజాయ్ చేయాలో కూడా తెలిసిన వ్యక్తి అని చెప్పుకునేవారు. అయితే బ్యాంకుల వద్ద అప్పులు తీసుకుని ఎగ్గొట్టి పారిపోయాడన్న నిందను మోస్తున్నారు. నిజానికి ఆయన అప్పులు తీసుకున్నారు..కానీ ఎగ్గొట్టలేదు. ఆయన ఆస్తుల్ని వేలం వేసుకుని బ్యాంకులు రికవరీ చేశాయి.ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్ల మెంట్‌లో స్పష్టంగా ఈ వివరాలు ప్రకటించారు. విజయ్ మాల్యాకు చెందిన రూ. 14,131.6 కోట్లు విలువైన ఆస్తులను బ్యాంకులు జప్తు చేసుకున్నాయి. ఇది కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్‌కు సంబంధించిన రూ. 6,203 కోట్ల రుణం వడ్డీతో సహా లెక్కవేసుకున్నా రెట్టింపు కంటే ఎక్కువ. మరి ఆయనను ఇంకా ఎందుకు నేరగాడిగా చూస్తున్నారు ప్రశ్న వస్తోంది. అయితే ఆయనకు మద్దతుగా చాలా కొద్ది మంది మాట్లాడుతున్నారు. ఆర్పీజీ గ్రూప్ ఛైర్మన్ హర్ష్ గోయెంకా మాత్రమే ఆయనకు మద్దతుగా ముందుకు వచ్చారు. పొలిటికల్ పంచ్ బ్యాగ్‌గా మాల్యాను ఉపయోగిం చుకుంటున్నారని మర్శించారు.ఇప్పుడు మాల్యా ఎవరికీ అప్పు లేరు.. బ్యాంకులు రికవరీ చేసుకు న్నాయి. ఎవరి సొమ్ము దొంగతనం చేయలేదు. 28 సంవత్సరాల వయస్సులో మాల్యా యునైటెడ్ బ్రూవరీస్ గ్రూప్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించాడు. అతని శైలికి తగ్గ వ్యాపారం కావడంతో విస్తరణలో దూకుడు చూపించాడు. మద్యం, ఏవియేషన్, రియల్ ఎస్టేట్ , స్పోర్ట్స్ రంగాల్లో విస్తృత సామ్రాజ్యాన్ని నిర్మించాడు. ఆడంబరమైన జీవనశైలి, హై-ప్రొఫైల్ వెంచర్‌లు, RCB , ఫార్ములా 1లో స్పాన్సర్‌షిప్ విజయ్ మాల్యాను వ్యాపార ప్రపంచంలో షో స్టాపర్ గా నిలిపాయి. కానీ ఎయిర్ లైన్స్ మొత్తంగా దెబ్బకొట్టింది. రాజకీయాల్లోకి వచ్చి మాల్యా ఎంపీ అయ్యారు. అక్కడే ఆయన తప్పు చేశారేమో కానీ.. చాలా మంది కన్నా.. ఎక్కువగా శిక్ష అనుభవిస్తున్నారు. వేల కోట్లు నిజంగా బ్యాంకులు ఎగ్గొట్టిన వాళ్లు ఇండియాలోనే గౌరవంగా బతుకుతున్నారు. కానీ మాల్యా మాత్రం నేరగాడిగా ముద్ర వేసుకుని ప్రవాసంలో బతుకుతున్నారు. ఇటీవల నాలుగు గంటలకుపైగా ఇచ్చిన ఓ పాడ్ కాస్ట్ ఇంటర్వ్యూ తర్వాత ఈ అంశంలో ఆయనకు మద్దతు లభిస్తోంది.

# ఐపీవో బాటలో లలితా జువెలరీ.. రూ.1700 కోట్ల సమీకరణకు ప్రణాళిక

**పబ్లిక్ ఇష్యూకు లలితా జువెలరీ మార్ట్ సన్నాహాలు - ప్రమోటర్ కిరణ్ కుమార్ జైన్ షేర్ల విక్రయం**

**కొత్తగా 12 స్టోర్ల ఏర్పాటుకు నిధుల వినియోగం - ఎన్ఎస్ఈ, బీఎస్ఈలలో షేర్ల లిస్టింగ్**




ప్రముఖ ఆభరణాల విక్రయ సంస్థ లలితా జువెలరీ మార్ట్ త్వరలోనే పబ్లిక్ ఇష్యూకు (ఐపీవో) వచ్చేందుకు సిద్ధమవుతోంది. దీని ద్వారా సుమారు రూ.1700 కోట్లు సమీకరించాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు సంబంధించిన ప్రాథమిక పత్రాలను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి సమర్పించింది.సమీకరించదలచిన మొత్తంలో రూ.1200 కోట్ల విలువైన తాజా ఈక్విటీ షేర్లను జారీ చేయాలని లలితా జువెలరీ ప్రతిపాదించింది. దీనికి అదనంగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలో సంస్థ ప్రమోటర్ అయిన కిరణ్ కుమార్ జైన్ తన వాటా నుంచి రూ.500 కోట్ల విలువైన షేర్లను విక్రయించనున్నారు.చెన్నై కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న లలితా జువెలరీకి దక్షిణ భారతదేశంలోని పలు నగరాల్లో మొత్తం 56 రిటైల్ విక్రయశాలలు ఉన్నాయి. 2022-24 ఆర్థిక సంవత్సరాల మధ్య కాలంలో సంస్థ ఆదాయాల్లో ఏటా సగటున 43.62 శాతం వృద్ధి నమోదైనట్లు తెలుస్తోంది. అయితే, సంస్థకు కొంత రుణ భారం కూడా ఉన్నట్లు సమాచారం.ఈ ఐపీవో ద్వారా లభించే నిధులను ప్రధానంగా వ్యాపార విస్తరణకు ఉపయోగించనున్నారు. కొత్తగా 12 స్టోర్లను ఏర్పాటు చేయడంతో పాటు ఇతర కార్పొరేట్ అవసరాలకు కూడా ఈ నిధులను కేటాయించనున్నారు. ఐపీవో ప్రక్రియ పూర్తయిన తర్వాత సంస్థ ఈక్విటీ షేర్లను ఎన్ఎస్ఈ (జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్), బీఎస్ఈ (బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్)లలో నమోదు చేయిస్తారు.ఈ పబ్లిక్ ఇష్యూకు ఆనంద్ రాఠీ అడ్వైజర్స్, ఈక్విరస్ కేపిటల్ సంస్థలు లీడ్ మేనేజర్లుగా వ్యవహరించనున్నాయి. ఎంయూఎఫ్‌జీ ఇన్‌టైమ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఈ ఐపీఓకు రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తుంది.ఇప్పటికే భారత స్టాక్ మార్కెట్లో టైటన్ ఇండియా, కళ్యాణ్ జువెలర్స్, పీసీ జువెలర్స్, పీఎన్ గాడ్గిల్ జువెలర్స్, తంగమలై, త్రిభోవన్‌దాస్ భీమ్‌జీ జవేరి (టీబీజడ్) వంటి పలు ఆభరణాల విక్రయ సంస్థలు లిస్టయి ఉన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు లలితా జువెలరీ కూడా ఈ జాబితాలో చేరనుంది.

# ఆల్విన్ కాలనీలో ఘనంగా కపిల్ రాజ్ జన్మదిన వేడుకలు



**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**

అల్వన్ కాలనీ లోని తన నివాసంలో సీనియర్ నాయకులు కపిల్ రాజు జన్మదిన సందర్భంగా టీజీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు కృష్ణ యాదవ్, నేషనల్ ఓల్డ్ పెన్షన్ రెస్టొరేషన్ యునైటెడ్ ఫ్రంట్ సౌత్ ఇండియా ఇంచార్జ్ మాచన రఘునందన్ లు కపిల్ రాజ్ ను మర్యాదపూర్వకంగా కలిసి, కేక్ కట్ చేసి, శాలువాలతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ మలిదశ తెలంగాణ ఉద్యమంలో తనదైన శైలిలో రాష్ట్రం కోసం నిరంతరం పోరాడిన వ్యక్తిగా, స్నేహసిలి మధుర స్వభావం కలవారు అని కపిల్ రాజ్ ఇలాంటి జన్మదిన వేడుకలు ఎన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా మన్నారు. ఎన్నో ఉన్నత స్థానాలకు ఎదుగుతూ ఉండాలని ఇలాంటి వేడుకలు జరుపుకోవాలని కోరుకుంటున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో దప్పు రామస్వామి, నవాజ్, సుధాకర్ రెడ్డి, బీసీ సంఘం నాయకులు సుధాకర్, శంషొద్దీన్, పద్మ, రమేష్ రావు, సత్య వర్ధన్, సుభాష్ రెడ్డి.టీఎన్జీవో రాష్ట్ర సెక్రెటరీ జి చందు. గంగారాం యాదవ్ మహేష్ యాదవ్ రాజు. శివ మల్లేష్ ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

## శంకర్పల్లి ఆలయంలోఘనంగా అయ్యప్ప స్వామి పూజలు

**తెలుగు వెలుగు జూన్ 8**



శంకరపల్లి అయ్యప్ప ఆలయంలో శ్రీ శ్రీ శ్రీ సద్గురు సచ్చిదానంద సరస్వతి స్వామి ఆంధ్రప్రదేశ్ తోపావనం పిఠాధిపతులు తుని చెందిన ఆధ్వర్యంలో అయ్యప్ప పడి పూజ ప్రత్యేక పూజలు భజన కార్యక్రమాలు మరియు అన్నప్రసాదాలు నిర్వహించారు, ఈకార్యక్రమంలో సేవ భజన విపంచి శర్మ, ఆలయ కమిటి మరియు అయ్యప్ప సేవ సమితి, అయ్యప్ప భక్తులు, ప్రజలు పాల్గొన్నారు

## ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్న బండి రమేష్

**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**



కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ఆదివారం నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మోతీ నగర్ పాండురంగ నగర్లో వేం చేసియున్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి 31వ వార్షిక బ్రహ్మోత్సవాలు రాఘవేంద్ర ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రశాంత్ నగర్ లో రేణుక ఎల్లమ్మ మరియు పోచమ్మ యంత్ర విగ్రహ ప్రతిష్ట నరేష్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమం లో కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భక్తులకు అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కే నరేష్, నాయకులు లక్ష్మయ్య, సుధాకర్ , సాత్విక్ ,శివ చౌదరి, గోవిందు ,రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కపిల్ రాజు నేత జన్మదిన వేడుకలు

**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**



ఆల్విన్ కాలనీ డివిజన్ ఈస్ట్ సాయి నగర్ సాయిబాబా మందిరం అధ్యక్షులు ఎన్ కపిల్ రాజు జన్మదినం సందర్భంగా సురభి రమేష్ రావు శాల్వాతో సత్కరించి, పుష్పగుచ్చం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సురభి రమేష్ రావు మాట్లాడుతూ నిండు నూరేళ్లు జీవించాలని ఆ భగవంతున్ని కోరుకుంటున్నాను అని మనస్ఫూర్తిగా తెలియజేశారు. ఈ జన్మ దిన వేడుకలో ఆకుల పద్మ, సత్య వర్ధన్ రావు, సుభాష్ రెడ్డి, రామకృష్ణా చారి , బాల్రాజ్, శంషుద్దీన్, నిఖిల్ మొదలగు వారు పాల్గొన్నారు.

## మాగంటి గోపీనాథ్ పార్థివ దేహాన్ని పరామర్శించిన ఎర్రబెల్లి సతీష్ రావు



**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**

బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ భౌతికకాయం వద్ద బీఆర్ఎస్ పార్టీ శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు నివాళులు అర్పించారు.

## శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి 31వ వార్షిక బ్రహ్మోత్సవాలు



కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ఆదివారం నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మోతీ నగర్ పాండురంగ నగర్లో వేం చేసియున్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి 31వ వార్షిక బ్రహ్మోత్సవాలు రాఘవేంద్ర గారి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ గారు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రశాంత్ నగర్ లో రేణుక ఎల్లమ్మ మరియు పోచమ్మ యంత్ర విగ్రహ ప్రతిష్ట నరేష్ గారి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమం లో కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ గారు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భక్తులకు అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కే నరేష్, నాయకులు లక్ష్మయ్య, సుధాకర్ , సాత్విక్ ,శివ చౌదరి, గోవిందు ,రమణ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు భోజనాలు పంపిణీ




**తెలుగు - వెలుగు, తూ.గో. జిల్లా బ్యూరో (అనపర్తి):**

అనపర్తి : అనపర్తి రైజింగ్ హాండ్స్ ఫర్ హెూప్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వృద్ధులకు భోజనం పంపిణీ చేశారు.శనివారం 11 జిల్లాల ఏపీఈపీడిసియల్ షిఫ్ట్ ఆపరేటర్ ప్రతినిధుల డిస్కం ఎగ్జిక్యూటివ్ సభ్యులు కురసాల జ్యోతి కుమార్ జన్మదినోత్సవం పురస్కరించుకుని తేతలి రామిరెడ్డి మంగయ్యమ్మ మహిళా వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో తేతలి నారాయణరెడ్డి, డాక్టర్ నల్లమిల్లి ఆదిరెడ్డి, కోస్తాంధ్ర రెడ్డి యువజన సంక్షేమ సంఘం అధ్యక్షులు తాడి చంద్రశేఖర్ రెడ్డి, చావలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జయశంకర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడికి అభినందనలు తెలిపిన రామకృష్ణ గౌడ్




**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**

అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని జయశంకర్ కాలనీలో జరిగిన కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలలో అధ్యక్షుడిగా భారీ మెజార్టీతో గెలుపొందిన మహేష్ కాలనీ వాసులతో కలిసి యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యువ నేత రామకృష్ణ గౌడ్ మహేష్ ని శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేసారు. మహేష్ జన్మదిన శుభసందర్భంగా కేక్ కట్ చేసి మహేష్ కు జన్మదిన శుభాకాంక్షలు కూడా తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న బిజెపి నేత వడ్డేపల్లి రాజేశ్వరరావు

**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**



బేగంపేట్ ఓల్డ్ ఎయిర్పోర్ట్ రోడ్డు లోనీ తెలంగాణ గార్డెన్స్ లో జరిగిన నీరుడి వారి వివాహ వేడుకలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు మిత్రుడు నీరుడి కృష్ణ ఆహ్వానం మేరకు వేడుకలో పాల్గొని నూతన వధూవరులైన రవి కిరణ్, ప్రియాంక లను అభినందించి ఆశీర్వదించారు.

## జనసేన పార్టీ కూకట్ పల్లి నియోజకవర్గ క్రియాశీలక సభ్యత్వ ఐడి కార్డ్ లను పంపిణీ చేసిన ప్రేమ కుమార్



**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**

కెపిహెచ్బి కాలనీ 5వ ఫేస్ జనసేన పార్టీ ఆఫీస్ వద్ద కూకట్ పల్లి నియోజకవర్గం లో పార్టీ క్రియాశీలక సభ్యత్వము నమోదు చేయించిన వాలంటరీలకు జన సైనికులకు, వీర మహిళలకు సభ్యత్వ ఐడి కార్డులను కూకట్‌పల్లి నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ ముమ్మారెడ్డి ప్రేమకుమార్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ ప్రమాదవశాత్తు మరణించిన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యులకు ఐదు లక్షల చొప్పున అందించి వారి కుటుంబాలకు భరోసానిచ్చిన అధినేత పవన్ కళ్యాణ్ కి ధన్యవాదాలు తెలుపుతూ ఇటువంటి 5 లక్షలు ఇచ్చే ఆలోచన ఏ రాజకీయ పార్టీలో లేదని కేవలం జనసేన పార్టీలోనే ఉందని అన్నారు . కూకట్ పల్లి నియోజకవర్గంలో 3000 పైచిలుకు క్రియాశీలక సభ్యత్వాలను నమోదు చ చేయించిన వాలంటీరులను అభినందిస్తూ రాబోయే రోజులలో జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆశయాలను, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి డివిజన్ కి 3000 పైచిలుకు క్రియాశీలక సభ్యత్వాలు చేయించి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్రియాశీలక సభ్యత్వము నమోదు చేయించిన వాలంటరీలు కొల్లా శంకర్ , సలాది శంకర్, దొరబాబు (వెంకట్), పోలే బోయిన శ్రీనివాస్, మత్తి శ్రీనివాస్, ప్రభు చైతన్య, పులగం సుబ్బు , భూ శంకర్, రామకృష్ణ, వెంకటేశ్వరరావు, పాదం సూర్యా, పుష్పలత జనసేన నాయకులు వీర మహిళలు పాల్గొన్నారు

## కాంగ్రెస్లో బుజ్జగింపులు పర్వం



TG: మంత్రివర్గంలో చోటు దక్కకపోవడంతో నిరాశకు లోనైన ఎమ్మెల్యేలను బుజ్జగించే కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకత్వం చేపట్టింది. ఎమ్మెల్యేలు సుదర్శన్రెడ్డి, ప్రేమ్సాగర్రావు, మల్రెడ్డి రంగారెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్రెడ్డిలను రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్ఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశకుమార్ కలిసి బుజ్జగించారు. సామాజిక సమతుల్యతను దృష్టిలో ఉంచుకుని ఎంపిక జరిగినట్లు వివరించారు.

## కాసేపట్లో హైదరాబాద్ కు ప్రభాకర్ రావు



TG: SIBమాజీ చీఫ్ ప్రభాకర్ రావు మరికాసేపట్లో హైదరాబాద్ కు చేరుకోనున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావు A1 గా ఉన్నారు. %దీ=ా% హయాంలో SIB చీఫ్ గా పనిచేసిన ప్రభాకర్ రావుపై ఫోన్ టాపింగ్ కేసు ఆరోపణలు రావడంతో ఆయన అమెరికాకు పరారయ్యారు. అయితే సుప్రీం కోర్టు రక్షణ కల్పించడంతో తాజా ఆదేశాల మేరకు ప్రభాకర్ రావు భారత్ కు తిరిగి వస్తున్నారు

## కొత్తగా ప్రమాణం స్వీకారం చేస్తున్న మంత్రులు



-వివేక్ వెంకటస్వామి (మాల)-అడ్లూరి లక్ష్మణ్ (మాదిగ)-వాకిటి శ్రీహరి (ముదిరాజ్)శాసనసభ ఉపసభాపతి-రామచంద్రు నాయక్ (బంజారా) సామాజిక న్యాయానికి ప్రతీక.. ప్రజా ప్రభుత్వం

# గుళ్లో మహిళా జడ్జి మంగళసూత్రం కొట్టేశారు లేడీ గ్యాంగ్ అరెస్ట్!

### ఉత్తర్‌ప్రదేశ్‌లోని మథుర ఆలయాల్లో మహిళా దొంగల ఆగడాలు




మధ్యప్రదేశ్ జడ్జి మంగళసూత్రం చోరీ కావడంతో కలకలంరంగంలోకి దిగిన పోలీసులు, పది మంది మహిళా దొంగల ముఠా అరెస్ట్నిందితులు మధ్యప్రదేశ్, రాజస్థాన్‌కు చెందినవారని గుర్తింపురద్దీగా ఉండే ఆలయాల్లో చేతివాటం ప్రదర్శిస్తున్న ముఠాచోరీ సొత్తు స్వాధీనం, నిందితులు జైలుకుఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన మథుర, బృందావన్‌లలోని ఆలయాలు ఇటీవల మహిళా దొంగలకు అడ్డాగా మారాయి. తాజాగా ఓ మహిళా న్యాయమూర్తి మంగళసూత్రమే చోరీకి గురికావడంతో ఈ వ్యవహారం తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై తక్షణమే స్పందించిన పోలీసులు, ముమ్మర దర్యాప్తు చేపట్టి పది మంది సభ్యులున్న ఓ మహిళా దొంగల ముఠాను అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే, మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిన్‌లో అదనపు జిల్లా, సెషన్స్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్న ప్రేమ సాహు ఇటీవల తన కుటుంబ సభ్యులతో కలిసి బృందావన్‌లోని ఓ ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయంలో దైవదర్శనం చేసుకుంటున్న సమయంలో ఆమె మెడలోని మంగళసూత్రం చోరీకి గురైంది. ఈ ఘటనపై ఆమె స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. న్యాయమూర్తి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఆలయ పరిసరాల్లో నిఘా పెట్టి, అనుమానితుల కదలికలపై దృష్టి సారించారు. ఈ క్రమంలో, ఆలయాల్లో భక్తులను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న పది మంది మహిళలతో కూడిన ముఠాను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు స్థానిక పోలీసు అధికారులు వెల్లడించారు. అరెస్టయిన మహిళల ంతా మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందినవారని పోలీసులు తెలిపారు. వీరి నుంచి పెద్ద సంఖ్యలో పర్సులు, కొంత నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మథుర, బృందావన్‌లలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ఆలయాలను లక్ష్యంగా చేసుకుని ఈ ముఠా సభ్యులు తమ చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరిచిన అనంతరం వారిని జైలుకు తరలించినట్లు పోలీసులు వివరించారు. ఈ అరెస్టుతో ఆలయాల్లో చోరీలకు కొంతమేర అడ్డుకట్ట పడుతుందని భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు

# లాస్ ఏంజెలిస్‌లో ఏం జరుగుతోంది

**2 వేల మంది కమాండోల మోహరింపు - లాస్ ఏంజెలెస్‌లో అక్రమ వలసదారుల అరెస్టులతో ఉద్రిక్తత**

**2000 మంది నేషనల్ గార్డులను పంపిన అధ్యక్షుడు ట్రంప్- 60 రోజుల పాటు లాస్ ఏంజెలెస్‌లోనే బలగాలు**

**ట్రంప్ చర్యలను ఖండించిన కాలిఫోర్నియా గవర్నర్ గావిన్ న్యూసమ్ - హింస పెరిగితే మెరైన్ కమాండోలను దించుతామన్న రక్షణ మంత్రి**

**యూనియన్ నేత అరెస్ట్‌తో మరింత పెరిగిన ఆందోళనలు**

అమెరికాలోని లాస్ ఏంజెలెస్‌లో అక్రమ వలసదారులను గుర్తించి, అదుపులోకి తీసుకునేందుకు ఫెడరల్ అధికారులు చేపట్టిన చర్యలు తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీశాయి. ఈ పరిణామాల నేపథ్యంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం తక్షణమే 2000 మంది నేషనల్ గార్డు దళాలను లాస్ ఏంజెలెస్‌కు పంపాలని ఆదేశించారు. ఈ మేరకు శ్వేతసౌధం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. నగరంలో శాంతిభద్రతలు అదుపు తప్పడంతో ఈ దళాలు సుమారు 60 రోజుల పాటు అక్కడే ఉంటాయని ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.

**అసలేం జరిగిందంటే?**

శుక్రవారం లాస్ ఏంజెలెస్‌లో ఫెడరల్ అధికారులు అక్రమ వలసదారులను లక్ష్యంగా చేసుకుని ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా మొత్తం 44 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ చర్యలకు వ్యతిరేకంగా వందలాది మంది నిరసనకారులు రోడ్లపైకి వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టడంతో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి, ఆందోళనకారులను చెదరగొట్టేందుకు లాఠీఛార్జి చేయడంతో పాటు భాష్పవాయువును కూడా ప్రయోగించారు. ఈ క్రమంలోనే సర్వీస్ ఎంప్లాయీస్ ఇంటర్నేషనల్ యూనియన్ కాలిఫోర్నియా అధ్యక్షుడు డేవిడ్ హుయెర్టాను కూడా అధికారులు అదుపులోకి తీసుకోవడంతో పరిస్థితి మరింత తీవ్రరూపం దాల్చింది. ఆయనను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ




ఆందోళనకారులు ఫెడరల్ భవనం వెలుపల భారీగా గుమిగూడారు. వారిని అడ్డుకునేందుకు ఫెడరల్ అధికారులు పెప్పర్ స్ప్రే ప్రయోగించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి.

**ట్రంప్ నిర్ణయంపై భిన్నాభిప్రాయాలు**

ఈ ఘటనలపై స్పందించిన అధ్యక్షుడు ట్రంప్, కాలిఫోర్నియా గవర్నర్, లాస్ ఏంజెలెస్ మేయర్ తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. అందుకే ఫెడరల్ ప్రభుత్వం జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరిస్తుందని ఆయన ప్రకటించారు. మరోవైపు, అమెరికా రక్షణశాఖ మంత్రి పేట్ హెగ్‌సేత్ కూడా ఈ ఘటనలపై తీవ్రంగా స్పందించారు. హింస ఇలాగే కొనసాగితే మెరైన్ కమాండోలను రంగంలోకి దించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. అయితే, ట్రంప్ నిర్ణయాన్ని కాలిఫోర్నియా గవర్నర్ గావిన్ న్యూసమ్ తీవ్రంగా ఖండించారు. అధ్యక్షుడు ఉద్దేశపూర్వకంగానే ఉద్రిక్తతలను రెచ్చగొడుతున్నారని ఆయన విమర్శించారు. "కాలిఫోర్నియా పోలీసులను కాదని ఫెడరల్ ప్రభుత్వం 2000 మంది నేషనల్ గార్డ్స్‌ను లాస్ ఏంజెలెస్‌లో మోహరిస్తోంది. శాంతిభద్రతల కారణంగా ట్రంప్ ఈ చర్య తీసుకున్నారనుకోవడం వాస్తవం కాదు. ఉద్దేశపూర్వకంగానే ఆయన ఉద్రిక్తతలు రెచ్చగొడుతున్నారు" అని న్యూసమ్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పోస్టు చేశారు. ఈ పరిణామాలతో లాస్ ఏంజెలెస్‌లో ఉద్రిక్త వాతావరణం కొనసాగుతోంది.

# విగ్రహా ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న వడ్డేపల్లి

**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**

కూకట్పల్లి నియోజకవర్గం పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్ లోని రేణుక ఎల్లమ్మ, నల్లపోచమ్మ యంత్ర విగ్రహా ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోనీ రాజీవ్ గాంధీ నగర్ లో అంగరంగ వైభవంగా నిర్వహించబడుతున్న శ్రీ రేణుక ఎల్లమ్మ, నల్లపోచమ్మ దేవాలయ యంత్ర విగ్రహా ప్రతిష్ఠ మహోత్సవంలో వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆలయకమిటి సభ్యుల ఆహ్వానం మేరకు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడ విచ్చేసినటువంటి భక్తులందరూ గంగాభిషేకాలు, హోమాలు, విభిన్న దేవతారాధనలు భక్తి శ్రద్ధాలతో ప్రత్యేకంగా నిర్వహించరూ. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వడ్డేపల్లి రాజేశ్వరరావుకి ఆలయ కమిటీ



సభ్యులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. తదనంతరం గణంగా సన్మానించి ఆలయ అర్చకులు వేదాశీర్వచనాము ప్రసాదించారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నీ భక్తులకు స్వయంగా వడ్డించారు. ఈ కార్యక్రమంలో బస్తీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల నిర్లక్ష్యంతోనే సమస్యలు

దేశ ఆర్థిక వ్యవస్థకు మూలాధారమైన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతంపై



ప్రభుత్వాలు చిత్తశుద్ధిని ప్రదర్శించడం లేదు. గ్రామాల్లో ఆర్థిక అభివృద్ధి, ఉపాధి అవకాశాలు పెరిగితేనే జాతీయ అభివృద్ధి సాధ్యమన్న కనీస పరిజ్ఞానం పాలకులకు లేకుండా పోతోంది. వ్యవసాయం, అనుబంధ పరిశ్రమలను పెద్ద ఎత్తున్న ప్రోత్సహించే కార్యాక్రమాలు చేపట్టడం లేదు. దీంతో ఉద్యోగాల కోసం ప్తి ఒక్కరూ పట్టాణలపై ఆధారపడాల్సి వస్తుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉంటే దేశం బలంగా ఉంటుందన్నది చాణుక్యుడి కాలం నుంచి అమల్లో ఉంది. చాణుక్యుడు ఈ సూత్రం ఆధారంగానే గ్రామాలను బలోపేతం చేయాలని సూచించారు. ఆయన అర్థ శాస్త్రంలో ఎలాంటి ఆర్థిక వ్యవస్థ అవసరమో సూచించారు. ఎలాగైతే మన ఆర్థిక వ్యవస్థ బలపడుతుందో తెలిపారు. కానీ పాలకులు దానిని పాఠ్యపుస్తకాల్లోంచి తీసేసారు. తమ మెదళ్లోంచి తీసేసారు. దాన్ని అమలు చేయాలన్న విషయాలను మరిచారు. నిజానికి దేశం బాగుడాలంటే గ్రామాలు బలపడాలి. గ్రామాలు ఆర్థికంగా వృద్ధి చెందాలి. వ్యవసాయం అందుకు ఆలంబన కావాలి. అన్నదాతలు ఆర్థికంగా బలపడితేనే అనుబంధ రంగాలకు ప్రాధాన్యం పెరుగుతుంది. అయితే వ్యవసాయికంగా మనం పంటల ఉత్పత్తిలో చూపిస్తున్న శ్రద్ధ వ్యవసాయ అనుబంధరంగాల అభివృద్ధికి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో అన్ని విధాలుగా మనమంతా అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఈ ఒక్క సూత్రాన్ని పాటిస్తే పంట ఉత్పత్తులతో పాటు..నిరుద్యోగ సమస్యకు చెక్ పెట్టడమే గాకుండా... గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి దోహదపడగలం. గ్రామస్థాయిలో ప్రణాళికలు రచించి అమలయ్యేలా కార్యాచరణ సాగడం లేదు. దీనికితోడు గ్రామాల్లో ఏం జరగాల్లో ఇక్కడి నుంచి రిమోట్ ద్వారా నిర్దేశించడం, కేంద్రం ఇచ్చిన నిధులను పక్కదారి పట్టించడం వంటి చర్యల కారణంగా ఇంకా వలసలు పెరిగి పట్టణాలపై ప్రజలు ఆధారపడు తున్నారు. ఈ కారణంగానే గ్రామాల్లో ఉపాధి, ఉద్యోగావకాశాలు రావడం లేదు. ఈ కారణంగానే గ్రామాల్లో కూలీల సమస్య తీవ్రంగా మారింది. గ్రామాలను నిర్లక్ష్యం చేయడం వల్ల ప్రజలు పట్టణాలకు వలస వస్తున్నారు. దీంతో పట్టణాలపై భారం పడుతోంది. దీనిని ప్రభుత్వాలు గమనించడం లేదు. గ్రామీణ అర్థిక వ్యవస్థను బలోపే తానికి గ్రామాలు యూనిట్‌గా సర్పంచ్‌లను బాధ్యులను చేసేలా కార్యక్రమాల అమలు జరగడం లేదు. అన్నీ సచివాలయం నుంచి సిఎం పర్యవేక్షణలో జరగడం వల్ల గ్రామాలు వట్టిపోవడానికి కారణం అవుతున్నాయి. గ్రామాలకు కేంద్రం నుంచి వచ్చిన నిధులను మింగుతున్న వైనం సరికాదు. గ్రామాలపై ఇక్కడ పెత్తనం చేయడం వల్ల అవి అభివృద్ధి చెందడం లేదు. గ్రామాలను స్వయం సమృద్ధి సాధించేలా ప్రోత్సాహించాలే తప్ప కర్రపెత్తనం చేయడం సరికాదు. ఆర్థికంగా పంచాయితీలు బలోపేతంగా లేక పోవడంతో పాటు, సర్పంచ్‌లు కూడా బాధ్యతారహి తంగా వ్యవహరించడం వల్ల గ్రామాల్లో పారిశుద్య కార్యక్రమాలు మొదలు ఇతరత్రా కార్యక్రామలు బలంగా ముందుకు సాగడంలేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యల కారణంగా గ్రామాల్లో లక్ష్యాన్ని సాధించడం లేదు. పారిశుద్యం, వీధులు శు భ్రంగా ఉంచుకోవడం, ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం వేయడం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం తదితర అంశాలు సామాజిక బాధ్యత కావాలి. సర్పంచ్‌లకు అజమాయిషీ ఉండాలి. ఈ రకమైన చైతన్యం కోసం ఉద్యమించాల్సి ఉంది. పంచాయతీల్లో జనాభాకు సరిపడా పారిశుద్ధ్య కార్మికులు లేకపోవడంతో పల్లెలో పారిశుద్ధ్యం పడకేసింది. ప్రధానంగా అన్ని పనులను ప్రభుత్వంమే చేస్తుందన్న ధీమాలో ప్రజలు ఉన్నారు. ఓటుబ్యాంక్ రాజకీయాల కారణంగా ప్రజలు అచేతనంగా తయారయ్యారు. వారిని బాధ్యులను చేసేలా చర్యలు ఉండడం లేదు. పరిశుభ్రత లోపించిన కారణంగానే వ్యక్తిగతంగానే గాక పరిసరాల శుభ్రతా లోపించి అతిసారం, కలరా వంటి వ్యాధులు పెచ్చరిల్లుతున్నాయి. తాజాగా కరోనా ఇంకా విజృంభించడానికి పరిశుభ్రతా లోపం కూడా కారణంగా చూడాలి. కరోనాలాంటి వైరస్‌లను అరికట్టాలంటే పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. మురికివాడల వద్ద ఖాళీ ప్రదేశాలు,పొలం ప్రాంతాలు, గ్రామ శివారు స్థలాలు, రైలు పట్టాల పరిసరాల్లో కాలకృత్యాలు హానికరంగా పరిణమిస్తున్నాయి. ప్రధానంగా పారిశుధ్యం అన్నది పంచాయితీల సామాజిక బాధ్యతగా చేయాలి. స్వచ్ఛత అన్నది వ్యక్తిగత మైన శ్రద్ధకు సంబంధించినదే అయినా ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో ఇలాంటి శ్రద్ధ తక్కువనే చెప్పాలి. వ్యక్తిగత మరుగదొడ్ల నిర్మాణాలు ఇంకా పూర్తి కావడం లేదు. కరోనా లాంటి వైరస్‌లు విజృంభించి అనారోగ్యాల బారిన పడుతున్నా ప్రజలు ఇందుకు కారణాలు అపరిశుభ్రత అని గ్రహించడం లేదు. గ్రామాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. మురుగునీరు ఎక్కడపడితే అక్కడ వచ్చి చేరుతోంది. పారిశుద్య కార్యక్రమాల్లో ఏ గ్రామానికి ఆగ్రామ సర్పంచ్‌ను బాధ్యుడిని చేస్తే సరిపోయేది. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం కోసం తొలిసారిగా ఆర్థిక చేయూత ఇవ్వడం ద్వారా గ్రామాల్లో కొంత మార్పు కనిపిస్తోంది. అయితే ఇప్పటికీ పూర్తిస్థాయిలో దీని కార్యక్రమం సాగడం లేదు. ఆరుబయట మలవిసర్జన కారణంగా మనదేశంలో అనారోగ్యకర వాతావారణం ఎక్కువే. అలాగే వ్యాధుల సంక్రమణ, అంటువ్యాధుల వ్యాప్తి కూడా ఎక్కువే. దీనికి ప్రజలతో పాటు ప్రభుత్వాల వైఫల్యం కూడా ఉంది. గ్రామ స్థాయిలో పనులకు సర్పంచ్‌లను బాధ్యులను చేయడం లేదు. వారికి ఆర్థిక స్వేచ్ఛను ఇవ్వడం లేదు. ఇకపోతే అనేక పథకాలకు ఆర్థిక చేయూత నిచ్చినా గ్రామాల్లో ప్రజల్లో పెద్దగా స్పందన రావడం లేదు. సర్పంచ్‌లకు బాధ్యతలు అప్పగించి గ్రామకమిటీ ద్వారా ఈ వ్యవహారం నడిపించివుంటే బాగుండేది. ఈ విషయంలో ఇరు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు విఫలం అయినట్లే. చాలా పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్మికులకు ప్రతినెలా వేలాది రూపాయల వేతనాలుగా అందిస్తున్నా ఫలితం మాత్రం కానరావడం లేదు. గ్రామాల్లో సర్పంచ్‌లు పటిష్టంగా పనిచేయడంతో పాటు ప్రణాళికలు సిద్ధం చేసేలా అధికారులు కార్యాచరణ సిద్ధం చేయాలి. అప్పుడే ఆశించిన లక్ష్యం నెరవేరుతుంది. సర్పంచ్‌లను, గ్రామ వార్డు సభ్యులను బాధ్యుల ను చేయడంతో పాటు, గ్రామాలను పరిపుష్టం చేసేలా కార్యక్రమాలను రూపొందించాల్సి ఉంది.

# నిర్వీర్యం చేస్తున్న సమాంతర వ్యవస్థ

**- గ్రామాలకు నేరుగా నిధులతోనే మార్పు - ఉపాధిహామీని గ్రామాభివృద్ధికి జోడించాలి**



**విజయవాడ:** గ్రామాల్లో ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులు ఉన్నప్పటికి సమాంతర వ్యవస్థను నడపడం వల్ల గ్రామాల రూపురేఖలు మారడం లేదు. గతంలో జన్మభూమి కమిటీలను విమర్శించి న జగన్ ..తాను అధికారం చేపట్టాక వలంటీర్లను పెట్టి సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా మార్చారు. వైకాపా ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్న వలంటీర్ వ్యవస్థ సర్పంచ్‌ల బాధ్యతలను విస్మరించేలా చేయడమే గాకుండా..గ్రామాల్లో వారి అజమాయిషీ లేకుండా చేసింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేసేలా చర్యలకు ఉపక్రమించడం లేదు. గ్రామాలకు ముఖ్యంగా సర్పంచ్‌లకు విధులు,నిధులు ఇస్తేనే ఇది సాధ్యమని గుర్తించాలి. గ్రామాలను యూనిట్‌గా చేసి కార్యక్రమాలను రూపొందించుకునే వెసలుబాటు సర్పంచ్‌లకు ఉండాలి. అప్పుడే పన్నుల వసూళ్లు మొదలు కార్యక్రమాల అమలు వరకు వారికి స్వేచ్ఛతో పాటు బాధ్యత కూడా ఉంటుంది. పనులు చేయని సర్పంచ్‌లను చట్టబద్ధంగా శిక్షించేలా చట్టం రూపొందించారు. అలాగే కేంద్రం అమలు చేస్తున్న ఉపాధి హామీలో పారిశుద్ధ్య పనులు చేర్చడంతో గ్రామ పంచాయతీలకు ఆర్థిక భారం తప్పుతుంది. గ్రామాల పరిధిలో అన్నీ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో జరిగేలా చట్టసవరణ జరగాలి. గ్రామాల్లో జరిగే ప్రతి పని పంచాయితీల ఆధ్వర్యంలో జరిగేలా, దాని పరిధిలోనే అధికారులు పనిచేసేలా చూడాలి. అప్పుడే గ్రామాలు ఆర్థికంగా బలపడడంతో పాటు కార్యక్రమాలు ముందుకు సాగుతాయి. గ్రామాలు స్వయం సమృద్ధి సాధిస్తాయి. ఇకపోతే పారిశుద్ధ్య పనుల్లో ఉపాధి కూలీల ఏర్పాటుతో పంచాయతీలకు ఆర్థికభారం తగ్గుతుంది. పంచాయతీలకు వచ్చే నిధులు, ఆదాయాన్ని గ్రామాభివృద్ధికి వినియోగించుకోవచ్చని నిపుణులు అంటున్నారు. ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్న నిర్ణయంతోనే గ్రామాల్లో పారిశుద్యం వెల్లివిరియనుంది. ఈ పథకంలో ఇప్పటి వరకు చేస్తున్న పనుల్లో గ్రామీణ పారిశుధ్యాన్ని జోడించడం ద్వారా గ్రామాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టాలి. ఉపాధి హామీ పనుల్ని విస్తృతం చేయాలని, అందులో భాగంగా పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులను ఉపాధి కూలీలతో నిర్వహించడంపై నిర్నయం తీసుకోవాలి.కేంద్రం ఇందుకు ముందుకు రావాలి. ఫలితంగా ప్రస్తుతం గ్రామాల్లో నెలకొన్న అస్తవ్యస్త పరిస్థితుల్లో మార్పు రానుంది. వాస్తవానికి పంచాయతీలకు లభించే సాధారణ నిధుల నుంచి 30 శాతం వరకు పారిశుద్యానికి ఖర్చు చేయాలనే నిబంధన గతంలో ఉండేది. తర్వాత దాన్ని 50 శాతానికి పెంచారు. అంటే పంచాయతీకి వస్తున్న ఆదాయంలో సగం పారిశుద్యానికే వెచ్చిస్తున్నారు. ఫలితంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు జరగడంలేదు. అధికారులు తాజాగా తీసుకున్న నిర్ణయంతో పంచాయతీలు బలోపేతం కావడంతోపాటు వాటికి ఆర్థిక భారం కూడా తప్పుతుంది. కొత్తగా ఉపాధి కూలీలను పారిశుద్ధ్య పనుల్లోకి తీసుకుంటే గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్త నిల్వలను తరలించే వీలుంటుంది. పారిశుద్ధ్య పనుల్లో ఉపాధి కూలీలను వినియోగించుకోవడం సహా అనేక విషయాల్లో రాష్ట్రాలతో ప్రభుత్వం చర్చించాలి. ఈ నిర్ణయంతో అటు కూలీలకు పని దొరకడంతో పాటు పల్లెలు పరిశుభ్రంగా మారే అవకాశం ఉంది. గ్రామాల పరిధిలో కూలీలకు ఏం పని చూపించాలని భావిస్తున్న ఉపాధి సిబ్బందికి అధికారుల నిర్ణయం ఊరటనిస్తోంది. కూలీలకు పల్లెల్లోనే పారిశుద్ధ్య పనులు చూపించే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా చెరువుల్లో గుర్రపు డెక్క తొలగింపు, పూడికతీత, భూములు చదును చేయడం, నీటి తొట్లు, పొలాల్లో కుంటలు, చెక్‌డ్యాంల నిర్మాణం తదితర పనుల ద్వారా ఉపాధి కూలీలకు పనులు కల్పించ వచ్చని పేర్కొంటున్నారు. ఉపాధి హామీ పథకంలో పారిశుద్ధ్య పనులు చేయించాలనే ఆలోచన మంచి నిర్ణయమని సర్పంచులు సైతం అంగీకరిస్తున్నారు. పంచాయతీలకు ఆర్థిక భారం తప్పుతుంది. పంచాయతీ పారిశుద్ధ్య పనులనూ పథకం పరిధిలోకి తీసుకొచ్చేందుకు అధికారులు నిర్ణయం తీసుకోవడంతో కూలీలకు వంద రోజులు సమృద్ధిగా పనులు కల్పించవచ్చని ఉపాధి సిబ్బంది చెబుతున్నారు.

# నెరవేరని వ్యక్తిగత మరుగుదొడ్ల లక్ష్యం


**- ఆశించిన ఫలితం సాధించని పథకం - గ్రామాల్లో మరింతగా చైతన్యం రావాల్సిందే**

**కర్నూలు:** దేశవ్యాప్తంగా వ్యక్తిగత మరగుదొడ్ల నిర్మాణం కోసం నేటికీ స్పష్టత లేదు. ఇంతకాలం ప్రచారం చేసినా ఇంకా లక్ష్యం నెరవేరడం లేదు.గ్రామ సీమల్లోని 42 శాతం జనాభాకు నేటికీ మరుగుదొడ్లు కరవైన పరిస్థితిలో, కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలూ వాటి నిర్మాణ నిర్వహణల్ని ఓ సవాలుగా భావిస్తున్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కొన్ని జిల్లాల్ని ఓడీఎఫ్‌లుగా ప్రకటించింది. వార్డు కమిటీలు, స్వయంసహాయక సంఘాలు, పట్టణ సమాఖ్యల ఉమ్మడి కృషితో కొన్ని గ్రామాలు ఈ లక్ష్యం సాధించాయి.. కూలిపనులు చేసి సంపాదించిన సొమ్ముతో మరుగుదొడ్లు నిర్మించుకొని ఇతర ప్రాంతాలవారికి ఆదర్శ ప్రాయులయ్యారు.

అధికారుల కృషితోనే నియోజకవర్గంలో నూరు శాతంఓడీఎఫ్ దిశగా అడుగులు పడతాయి. సమీక్షలు, సమావేశాలు నిర్వహించి సర్పంచ్‌లను పురమాయించడంతో మరుగుదొడ్ల నిర్మాణాలపై ప్రజలు దృష్టి సారించారు. దీంతో గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు ఉద్యమంలా సాగుతున్నాయి. ఓడీఎఫ్ సాధించేం దుకు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ సంక్షేమ పథకాలను కట్ చేస్తూ మరుగుదొడ్ల నిర్మాణాలను ఉద్యమంలా చేపట్టారు. ఆంధ్రప్రదేశ్‌లో 46శాతం ప్రజలు మరుగుదొడ్లు ఉపయోగిస్తున్నారు. దీనిఇకతోడు పరిశుభ్రతకు సంబంధించిన పనులు తమకు సంబంధిం చినవి కావన్న ధోరణిలో ప్రజలు ఉన్నారు. పరిశుభ్రతా సాధనలో భాగంగా, శౌచాలయ వ్యవస్థపై ఎనలేని కేంద్రం శ్రద్ధ చూపుతోంది. బహిరంగ మలవిసర్జన రహిత ఊళ్లు, ఇంటింటా మరుగుదొడ్లు' ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్యక్రమాలు చేపట్టి ఇప్పటికి మూడేళ్లు గడిచాయి. ఏపీ ప్రభుత్వం వివిధ విభాగాలవారితో ప్రచార బృందాల్ని ఏర్పాటుచేసి, మారుమూల గ్రామాలకీ పంపించీ అవగాహన పెంచేందుకు కృషిచేస్తోంది. ఏపీలోని అనేక గ్రామాలు బహిర్భూమి సమస్య నుంచి సంపూర్ణంగా బయట పడ్డాయని కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలోని పారిశుద్ధ్య మంత్రిత్వశాఖ ఇదివరకే వెల్లడించింది. మొత్తం 72లక్షల మరుగుదొడ్లు అవసర మైన ఏపీలో ఇప్పటికే 44.1 లక్షల నిర్మాణాలు పూర్తయ్యాయి. వాటి ఏర్పాటుతో పాటు వినియోగమూ ముఖ్యమంటూ వందల సంఖ్యలో సదస్సులు నిర్వహించారు. పాఠశాలల్లో మరుగదొడ్ల ఏర్పాటును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తొలి ప్రాథమ్యంగా ప్రకటించింది. ప్రభుత్వాల, ప్రజల ఆలోచనా ధోరణిని బట్టే శౌచాలయ నిర్మాణ పక్రియ ముందుకు సాగుతుంది. ఉమ్మడి భాగస్వామ్యమే స్వచ్ఛతను, శుభ్రతను సాకారం చేస్తుంది.అందుకు అనుగుణంగా అవసరమైతే కఠినచర్యలు తీసుకోవాలి. స్వచ్ఛతకు సంబంధించి ప్రజల్లో చైతన్యంతో పాటు కఠిన నిబంధనలు అమల్లోకి రావాలి. దీనిని తప్పనిసరి చేయడం ద్వారానే లక్ష్యం సాధించగలం.

# మిర్చి రైతును వెన్నాడుతున్న నష్టాలు

**నకిలీ విత్తన విక్రేతలపై చర్యలు శూన్యం**



**గుంటూరు :** మిర్చి రైతు కంట కన్నీరు కారుతోంది. కల్తీ, నకిలీలను సహించేదే లేదన్న ప్రభుత్వ పాలనలో వాటిని అమ్ముకొని రైతులను నిలువునా మోసం చేసిన కంపెనీలపై ఒక్క చర్య కూడా లేదు. కల్తీ మిర్చి నారు అమ్మిన నర్సరీలపై, డీలర్లపై కేసుల్లేవు. కంపెనీల నుండి నష్ట పరిహారం ఇప్పించాలని రైతులు రోడ్డెక్కితే పోలీస్ కేసులే తప్ప రైతులకు ఊరట దక్కలేదు.. కంపెనీలు, నర్సరీల నుండి పరిహారం ఇప్పించే బాధ్యత నుండి ప్రభుత్వం చేతులెత్తేసింది. మిర్చి రైతులు లబోదిబో మంటుండగా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదు. ఏటా నకిలీ, కల్తీ విత్తనాలు, నారు అమ్మిన వారిపై చర్యల విషయంలో ఇప్పటికీ తగిన విధానం లేకుండా పోయింది. కంపెనీలు, డీలర్ల మెడలు వంచి రైతులకు పరిహారం ఇప్పించాల్సిన సర్కారు మీనమేషాలు లెక్కిస్తోంది. నకిలీ కంపెనీలు స్వైర విహారం చేస్తున్నా ఊరూరా నెలకొల్పిన సచివాలయాలు, వలంటీర్లు, రైతుభరోసా కేంద్రాలు, పోలీసులు, విజిలెన్స్, ఇంటెలిజెన్స్ ఏంచేస్తున్నాయో తెలీదు. మిరప పండించిన రైతాంగం ఏటేటా కష్టాల సుడిగుండంలో చిక్కుకుంటోంది. కల్తీ విత్తనాలు, నకిలీ నారు, అంతుబట్టని తెగుళ్లు, అధిక వర్షాలు, వరదలు, మధ్య మధ్య వర్షాభావం కట్టకట్టుకొని ముప్పేట దాడి చేస్తున్నాయి. రైతులకు భారీ నష్టాలు మిగిల్చాయి. అచేతనావస్థలో పడ్డ లక్షలాది మంది రైతులు తమకు ప్రభుత్వమే దిక్కని వాపోతున్నారు. రాష్ట్రంలో సాగయ్యే వాణిజ్య పంటల్లో పత్తి తర్వాత అధిక విస్తీర్ణంలో వేసేది మిర్చినే. ఒక ఎకరాలో మిర్చి సాగుకు కనీసం రూ.లక్ష వరకు పెట్టుబడి అవుతుంది. అదే కౌలు రైతులకైతే ఇంకా అదనం. ఎకరాకు రూ.లక్ష వేసుకున్నా తక్కువలో తక్కువ రూ.2 వేల కోట్ల పెట్టుబడి నష్టం. ఉత్పత్తి నష్టాన్ని అంచనా వేస్తే రైతులకు జరిగిన నష్టం కొన్ని రెట్లు ఎక్కువ. మిర్చిని అధికంగా సాగు చేసిన గుంటూరు, ప్రకాశం, కర్నూలు, కృష్ణా, అనంతపురం జిల్లాల రైతులు ఈ నష్టాల్లో సింహభాగం భరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో రైతులకు నష్ట పరిహారం, బీమా చెల్లిస్తేనే రైతుకు భరోసా దక్కుతుంది.. నకిలీ, కల్తీ విత్తనాలమ్ముతున్న అక్రమార్కులపై కఠిన చర్యలు చేపట్టక పోతే మార్కెట్లో వారు పెత్తనం చెలాయిస్తారు. ఈ సమస్యలపై అధ్యయనం చేసి ఆదుకోవాల్సి ఉంది.

# గవర్నర్ల తీరు మారేదెప్పుడు

మన దేశంలో గవర్నర్ వ్యవస్థ ఎప్పుడూ వివాదమే. రాష్ట్రాల వ్యవహారాల్లో



వేలు పెట్టడం..విపక్ష పార్టీలు అధికారంలో ఉంటే ఇబ్బంది పెట్టడం చూస్తూనే ఉన్నాం. ఇందుకు బిజెపియేతర పాలిత రాష్ట్రాల్లో జరుగుతున్న వివాదాస్పద వ్యవహారాల్లే నిదర్శనం. ఇలా వ్యవహరించడం కొత్తేమీ కాదు. ఏదో ఒక రాష్ట్రం లో గవర్నర్లు తరచూ వివాదాల్లో చిక్కుకోవటం లేదా వివాదాలకు కేంద్ర బిందువులుగా మారడం చూస్తూనే ఉన్నాం. కేరళ,బెంగాల్, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో ఇలాగే జరుగుతోంది. ముఖ్యంగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో రాజకీయంగా విభేదిస్తున్న కేరళ, తమిళనాడు, తెలంగాణ, బెంగాల్ వంటి రాష్ట్రాల్లో గవర్నర్లకు ప్రభుత్వాలకు మధ్య సత్సంబంధాలు లేవన్న విషయం తెలిసిందే. తమిళనాడులో అనేక విషయాల్లో అక్కడి గవర్నర్ ప్రభుత్వ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటూనే ఉన్నారు. గతంలో గవర్నర్లుగా ఉన్నవారు ప్రజాస్వామ్య రాజకీయాల్లో అనుభవం ఉన్నవారు ఉండేవారు. వారికి రాజ్యాంగం గురించి అవగాహన ఉండడం లేదా న్యాయ సలహాలు తీసుకుని హుందాగా నడచుకొనేవారు. ఎవరి పరిమితికి లోబడి వారు నడుచుకొనేవారు. అప్పుడు రాజకీయంగా పెద్దగా ఏ సమస్యా రాలేదు. అయితే 1980 తర్వాత గవర్నర్ల నియామకం విచక్షణారహితమై పూర్తిగా రాజకీయ రంగు పులుముకున్నది. అందుకు తగినట్టే ఉన్నది గవర్నర్ల నడవడిక కూడా మారింది. ఇది రామ్‌లాల్ విషయంలో పరాకాష్ఠకు చేరింది. అప్పట్లో ఉమ్మడి ఎపికి సిఎంగా ఉన్న ఎన్టీరామారావును పదవీచ్యుతుడిని చేయడంతో రాష్ట్రప్రభుత్వాలను కూలదోసే ప్రక్రియ పరాకాష్టకు చేరింది. కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ప్రభుత్వాలను ఏదో కారణంతో కూలదోయడం అలవాటుగా ఉండేది. ఇక తెలంగాణ విషయానికి వస్తే..తమిళిసై గవర్నర్‌గా వచ్చిన నాటి నుంచి అన్నీ వివాదాలే. సహజంగానే ఆమె తమిళనాడు బిజెపికి చెందిన పార్టీ నాయకురాలు. అందుకే కావచ్చు ఏదో ఒక విషయంలో గిల్లికజ్జాలు పెడుతూనే ఉన్నారు. తాజాగా మండలి భ్యుల నియామక విషయంలో గవర్నర్ చర్య వివాదాస్పదమైంది. కేబినేట్ నిర్ణయాన్ని కూడా తోసిపుచ్చిన తీరు దారుణం. ఇదొక్కటే కాదు గతకొంతకాలంగా అనేక బిల్లుల వ్యవహారంలో కూడా గవర్నర్ ఘర్షణ వైఖరినే అవలంబిస్తూ వచ్చారు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులకు ఆమోదం తెలపటంలో కానీ, రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా పరంగా గవర్నర్ ఆమోదం కోసం పంపే సాధారణ ప్రతిపాదనలను ఆమోదించటంలో తమిళిసై పక్కన పెడుతూ వచ్చారు. ఇలా రాజ్‌భవన్ నుంచి అనేక అవరోధాలు ఎదురుకావడం తెలంగాణలో సాధారణం అయ్యాయి. గతంలో నరసింహన్ గవర్నర్‌గా ఉన్నప్పుడు బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ మంచి సయోధ్య ఉండేది.బిజెపి పార్టీ తరపున క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న తమిళ సైని తెలంగాణ గవర్నర్‌గా నియచించారు. దీంతో ఆమె వ్యవహారాలన్నీ రాజకీయంగానే ఉంటూ వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ కోటా కింద కౌన్సిల్ సభ్యులుగా నియామకానికి ఇద్దరి పేర్లను సిఫారసు చేస్తే గవర్నర్ ఆ పేర్లను తిరస్కరించడం అన్నద ఇ ఈ వ్యవహారంలో పరాకాష్టగా చెప్పకోవాలి. అయితే ఇక్కడ ట్విస్ట్ ఏమంటే గవర్నర్ లేవదీసిన అభ్యంతరాలు రాజ్యాంగపరమైనవి కాకుండా రాజకీయ అభ్యంతరాలుగా కనిపిస్తున్నాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 71(5) ప్రకారం గవర్నర్ కౌన్సిల్‌కు నియమించే వారు సాహిత్యం, సైన్స్, కళలు, సహకార రంగం, సంఘసేవలో ప్రవీణులై ఉండాలి. ఈ నిబంధన ప్రకారం ప్రభుత్వం రెండు పేర్లను సామాజిక సేవ చేసినవారుగా గుర్తించి గవర్నర్‌కు సిఫారసు చేసింది. గవర్నర్ వారిద్దరినీ రాజకీయ నేపథ్యం ఉన్నవారిగా గుర్తించి తిరస్కరించారు. రాజకీయాలతో సంబంధం లేని వారిని మాత్రమే పరిశీలించాలని కూడా ఆదేశించారు. రాజకీయంలో ఉన్నవారు సంఘసేవ చేయడం లేదా? తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమించిన వారిని కానీ, ఉద్యమానికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సహకరించిన వారిది సంఘసేవ కాదా అధికార బిఆర్ఎస్ ప్రశ్నిస్తోంది. గవర్నర్ అసలు రాజకీయం చేస్తున్నారని మంత్రులు ఇప్పటికే విరుచుకుపడ్డారు. రాజ్యసభకు కూడా రాజకీయ నేపథ్యం ఉన్నవారిని ఎప్పటి నుంచో నియమిస్తున్నారు. ప్రస్తుతం రాజ్య భలో నామినేటెడ్ కేటగిరీలో 10 మంది ఉన్నా రు. అందులో అయిదుగురు బీజేపీకి చెందినవారే. దీనికి రాష్ట్రపతిని నిలదీయాలా లేక సిఫారసు చేసిన మోదీ ప్రభుత్వాన్ని నిలదీయాలా అన్న ప్రశ్నలు వచ్చాయి. నిజానికి అసహజ పరిస్థితులు ఎదురైతే తప్ప రాజ్యాంగబద్ధ ప్రభుత్వానికి అడ్డంకులు సృష్టించటం సరికాదు. గవర్నర్ చర్య రాజ్యాంగస్ఫూర్తికి భిన్నంగా ఉందనటంలో ఎలాంటి సందేహం లేదు. రాజ్యాంగాన్ని రక్షిస్తానని ప్రమాణం చేసినవారే దాని ఉల్లంఘిస్తే, ప్రజాస్వామ్య పక్రియకు అర్థమేమిటని తమిళనాడు సిఎం స్టాలిన్ గట్టిగానే నిలదీసారు. తమ రాష్ట్రానికి ఈ గవర్నర్ రవి వద్దంటూ పోరాడారు. ప్రస్తుత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కడ్ బెంగాల్ గవర్నర్‌గా ఉన్న కాలంలో ఇలాంటి గిల్లి కజ్జాలే సాగాయి. మన రాజ్యాంగం గవర్నర్‌కు కొన్ని సందర్భాల్లో విచక్షణాధికారాలు కట్టబెట్టింది. అయితే ఆ గవర్నర్ కూడ ఆ రాజ్యాంగానికి లోబడే పనిచేయాలి. మొత్తంగా గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలన్న డిమాండ్ ఇప్పుడు సర్వత్రా వస్తోంది. నిజానికి దీనివల్ల దేశానికి పెద్దగా ఉపయోగమేమీ లేదు. ఇటీవలి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఎన్నో అంశాలను చర్చిస్తారని అనుకున్నారు. ఇలా గవర్నర్ వ్యవస్థ ఎత్తివేత గురించి చర్చించి వుంటే మోడీకి అన్ని పార్టీలు మద్దతు పలికేవి.

# నాలుగు ట్రిలియన్ల అబద్దపు ప్రచారం!



అదిగో పులి అంటే..ఇదిగో తోక అన్నట్టు బీజేపీ సంఘ్ పరివార్ దేన్నయినా సునాయాసంగా ప్రచా రం చేయగలరు. వెనకా ముందూ ఆలోచించకుండా ఒకరి తరువాత ఒకరు నేతలు సామాజిక మాధ్య మాలలో అదరగొడతారు. ఇప్పుడు కూడా అదే జరిగింది. జీడీపీ పరంగా భారత్ 4 ట్రిలియన్ డాల ర్లను దాటి వేసిందంటూ బీజేపీ ప్రచారం చేసింది. అయితే ఇదంతా బోగస్ అని తేలింది. ప్రజలను భ్రమల్లో పెట్టటానికి, మీడియా హెడ్‌లైన్లలో నిలవటానికే ఆ ప్రచారం చేశారని ప్రతిపక్ష కాంగ్రెస్ పే ర్కొంది. బీజేపీ నేతల ప్రచారానికి తగినట్లుగానే కేంద్ర ఆర్థికశాఖగానీ, జాతీయ గణాంకాల కార్యాల యంగానీ ఈ వార్తలను ధ్రువీకరిస్తూ ఎటువంటి ప్రకటన చేయలేదు. భారత్ ఇంకా నాలుగు ట్రిలియ న్ డాలర్ల జీడీపీ స్థాయికి చేరుకోలేదని సంబంధిత ఉన్నతస్థాయి వర్గాలు వెల్లడించాయి. దీనిని బట్టి తాము విన్న సమాచారం నిజమో, అబద్ధమో తెలుసుకోకుండా ప్రచార బాకాలు ఊదారు బీజేపీ నే తలు. భారత ఆర్థిక వ్యవస్థ మొట్టమొదటి సారిగా 4 ట్రిలియన్ డాలర్లు దాటిపోయిందన్న పుకారును బిజెపి వర్గాలు ఈ విధంగానే ప్రచారంలో పెట్టారు. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) సమా చారం అంటూ ఇది బయటకు పొక్కగానే అంతర్జాతీయంగా భారత ఖ్యాతిని పెంచుతున్న అసాధా రణ పరి ణామం అంటూ కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ 'ఎక్స్' (మాజీ ట్విట్టర్)లో ఒక సందే శం పోస్టు చేశారు. ఆ వదంతి స్క్రీన్ షాట్‌ను జత చేశారు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఈయనకు గొంతు కలిపారు. దార్శనికుడైన, చైతన్యవంతుడైన నాయకుని సారథ్యంలోనే ఇది సాధ్య మని ప్రధాని మోడీని ఉద్దేశిస్తూ ఫడ్నవీస్ అందులో శ్లాఘించారు. ప్రధాని మోడీని అ భినందించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కూడా ఇదే పని చేశారు. మనం 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వైపు అడుగులు వేస్తున్నాం ఇది మోడీ గ్యారంటీ అని ఆయన పేర్కొన్నారు. ఇంకా మరి కొంత మంది బిజెపి నాయకులూ ఇదే విధంగా ఆత్మస్తుతికి పాల్పడ్డారు. ప్రధాని మోడీని పైకెత్తి వేశారు.ప్రధాని మోడీకి అత్యంత సన్నిహితుడని పించుకొంటున్న గౌతమ్ అదానీ ఈ సందర్భంగా భారత దేశాన్ని అభినందించారు. మరి రెండేళ్ళలో ఇండియా ప్రపంచంలో మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ కాను న్నదని ప్రకటించారు. మువ్వన్నెల జెండా అదే పనిగా వెలుగులు చిమ్ముతున్నదని అన్నారు. అయితే ఇందులో ఏమాత్రం నిజంలేదని లెక్కలు చెబుతున్నాయి. 2023-24 ఆర్థిక సంవ త్సరంలో దేశం 10.5 శాతం జిడిపి (స్థూల దేశీయోత్పత్తి)ని సాధిస్తే ఆర్థిక వ్య వస్థ 3.7 ట్రిలియన్ డాలర్లకు చేరుకొంటుందని నిపుణులు చెబుతున్నారు. అలాగే 2024-25లో మా త్రమే మన ఆర్థిక వ్యవస్థ 4.2 ట్రిలియన్ డాలర్లకు చేరుకొనే అవకాశముంది. ప్రస్తుతం అతి పెద్ద ఆ ర్థిక వ్యవస్థల్లో ఇండియా 5వ స్థానంలో వుంది. 4వ స్థానంలో వున్న జపాన్‌ను మించిపోవాలంటే కనీ సం మరి మూ డేళ్ళు పడుతుందని ఐఎంఎఫ్ నిపుణులు చెబుతున్నారు. అలాగే ప్రస్తుతం మూడో స్థానంలో గల జర్మనీని దాటాలంటే ఆ తర్వాత మరొక ఏడాది పడుతుందని అంచనా వేస్తున్నారు. 2027 నాటికి ఇండియా మూడవ ఆర్థిక శక్తిగా ఎదగాలంటే వచ్చే కొద్ది సంవత్సరాల్లో సగటున సాలీ నా 9.19 శా తం వృద్ధిని సాధించవలసి వుంటుంది. 2013-2018 మధ్య 11.8 శాతం, 2019 2023 మ ధ్య 10 శాతం సగటు వృద్ధిని భారత ఆర్థిక వ్యవస్థ సాధించింది. 202324 మొదటి త్రైమాసికంలో ఈ వృద్ధి 8 శాతంగానే నమోదైంది. వాస్తవాలు ఇలా వుండగా వున్నపళంగా 4 ట్రిలియన్ డాలర్లను దాటి పోయామనే సమాచారం ఎక్కడి నుంచి వచ్చింది? దీనిని ఒక యూ ట్యూబ్ వీడియో నుంచి తీసుకొ ని ప్రచారంలో పెట్టినట్టు రూఢి అవుతున్నది. ఎన్నికలు జరుగుతున్న తెలంగాణ, రాజస్థాన్‌లలో ప్ర ధాని మోడీ గొప్పతనాన్ని చాట డానికి ఈ తప్పుడు సమాచార వ్యాప్తి అసాధారణ స్థాయిలో జరుగు తున్నట్టు తెలుస్తున్నది. ఇందుకు సామాజిక మాధ్యమాన్ని విశేషంగా వాడుకొంటున్నారు. ఇంతకు ముందు చత్తీస్‌గఢ్‌లో కూడా ఇదే పని చేశారు. ఇండియా 4 ట్రిలియన్ డాలర్లకు చేరుకొన్నదని న మ్మించడానికి 190 దేశాల జిడిపి అంకెలను తప్పుడుగా పేర్కొంటూ ప్రచారం చేస్తున్నారని తెలి సింది. నిజానికి, భారత ఖ్యాతి వెలిగిపోతున్న సంపదలో కాదు...పేదలు అత్యధిక సంఖ్యలో గల దేశంగా భారతదేశ ఖ్యాతి మార్మోగిపోతోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో 81.35 కోట్ల మంది పేదరికంలో మగ్గుతున్నారు. వీరిలో 75 శాతం మంది గ్రామీణులు కాగా, 50 శాతం మంది పట్టణ ప్రాంతాలకు చెందినవారు. 80.48 కోట్ల మందికి ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకాన్ని వర్తింప చేస్తున్నారని ఈ నెల 15వ తేదీ తర్వాత వెల్లడైంది. కాబట్టి ఇంత మంది పేదలు న్న దేశం జిడిపి వృద్ధిలో ఎంత ఎదిగినా పేదలకు ఉపయోగం ఏమిటి?

# మారుతున్న రాజకీయ స్వరూపం !

ప్రశ్నించే గొంతులను వినిపించుకోకపోతే... ప్రజాస్వామ్య ఉనికే ప్రశ్నార్థకమవుతుందని పాలకవర్గాలు గ్రహించలేక పోతున్నాయి.ఈ యేడది పరిస్థితులు,పాలకుల తీరును గమనిస్తే ఇది స్పష్టంగా గమనించ వచ్చు. కేంద్రంలోని బిజెపి కావచ్చు ...లేదా ఉభయతెలుగు రాష్ట్రాల్లోని పాలకులు కావచ్చు..దేశంలోని ఇతర ప్రాంతీయ పార్టీల పాలకులు కావచ్చు..పాలకులుగా ప్రజల ఆందోళనలు అర్థం చేసుకోలేక పోయారు. అందుకు తెలంగాణలో కెసిఆర్ మూల్యం చెల్లించుకున్నారు. తనకు తిరుగులేదని, జాతీయ రాజకీయాల్లో కూడా చక్రం తిప్పుతానని చెప్పి విర్రవీగి చతికిలపడ్డారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను పట్టించు కోకుండా ..మళ్లీ మాదే అధికారం అని విర్రవీగిన కెసిఆర్ అహంకారంపై ప్రజలు తిరుగుబాటు చేశారు. గత ఐదేళ్లలో ధరలు దాడి చేశాయి. ఆర్థిక వ్యవస్థ కుదేల యింది. నిరుద్యోగం గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగిపోయింది. స్థూల దేశీయోత్పత్తి జిడిపి బాగా క్షీణించింది. దేశంలోని కార్పొరేట్లు... వ్యాపారు లు, భూస్వాములు, బడా విదేశీ పెట్టుబడి దారులు మరింతగా బలపడ్డారు. అంతిమంగా సామాన్యులు బాగా బలహీనపడ్డారు. వీటిని చక్కదిద్దే ప్రయత్నాలు జరగడం లేదు. కేంద్రంలోని బిజెపి మరోమారు అధికారంకోసం అర్రులు చాస్తోంది. తెలంగాణ లో కనీసం పది పార్లమెంట్ సీట్లపై గురిపెట్టింది. మొన్నటి ఎన్నికల్లో కొంతమెరుగైన పరిస్థితిని గమనించి కావచ్చు... బిజెపిలో ఆశలు పుట్టాయి. అందుకే హైదరాబాద్ వచ్చిన అమిత్ షా ఇదే విషయం ఉద్బోధించి వెళ్లారు. ఆశపడడంలో తప్పులేదు. కానీ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చామా లేదా అన్న చర్చ చేయడం లేదు. తెలంగాణలో ప్రజాపాలనకు తెరలేచింది. ప్రజలకు గొంతు విప్పే అవకాశం వచ్చింది. రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడం...ప్రజల్లో ఓ రకమైన భరోసా దక్కడం..గత పాలకుల పాపాలు బయటపడడం జరిగింది. కానీ ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ప్రభుత్వం దేశంలో వస్తున్న మార్పులను గమనించడం లేదు. ఎదుటి పార్టీలను అణచివేయడం...డబ్బులను పప్పుబెల్లాల్లా పందేరం చేయడంతో తన అధికార పీఠాన్ని పదిలం చేసుకోవచ్చన్న ధీమాతో రాజకీయాలు చేస్తున్నారు. ఎపిలో కూడా కాంగ్రెస్ పావులు కదుపుతోంది. షర్మిలను రంగంలోకి దింపడం ద్వారా పోయిన ప్రతిష్టను పొందాలని చూస్తోంది. ఇది సాధ్యమా కాదా అన్నది ముున్ముందు తేలనుంది. అయితే పాలకులు మాత్రం ప్రజలు సమస్యలు తమ ఎజెండాలో లేవన్న స్థిరాభిప్రా యంలో ఉన్నారు. ఇకపోతే మోడీని వ్యతిరేకించే శక్తులు ఏకం కావడం మొదలయ్యింది. ఏకపక్ష నిర్ణయాలతో మోడీ ప్రజాభి ప్రాయాలను తుంగలో తొక్కుతున్నారు. ఇటీవల మూకుమ్మడిగా పార్లమెంటులో ఎంపిల సస్పెన్షన్ బిజెపి అనుసరిస్తున్న నిరంకుశ విధానాలకు పరాకాష్టగా చూడాలి. రాహుల్ గాంధీ భారత్ జోడోయాత్ర రాజకీయ ప్రయోజనాలు ఇచ్చిందనడానికి కర్నాటక, తెలంగాణ పరిణామాలు నిదర్శనంగా చూడాలి. ప్రత్యామ్నాయ రాజకీయ ఆలోచనా విధానంపై చర్చకు అవకాశం ఇచ్చింది. ఇండియాకూటమిలో ఎన్ని లుకలుకలు ఉన్నా కాంగ్రెస్ కేంద్రంగా విపక్షాలు కలసి వెళ్లని పరిస్థితి ఏర్పడింది. ప్రజాస్వామ్యంలో ఎక్కడో ఒకచోట ప్రశ్నించే తత్వం రావాలి. కేంద్రంలోని బిజెపిని ఢీకొనేందుకు వివిధ రాష్ట్రాల్లో ప్రత్యామ్నాయ శక్తులు సమాయత్తమవుతున్నాయి. అయితే పాలనలో ఉన్న వివిధ రాష్ట్రాల్లోని ప్రాంతీయపార్టీలు తమ రాష్ట్రాల్లో నిరంకుశంగా వ్యవహరిస్తూ.. కేవలం మోడీవైపు వేలెత్తి చూపుతున్నాయి. దీనిని కూడా ప్రజలు స్వాగతించరని గుర్తించాలి. నిజానికి స్థానిక ప్రభుత్వాలపై ప్రజలు ధిక్కార స్వరాలు వినిపిస్తున్నాయి.. బిహార్‌లో బిజెపి ప్రభుత్వాన్ని వదిలించుకుని మహాకూటమి సర్కార్ ఏర్పాటు చేసిన నితీశ్ కుమార్ వ్యవహారశైలి కూడా పెద్దగా ఆశాజనకంగా లేదు. ఢిల్లీలో బిజెపి ఉధృతిని అడ్డుకుని పంజాబ్,ఢిల్లీల్లో పాగా వేసిన అరవింద్ కేజ్రీవాల్ మరోవైపు సవాల్ చేస్తున్నా..ఆయన అనుచరులు కూడా పీకల్లోతు అవినీతిలో కూరుకుపోయారు. తన ప్రాంతీయ పార్టీని జాతీయ పార్టీగా మార్చి కేసీఆర్ కూడా బిజెపిపై సవాళ్లు విసిరి చతికిల పడ్డారు. రాజకీయంగా చూస్తే, గడచిపోతున్న సంవత్సరం అంతా మోదీ సారథ్యంలోని భారతీయ జనతా పార్టీకి పెద్ద విజయాలనే అందించింది. తెలంగాణ మినహా మూడు రాష్ట్రాల్లో అధికార పగ్గాలు చేపట్టారు. ఆయా రాష్ట్రాల్లో సాధించిన విజయాలే 2024లో జరిగే ఎన్నికల్లో బిజెపి తిరిగి జాతీయ స్థాయిలో అధికారం చేజిక్కించు కుంటుందన్న ధీమాలో బిజెపి నేతలు ఉన్నారు. అందుకే బిజెపి తన పూర్తి దృష్టిని ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రీకరించింది. ప్రతిపక్షాలు నరేంద్రమోదీ సారథ్యంలోని బిజెపితో హోరాహోరీగా పోరాడు తున్నాయి. అయినా పెద్దగా విజయం సాధించడం లేదు. 2024 నాటికి కాంగ్రెస్ జాతీయ స్థాయిలో బిజెపితో తలపడేందుకు సన్నద్ధం కాగలుగుతుందని తహతహలాడు తోంది. పదేళ్లుగా అధికారంలో ఉన్నప్పటికీ బిజెపి ఎందుకో దేశంలోని సామాన్యులను నేటికీ దరిచేర్చుకోవడం లేదు. ప్రధాన సమస్యలపై స్పందిం చడం లేదు. ఆర్థిక సమస్యలను,ధరల పెరుగుదలను పట్టించుకోవడం లేదు. 2024 ఎన్నికలకు జాతీయ స్థాయిలో బిజెపి వ్యతిరేక పక్షాలు ఏ రూపంలో వస్తాయన్నదానికి స్పష్టత లేదు. సిబిఐ,ఈడీలతో పాటు అనేక వ్యవస్థల్నీ బిజెపి పెద్ద ఎత్తున ఉపయోగిం చుకుని ప్రత్యర్థుల్ని నిర్వీర్యం చేస్తోందన్న ఆరోపణలు పెరిగాయి. ప్రతిపక్షాలకు చెందిన ముఖ్యమంత్రులు, మాజీ ముఖ్యమంత్రులు, ఇతర నేతలపైనే 95 శాతం పైగా సిబిఐ కేసులున్నాయి. ఇకపోతే ఏడాది చివరలో మరోమారు కరోనాకొత్త వేరియంట్ భయపెడుతోంది. ఇప్పటికీ దీనిపీడ విరగడ అయ్యిందన్న ధీమా రావడంలేదు. ఈ కారణంగా 2023 సంవత్సరం ప్రజలకు ఎలాంటి ఆనందాన్ని ఇవ్వలేదు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వదిలిపెట్టి పాలకులు, పార్టీలో ఎన్నికల్లో గెలవడమెలా...అన్న విషయంలో వ్యూహకర్తలతో మంతనాలు చేస్తున్నారు. ఈ తరహా రాజకీయాలు పోనంతవరకు దేశం బాగుపడదని గుర్తించాలి.

### మత్స్యకారులకు భారంగా

# మారిన చేపల వేట

ఆంధ్రప్రదేశ్‌లో వేలాది కుటుంబాలు సముద్రం మీద ఆధారపడి



జీవిస్తున్నాయి. చేపల వేటనే నమ్ముకుని వారు బతుకుతున్నారు. అయితే, మారిన పరిస్థితులలో వారికి బతుకు భారమవుతోంది. సముద్రంలో ప్రతికూల వాతావరణ పరిస్థితులు, తగ్గుతున్న ధరలు, పెరుగుతున్న దళారుల ప్రమేయం, వేట ఖర్చులు వారి భవిష్యత్‌ని ఆందోళనలోకి నెట్టి వేస్తున్నాయి. వేట సాగకపోతే తీవ్ర ఆర్థిక ఇబ్బందులు తప్పటం లేదు. ప్రభుత్వం ఇస్తున్న డీజిల్ ధరలో రాయితీని పెంచడంతోపాటు, సబ్సిడీపై ఇస్తున్న డీజిల్‌ను పెంచాలని మత్స్యకారులు కోరుతున్నారు. కోస్తా తీర ప్రాంతం వ్యాప్తంగా మూడున్నర లక్షల కుటుంబాలు నివసిస్తుండగా, చేపల వేట ద్వారా సుమారు 66 వేల కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి. 600 వరకూ మెకనైజ్డ్, మూడు వేలకుపైగా మోటరైజ్డ్ బోట్లపై మత్స్యకారులు చేపల వేట సాగిస్తున్నారు. సముద్రంలో ఎటువంటి ఆటంకాలూ లేనప్పుడు వేటకు వెళ్లి వీరంతా కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఏవైనా ప్రతికూల పరిస్థితులు ఉంటే పస్తులు తప్పవు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో వాయుగుండాలు, తుపానులు వచ్చినప్పుడు రోజుల తరబడి వేటకు వెళ్లలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. కొన్ని సందర్భాల్లో నెలంతా ఖాళీగానే ఉంటున్నామని, అయినా తమను ఎవరూ ఆదుకోవట్లేదని మత్స్యకారులు వాపోతున్నారు. లీటర్ డీజిల్ ధర రూ.50 ఉన్నప్పుడు ప్రభుత్వం సబ్సిడీపై అందించేది. ప్రస్తుతం డీజిల్ లీటరు రూ.100కి పెరిగినా అప్పటి సబ్సిడీ రూ.9 మాత్రమే నేటికీ అందిస్తోంది. కనీసం రూ.30 అయినా ఇవ్వాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు. మత్స్య సంపద అంతగా లభ్యం కానీ పరిస్థితుల్లో సముద్రంలో సుదూర ప్రాంతం వేటకు వెళ్లాల్సి వస్తోంది. నెలకు నాలుగుసార్లు వేటకు వెళితే మోటరైజ్డ్ బోట్లకు దాదాపు రెండు వేల లీటర్లు డీజిల్ వినియోగం అవుతోంది. ప్రభుత్వం 300 లీటర్లను మాత్రమే సబ్సిడీపై అందిస్తోంది. కనీసం మిగతా 2లో 1,500 లీటర్లయినా సబ్సిడీపై ఇవ్వాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు. మెకనైజ్డ్ బోట్లకు ఇస్తోన్న మూడు వేల లీటర్ల డీజిల్ సబ్సిడీని ఐదు వేల లీటర్లకు పెంచాలని కోరుతున్నారు. గతం కంటే చేపల వేట తగ్గుతూ వస్తోందని మత్స్యకారులు చెబుతున్నారు. రూరల్ తీర ప్రాంతాల్లో హెచరీలతోపాటు రొయ్యల చెరువులు, ప్రాసెసింగ్ యూనిట్లు విపరీతంగా పెరిగాయి. వాటి వ్యర్థాలను సముద్రంలోకి నేరుగా వదిలేస్తున్నారు. దీంతో, మత్స్య సంపదకు తీవ్రంగా నష్టం జరుగుతోందని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. దీంతో, మత్స్యకారులకు వేట సరిగా సాగడం లేదు. ఇంధనం, ఐస్‌తో పాటు ఇతర ఖర్చులు రెట్టింపయ్యాయి. చాలా దూరం వేటకు వెళ్లాల్సి వస్తుండడంతో డీజిల్ వినియోగం బాగా పెరిగిపోయింది. ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలు, మరోవైపు ప్రతికూల పరిస్థితుల్లో వేట చేయలేక అవస్థలు పడుతున్నామని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని మత్స్య కార్మికులు కోరుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సబ్సిడీని పెంచాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

# క్షేత్రస్థాయి అధ్యయనంతోనే భూ సమస్యలకు చెక్ !



రోగం ఏమిటో తెలిస్తే...మందు వేయడం సులభం. అందుకే రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం మెల్లగా సమస్యలను గుర్తించి..పరిష్కరించే ప్రయత్నాలను మొదలు పెట్టింది. ధరణిలో భూ సమస్యల పరిష్కారం దిశగా ముందడుగు వేసింది. ధరణి పోర్టల్‌లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా... ఐదుగురు సభ్యులతో కమిటీని నియమించింది. దీనికి సంబంధించి ఉత్తర్వులు జారీ చేసింది. ధరణి పేరుతో భూముల రిజిస్ట్రేషన్ల లో జరిగిన అవకతవకలను కూడా ప్రభుత్వం వెలికితీయనుంది. అయితే ఇందులో పట్టా బూములు, అసైన్డ్ భూములు, దేవాదాయ భూములు, వక్ఫ్ భూములను కూడా గుర్తించాల్సి ఉంది. అలాగే బక్కరైతుల భూములను బలవంతంగా లక్కొని రిజిస్ట్రేషన్ చేసుకున్న భూములను కూడా కమిటీ గుర్తించాలి. ఇందు కోసం కొత్తగా ఏర్పడ్డ కమిటీ గ్రామాల వారీగా వివరాలు నమోదు చేయాలి. అన్యాయం అయిందన్న వారు దరఖాస్తులు చేసుకునే వెసులబాటు ఉండాలి. ధరణిలో ఎక్కినంత మాత్రాన తమకు ధోకా లేదన్న భావన లేకుండా చేయాలి. ధరణి స్థానంలో భూమాతను తీసుకొస్తామని కూడా ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రకటించింది. ఈ క్రమంలో ముందుగా ధరణిలో సమస్యలను గుర్తించేందుకు కమిటీని ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో పేరుకు పోయన భూ సమస్యలకు కారణమైన పోర్టల్‌లో మార్పులు చేర్పులు చేస్తే తప్ప పరిష్కారం సాధ్యంకాదని, రెవెన్యూ అకారులు కూడా ప్రభుత్వానికి ఇప్పటికే సూచించారు. పోర్టల్‌లో సాంకేతికంగా అనేక సమస్యలు ఉన్నాయని నివేదించారు. దీంతో ధరణి పోర్టల్‌లో సమస్యలను తొలగించి సరికొత్తగా రూపొందించాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయించడం ఓ మంచి అడుగుగా భావించాలి. చిత్తశుద్ధితో సమస్యలను అధ్యయనం చేసి పరిషఫ్కరించే దిశగా అడుగులు వేయాలి. క్షేత్రస్థాయిలో సమాచారం సేకరించాలి. ఈ దిశగా ఐదుగురు సభ్యుల కమిటీ పనిచేయగలగాలి. సమాచారం తెప్పించు కుంటే.. అధ్యయనం చేయడం సులువు కాగలదు. కమిటీ ఇచ్చే నివేదిక ప్రకారం... తెలంగాణ ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది కనుక సమగ్ర అధ్యయనంతో ముందుకు సాగాలి. ధరణిపై వేసిన కమిటీలో కన్వీనర్‌తోపాటు నలుగురు సభ్యులను నియమించింది. భూ పరిపాలన ప్రధాన కమిషనర్... నవీన్ మిత్తల్ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. రైతుల సమస్యలపై పట్టున్న కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.కోదండరెడ్డి, మాజీ ఐఏఎస్, భూ పరిపాలన ప్రధాన కమిషనర్‌గా పని చేసిన రేమండ్ పీటర్‌ను ఈ కమిటీలో సభ్యులుగా స్థానం కల్పించింది. భూ చట్టాల నిపుణుడు, నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం అనుబంధ ఆచార్యుడు సునీల్, రెవెన్యూ చట్టాలపై అవగాహన ఉన్న రిటైర్డ్ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ బి.మధుసూదన్‌ను కూడా ఈ కమిటీలో నియమించారు. ఈ కమిటీ... ధరణి పోర్టల్లోని సమస్యలను గుర్తించి.. వారికి పరిష్కారాలను కనుగొని ప్రభుత్వానికి నివేదిక అందించాల్సి ఉంది. వీలైనంత త్వరగా ఈ నివేదిక ఇవ్వాలని.. కమిటీని ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్రంలోని భూ సమస్యలకు పరిష్కారం చూపేలా ఈ కమిటీ పనిచేయనుందని పేర్కొన్న దరిమిలా సమస్యలపై ఫిర్యాదలును కూడా స్వీకరించాలి. ఏ భూములు ఎలా అక్రమాలకు గురయ్యాయో సమాచారం కూడా తెప్పించుకోవాలి. అలాగే గత బిఆర్ఎస్ పెద్దలు అక్రమంగా ఆక్రమించుకున్న భూములపైనా విచారణ జరగాలి. చెరువుల శిఖాలను ఆక్రమించుకుని బహుళ అంతస్థులు కట్టుకున్న వారి చిట్టాలను కూడా తీయాలి. ప్రధానంగా హైదరాబాద్ లాంటి నగరంలో చెరువులు మాయం అయ్యాయి. చెరువు శిఖాలను మాయం చేశారు. ఇవన్నీ కూడా బయటపడాలి. అప్పుడే ధరణి సంస్కరణలకు అర్థం ఉంటుంది. ధరణి పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం భూములు దోచుకుందని కాంగ్రెస్ పార్టీ విస్తృతంగా ప్రచారం చేసింది. అధికారంలోకి వస్తే... ధరణిని బంగాళాఖాతం వేస్తామని పదేపదే ప్రకటించింది. ధరణి పోర్టల్లో భూముల ఖాతాలు ఉన్న వారికే పట్టా పాసు పుస్తకాల జారీ చేస్తున్నారు. ధరణి వెలుపల 18 లక్షల మంది వరకు ఉన్నట్టు అంచనా వేస్తున్నారు. ధరణి పోర్టల్‌తో లక్షల్లో పెండింగ్ సమస్యలు ఉన్నట్టు ప్రభుత్వం గుర్తించింది. వీటన్నింటిపై సమగ్రంగా అధ్యయనం చేసి పోర్టల్‌ను పునర్నిర్మించే బాధ్యతను కమిటీకి అప్పగించింది. కొత్త సమస్యలు తలెత్తకుండా... ఉన్న సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని కనుకోవడంలో ఈ కమిటీ సమగ్రంగా పనిచేయాలి. ఇప్పటికే ధరణి పోర్టల్‌లో 33 మాడ్యూళ్లను అమల్లోకి తీసుకొచ్చినా... భూముల సమస్యలు పరిష్కారం కాలేదు. అందుకే భూమాత పోర్టల్ తీసుకురావడానికి ముందే... ఉన్న సమస్యలకు పరిష్కరించి.. అవి మళ్లీ తలెత్తకుండా ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. పట్టా భూములతో పాటు అన్ని రకాల భూముల సమస్యలను పరిష్కరించ గలిగేలా చూడాలి. ఈ ఐదుగురు సభ్యుల కమిటీ జిల్లాల్లో పర్యటించి.. భూ సమస్యలపై అధ్యయనం చేయాలి. కమిటీకి కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు పూర్తి స్థాయిలో సహకరించాలని ప్రభుత్వం సూచించింది. భూ సమస్యల మూలాలను కనుగొని... వాటి పరిష్కారాలపై అధ్యయనం చేసి వీలైనంత త్వరగా నివేదిక అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇకపోతే ప్రధానంగా దేవాదాయ, వక్ఫ్ భూములను కాజేశారు. ఇటీవలి భూసమగ్ర సర్వేలా జిల్లాల వారీగా దేవాదాయ భూమల గుర్తింపు స్వాధీనంపై తెలంగాణ దేవాదాయ శాఖ ప్రకటన చేయలేకపోయింది. ఏ గ్రామంలో ఎంత భూమి ఉందో గుర్తించిన దాఖలాలు లేవు. ఆయా గ్రామాల్లో కోట్ల విలువైన భూములు ఉన్నా వాటిని ఎందుకు స్వాధీనం చేసుకోలేదో చెప్పడం లేదు. అలాగే అర్చక సంఘాలు, బ్రాహ్మణ సంఘాలు కూడా క్షేత్రస్థాయి వివరాలను ప్రభుత్వానికి నివేదించినా పట్టించుకోలేదు. ఆలయ భూములు అన్యాక్రాంతం అయినా,ఆలయాల్లో ధూపదీప నైవేద్యం కరువైనా పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. గ్రామస్థాయిలో సర్పంచ్‌లు కూడా దేవాదాయ భూముల గురించి తెలిసినా పెద్దగా పట్టించుకోవడం లేదు. జిల్లా ఎండోమెంట్ అధికారులు కూడా ఇలాంటి వాటి జోలికి వెళ్లడం లేదు. అసిస్టెంట్ కమిషనర్లు ఉత్సవ విగ్రహాల్లో ఆలయ భూముల అన్యాక్రాంతాన్ని పట్టించుకోవడం లేదు. కోట్లాది రూపాయల విలువైన భూములను కాపాడే క్రమంలో తెలంగాణలో బిఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వెనక..కబ్జాల మోసం దాగివుంది. పదేళ్ల కెసిఆర్ పాలనలో కనీసం ఒక్క ఎకరా కూడా స్వాధీనం చేసుకున్న దాఖలాలు లేవు. గ్రామాల్లో మాన్యాలను మింగేసిన ఘనుల భరతం పట్టాలి. గుళ్ల పేరుతో ఉన్న ఆస్తులను కొందరు అక్రమార్కులు కబ్జా చేసుకున్నారు. ధరణిలో తమపేరుతో ఎక్కించేసుకున్నారు. ఇలా వేల ఎకరాల వరకు అన్యాక్రాంతం అయ్యాయి. వాటి విలువ ఇప్పుడు వేలకోట్లల్లో ఉంటుందని అంచనా. కనీసం ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి కౌలు చెల్లించే విధంగా వేలం కూడా నిర్వహించలేని దుస్థితి నెలకొంది. ఇలాంటి భూములను కూడా గుర్తించి స్వాధీనం చేసుకుని కబ్జాచెరకు విముక్తి కలిగించాలి.

### సమాంతర పాలనతో

# వ్యవస్థల భ్రష్టు..!

వ్యవస్థలను భ్రష్టు పట్టించడం ద్వారా ఎన్నికల్లో ఎలా గెలవ వచ్చో పాలక పార్టీలు బాగా వంటబట్టించుకున్నాయి. అందుకు అనుగుణంగా రకరకాల విన్యాసాలు చేస్తున్నాయి. తమకు అనుకూలంగా కొత్త వ్యవస్థలను సృష్టిస్తున్నాయి. గతంలో టిడిపి అధికారంలో ఉండగా జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేసింది. వాటి ద్వారానే కార్యక్రమాలను అమలు చేశారు. ఈ కమిటీలను విమర్శించిన వైసిపి అధికారంలోకి రాగానే వాటి స్థానంలో గ్రామ సచివాలయం అంటూ కొత్త వ్యవస్థను ఏర్పాటు చేసి, సెక్రటీరలను నియమిం చింది. ఈ రెండు పద్దతులు కూడా పంచాయితీ వ్యవస్థను మింగేశాయి. పంచాయితీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేశాయి. సమాంతర వ్యవస్థలను ఏర్పాటు చేసుకుని గ్రామస్థా యిలో తమకు అనుకూలంగా వ్యవహారాలను నడుపుతూ వచ్చారు. దీంతో సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు ఉత్సవ విగ్రహాల్లాగా మారారు. తెలంగాణలో రెవెన్యూ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు వివో, విఆర్‌ఎ వ్యవస్థలను తీసి అవతల పడేశారు. ఎన్టీఆర్ హయాంలో గ్రామీణ వ్యవస్థకు పట్టుకొమ్మగా ఉన్న పటేల్,పట్వారీ వ్యవస్థను రద్దు చేశారు. దానికి ప్రత్యామ్నాయం ఆలోచించకుండా నిర్ణయాలు తీసుకోవడంతో ఇప్పటికీ రెవెన్యూ వ్యవస్థను కోలుకోకుండా చేశారు. నిజానికి ఇదంతా మంచి చేశామని అనుకుంటున్నారు. దీనివెనక పెద్ద స్వార్థం దాగివుందన్నది నిజం. ఎందుకంటే గ్రామస్థాయిలో కార్యక్రమాలను సిఎం స్థాయిలో అమలు చేయాలన్న స్వార్థ లక్ష్యంతోనే సచివాలయ వ్యవస్థను తీసుకుని వచ్చారు. ఇది కాదనలేని నిజం. తాజాగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ఏర్పాటు, నిర్వహణపైన, రాష్ట్ర రాజధాని అమరావతి విషయంలోనూ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ కాగ్ చేసిన వ్యాఖ్యలు అక్షర సత్యాలు. పాలకుల తీరుతెన్నులను కాగ్ ఉన్నదివున్నట్లుగా వెల్లడించింది. సామాన్యులకు ప్రభుత్వ సేవలను క్షేత్రస్థాయిలో అందించడంలో సచివాలయ వ్యవస్థ పాత్ర పోషిస్తున్నదని చెప్పుకుంటున్నా..రాజ్యాంగ స్ఫూర్తిని నీరుగార్చేలా ఉంది. 74వ రాజ్యాంగ సవరణ చట్టం పట్టణ స్థానిక సంస్థలకు రాజ్యాంగ హోదాను అందించింది. ఎన్నికైన ప్రజా ప్రతినిధులు, పౌరులను భాగస్వామ్యం చేయడం, పౌరులకు పాలనను చేరువ చేయడం స్థానిక స్వపరి పాలన ప్రధాన లక్ష్యం. రాష్ట్రంలో ఎక్కడా వార్డు కమిటీలను ఏర్పాటు చేయనే లేదు. ఇక పౌరులను భాగస్వామ్యం చేసే పరిస్థితి అస్సలు లేదు. ఇవి రెండూ చేపట్టకుండా వార్డు స్థాయిలో సచివా లయాల వ్యవస్థ రూపుదిద్దుకోవడం స్థానిక స్వపరిపాల నకు ఉద్దేశించిన రాజ్యాంగ స్ఫూర్తిని నీరుగార్చడమే. వార్డు కమిటీలను ఏర్పాటు చేసి, ఆయా కమిటీలు, ఏరియా సభలతో వార్డు సచివాలయాలను అనుసం ధానం చేస్తేనే స్వపరిపాలన సాధ్యమవుతుంది. 74వ రాజ్యాంగ సవరణ చట్టం, ఆంధ్రప్రదేశ్ పురపాలక చట్టా ల్లోని నిబంధనలకు అనుగుణంగా పాలన నడవాల్సి ఉండగా సచివాలయ వ్యవస్థ దెబ్బతీస్తోంది. ప్రజాస్వా మ్యం లో ప్రభుత్వాలు మారినా... ప్రజలకు సేవ చేసే విషయంలో పోటీపడి, ప్రజాధనానికి నష్టం కలగకుండా చేయాల్సిన బృహత్తర కర్తవ్యం పాలకులది. ఆ స్ఫూర్తిని ప్రభుత్వాలు మంటగలిపితే... కలిగే అనర్థాలకు సచివా లయ వ్యవస్థ అద్దం పడుతుంది. అప్పట్లో జన్మభూమి కమిటీలు నిర్వహించిన పాత్రనే ఇప్పుడు సచివాలయ వ్యవస్థ నిర్వహిస్తోంది. భారత రాజ్యాంగంలోని 12వ షెడ్యూల్‌లో పేర్కొన్న 18 విధులు నిర్వహించేందుకు పట్టణ, స్థానిక సంస్థలకు అధికారం ఇచ్చింది. వాటిలో 13 విధులను పూర్తిగాను, మూడు విధులను పాక్షికం గానూ నగర పాలక సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగిం చింది. ఇక పురపాలక,నగర పంచాయతీల విషయానికి వస్తే ఏడు విధులను పూర్తిగాను, ఐదు విధులను పాక్షికం గానూ అప్పగించింది. వార్డు, గ్రామ సచివాలయాల వ్యవస్థను 2019 జులై నుంచి నగర పాలక సంస్థలు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో రాష్ట్రప్రభుత్వం అమలు చేయడం ప్రారంభించింది. రాష్ట్రంలో పట్టణ స్థానిక సంస్థలకు సకాలంలో ఎన్నికలు జరపడం లేదు. ఎక్కువ స్థానిక సంస్థలు ఎన్నికైన ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం లేకుండా రాష్ట్రప్రభుత్వ కనుసన్నల్లో... ప్రత్యేక అధికారుల పాలనలోనే మగ్గుతున్నాయి. నిజానికి పంచాయితీ వ్యవస్థను ఏర్పాటు చేసిందే... గ్రామాల ఆర్థికవ్యవస్థను అభివృద్ధి చేయడం కోసం. దానిని నిర్వీర్యం చేసి,సొంతంగా..సమాంతర వ్యవస్థలను సృష్టించి ఓట్లవేట మొదలు పెట్టడం చూస్తున్నాం. వీరికి గ్రామాల అభివృద్ధి లక్ష్యం అయివుంటే ఈ పాటికి కనీసం పాతికశాతం ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యేవి. కానీ అలా జరగడం లేదు. అంటే సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలు కొత్త సమస్యలు ఎదుర్కొం టున్నారు. ప్రజల సమాచారం దుర్వినియోగం అవుతోందని, ఎవరికో దీనిని అప్పగిస్తున్నారని ఇటీవల జనసేనాని పవన్ కళ్యాణ్ ఆరోపించారు. దీనికి సమాధానం చెప్పకుండా విమర్శలకు దిగారు..అంటే తమ లక్ష్యానికి అడ్డుగా వస్తున్నారని వారు భావిస్తున్నారు. తాజాగా ఇప్పుడు కాగ్ ఇదే రకమైన అభిప్రాయం వ్యక్తం చేసింది. దీనికైనా సమాధానం చెప్పుకోవాలి. ఈ క్రమంలో పంచాయితీలకు రావాల్సిన నిధులను కేంద్రప్రభుత్వం మెడలు వంచి నిధులు రాబట్టలేకపోతున్నారు. ఇకపోతే 2019 నుంచి అమరావతికి బడ్జెట్ సహకారం లేకపోవడం, రూ.33,476 కోట్లు రుణంగా సమీకరిర చుకో వాల్సి ఉరడగా, రూ.8,540 కోట్లే సమీకరిం చడం, కాలపరిమితి లేకుండా ఉన్న 55 ప్యాకేజిల ఒప్పందాలపై అనిశ్చితి, వాటిని పూర్తి చేయడానికి అవసరమైన రూ.28,048 కోట్లపై స్పష్టత లేకపోవడం... ఇలా ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని కాగ్ ఎండగట్టింది. భూసమీకరణకు రూ.2,245 కోట్లు సిఆర్‌డిఎ వ్యయం చేయగా, ఆ భూమంతా నిరుపయోగంగా పడి వుంది. ప్రభుత్వ భూములను వదిలేసి ప్రైవేటు భూములనే రాజధానికి సేకరించడం, 70 శాతాన్ని భూసమీకరణ ద్వారా సేకరించాలని అప్పట్లో తీసుకున్న నిర్ణయాన్ని కాగ్ నివేదిక ఆక్షేపించింది. ఇలా వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నా..కాగ్ తప్పు పట్టినా పట్టించుకునే వ్యవస్థ ఉందా అన్నది అనుమానం. కేంద్రం కూడా ఇలాంటి తరహా వ్యవస్థలను చూసీచూడనట్లుగా ఉండడం దారుణం కాక మరోటి కాదు.




## చెట్టు చాటుకెళ్లి దుస్తులు మార్చుకోమన్నారు

దేశానికి గర్వకారణమైన నటీమణుల్లో శోభన ఒకరు. నాట్యానికి జీవితాన్ని అంకితం చేసి, వైవాహిక జీవితాన్ని సైతం త్యాగం చేసిన గొప్ప కళాకారిణి శోభన. ఇటీవలే ఆమె 'పద్మభూషణ్' పురస్కారాన్ని అందుకున్న విషయం తెలిసిందే. రీసెంట్‌గా తన ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులతో ఇంటరాక్ట్ అయిన శోభన.. కొన్నేళ్ల క్రితం షూటింగ్‌లో తనకు ఎదురైన ఓ చేదు అనుభవాన్ని గుర్తు చేసుకున్నారు. ' 'కల్కి' సినిమాలో అమితాబ్ సార్‌తో కలిసి నేను నటించిన విషయం అందరికీ తెలిసిందే. కానీ అంతకు ముందే ఆయనతో నేనొక సినిమా చేశా. అయితే.. అందులో నేను హీరోయిన్‌ని కాదు. ఓ ప్రత్యేక గీతంలో నర్తించానంతే. అహ్మదాబాద్‌లో ఆ పాట షూటింగ్ జరిగింది. ఆ రోజును జీవితంలో మర్చిపోలేను. ఆ ఒక్క పాటలోనే నేను చాలా కాస్ట్యూమ్స్ మార్చుకోవాల్సివుంది. అమితాబ్ కోసం ప్రత్యేకంగా కారవాన్ తెప్పించారు. నాకు కారవాన్ లేదు. అమితాబ్ షూటింగ్ అవుడ్డోర్‌లో కావడంతో ఆయన్ను చూసేందుకు జనం విరగబడ్డారు. ఎటు చూసినా జనమే. డ్రెస్ మార్చుకోవాలి ఎలా? చేసేది లేక చిత్రబృందాన్ని అనడిగాను. వారిలో ఓ వ్యక్తి.. 'ఆమె కేరళ నుంచి వచ్చింది.. అక్కడి వాళ్లు దేనికైనా సర్దుకుపోతారు.. ఆ చెట్టు వెనక్కెళ్లి మార్చుకోమను..' అనేశాడు. నాకు కళ్లవెంట నీళ్లు తిరిగాయి. ఆ వ్యక్తి మాట్లాడిన మాటలు వాకీ టాకీలో అమితాబ్ విన్నారు. పట్టరాని కోపంతో కారవాన్ నుంచి బయటకొచ్చి, అతన్ని పిచ్చి తిట్లు తిట్టారు. ఆ క్షణం అమితాబ్‌ని చూస్తే నాకు చెప్పలేనంత భయం వేసింది. చివరకు తన కారవాన్ నాకిచ్చి, ఆయన బయటే కూర్చున్నారు. ఆ క్షణాలు నేనెప్పటికీ మరిచిపోలేను. ఇన్నాళ్లకు మళ్లీ 'కల్కి' సినిమా పుణ్యమా అని ఆయనతో వర్క్ చేసే అవకాశం దొరికింది. లొకేషన్‌లో ఎవరైనా తన వద్దకు వస్తే, లేచి నిల్చొని విష్ చేస్తారాయన. స్టార్‌గా ఇండియాలో అమితాబ్ స్థాయి ఎవరికీ లేదు. కానీ ఆయన ఒదిగి ఉంటారు. సంప్రదాయాలకు, సంస్కృతికి విలువిస్తారు.' అంటూ చెప్పుకొచ్చారు శోభన.

# అంతుచిక్కని ఓ రహస్యం

ఆదిసాయికుమార్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'శంబాల'. 'ఏ మిస్టికల్ వరల్డ్' ఉపశీర్షిక. యుగంధర్ ముని దర్శకుడు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. శనివారం టీజర్‌ను విడుదల చేశారు. 'ఈ విశ్వంలో అంతుపట్టని రహస్యాలెన్నో ఉన్నాయి. సమాధానం దొరకనప్పుడు సైన్స్ దాన్ని మూఢ నమ్మకం అంటుంది. దొరికితే అదే తన గొప్పదనం అంటుంది' అనే సంభాషణతో మొదలైన టీజర్ ఇంట్రెస్టింగ్‌గా సాగింది. విజువల్స్, బీజీఎమ్ హైలైట్‌గా నిలిచాయి. అంతరిక్షం నుంచి అతీంద్రియ శక్తి కలిగిన ఓ ఉల్క గ్రామంలో పడటం, జనాలు చనిపోవడం, కొందరు వింతగా ప్రవర్తించడం వంటి సన్నివేశాలతో ట్రైలర్ ఉత్కంఠను పెంచింది. మిస్టిక్ థ్రిల్లర్ చిత్రమిదని, త్వరలో రిలీజ్ డేట్ ప్రకటిస్తామని మేకర్స్ పేర్కొన్నారు.



## విడుదలకు సమాయత్తమవుతున్న సర్దార్ 2



తమిళ అగ్ర హీరో కార్తీ కథానాయకుడిగా వచ్చిన 'సర్దార్' చిత్రం తెలుగులో కూడా మంచి విజయం సాధించిన విషయం విదితమే. ఆ సినిమాకు కొనసాగింపుగా రూపొందుతున్న 'సర్దార్ 2' చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా టీం అందరూ కలిసి సెట్‌లో కేక్ కట్ చేసి సెలబ్రేట్ చేసుకున్న ఫోటోలని మేకర్స్ విడుదల చేశారు. ప్రీక్వెల్‌ని మించేలా ఈ సీక్వెల్ ఉంటుందని, 'సర్దార్'గా మరోసారి కార్తీ నట విశ్వరూపాన్ని ప్రేక్షకులు చూస్తారని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని మేకర్స్ తెలిపారు. మాళవిక మోహనన్, ఆషికా రంగనాథ్, రజిషా విజయన్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో ఎస్.జె.సూర్య ఓ పవర్‌ఫుల్ పాత్ర పోషిస్తున్నారు. ప్రీక్వెల్‌ని తెరకెక్కించిన పిఎస్ మిత్రన్ ఈ సీక్వెల్‌కి కూడా దర్శకుడు. ఈ చిత్రానికి కెమెరా: జార్జ్ సి.విలియమ్స్, సంగీతం: యువన్ శంకర్ రాజా, నిర్మాత: ఎస్.లక్ష్మణ్ కుమార్.



# ఆశ్చర్యపరిచే పయనం

సుప్రజ్, సంగీర్తన విపిన్ జంటగా, చందురామ్ దర్శకత్వంలో స్వర్ణకమల నిర్మిస్తున్న 'పయనం' చిత్రం ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ కొరియోగ్రాఫర్ రఘు మాస్టర్ క్లాప్ ఇవ్వగా, నటుడు, సంగీత దర్శకుడు రఘు కుంచె కెమెరా స్విచాన్ చేశారు. కొత్త కాన్సెప్ట్‌తో రూపొందనున్న సస్పెన్స్ థ్రిల్లర్ ఇదని, ఆడియన్స్‌ని ఆశ్చర్యపరిచే అంశాలు ఇందులో పుష్కలంగా ఉంటాయని దర్శకుడు చెప్పారు. జూలై 7 నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుందని, మంచిర్యాల, తమిళనాడు, ఒరిస్సా పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరుపుతామని నిర్మాత తెలిపారు. అవసరాల శ్రీనివాస్ ప్రత్యేక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రంలో ఆమని, మైమ్ మధు, మెహబూబ్ భాషా తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి రచనా సహకారం, మాటలు, స్క్రీన్‌ప్లే: వీరారెడ్డి, సతీష్‌కుమార్ మూల, కెమెరా: షోయబ్, సంగీతం: రఘు కుంచె, నిర్మాణం: ఛాయ చిత్రాలు.



# ఎల్లమ్మ జాతరకు రంగం సిద్ధం

షూటింగ్ ఇంకా మొదలుకాలేదు. నటీనటులెవరో పూర్తిగా ఖరారు కాలేదు. హీరో నితిన్ అంటున్నారు. హీరోయిన్‌గా కీర్తి సురేశ్ ఖారారైందంటున్నారు. అధికారికంగా మాత్రం ఇప్పటివరకూ ఏ ప్రకటనా రాలేదు. కానీ.. 'ఎల్లమ్మ' సినిమాపై అంచనాలు మాత్రం ఆకాశంలో ఉన్నాయి. వేణు యల్దెండి దర్శకత్వం వహించనున్న ఈ సినిమా షూటింగ్ త్వరలో మొదలు కానుంది. నిర్మాత దిల్‌రాజు 'బలగం' సినిమాకోసం



వేణుకు లిమిటెడ్ బడ్జెట్ మాత్రమే ప్రొవైడ్ చేశారు. కానీ 'ఎల్లమ్మ'కు మాత్రం అన్ లిమిటెడ్ బడ్జెట్ అంటున్నారట. ఆ కథను దిల్ రాజు అంత నమ్మారన్నమాట. రంగస్థల కళాకారుల నేపథ్యంలో ఓ గ్రామదేవత చుట్టూ ఈ కథ నడుస్తుందని సమాచారం. దర్శకుడు బలగం వేణు.. ఈ సినిమా విషయంలో పగడ్బందీగా వ్యవహరిస్తున్నారని ఇన్‌సైడ్ టాక్.

## లేడీ మాఫియా డాన్‌గా

బాలీవుడ్‌లో 'అక్క' అనే వెబ్ సిరీస్‌లో నటిస్తున్నది మహానటి కీర్తి సురేశ్. ఇందులో ఈమె ఓ మాఫియా డాన్‌గా కనిపిస్తుందట. రీసెంట్‌గా ఈ విషయంపై బాలీవుడ్ మీడియా కీర్తి సురేష్‌ని ప్రశ్నించింది. కీర్తి మాట్లాడుతూ 'ఇదొక ఛాలెంజింగ్ రోల్. నటిగా నాకు మాత్రమే ఇలాంటి పాత్రలు దక్కడం అదృష్టం. ఇందులో నా గెటప్, శారీరక భాష పెక్యులర్‌గా ఉంటాయ్. దర్శకుడు ధర్మరాజ్ శెట్టి అద్భుతమైన కాన్సెప్ట్‌తో 'అక్క'ను తీర్చిదిద్దుతున్నారు. కథానుగుణంగా రాధికా ఆప్టే ఈ సిరీస్‌కి కథానాయిక. మరి 'అక్క' ఎవరు? అనే విషయం మాత్రం సస్పెన్స్.' అంటూ అందంగా నవ్వేసింది కీర్తి సురేశ్. ప్రతిష్టాత్మక యష్ రాజ్ ఫిల్మ్స్ పతాకంపై ఈ సిరీస్ రూపొందుతున్నది.

Editer : Gunnala Anil Reddy,Address : Krushi Nagar, Sharelingampalli Mandalam, Ranga Reddy(Dist) Telangana Cell : 9705043131,8096660656